www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

Galaxy S25 Edge
Galaxy AI

సోమవారం | 19-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 33 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి ఉ.6.12 తదుపరి సప్తమి; నక్షత్రం: శ్రవణం రా.7.30 తదుపరి ధనిష్ఠ వర్జ్యం: రా.11.30-1.06, దుర్ముహూర్తం: ఉ.12.37-1.28, మ.3.11-4.03, అమృతఘడియలు: ఉ.8.49-10.28, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 5.45, సూర్యాస్తమయం: 6.37 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 19-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 33 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ*

2
ఇస్రో బాణం గురితప్పింది



పీఎస్ఎల్వీ-సీ61 మూడో దశలో సాంకేతిక సమస్య

గతి తప్పిన రాకెట్.. దిశ మార్చేందుకు ఇస్రో ప్రయత్నం

ఫలించకపోవడంతో రాకెట్ నింగిలోనే పేల్చివేత

కక్ష్యలోకి చేరలేకపోయిన ఈవోఎస్-09 ఉపగ్రహం

హైదరాబాద్ చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌజ్ వద్ద అగ్ని ప్రమాదం జరిగిన భవనం; లోపల పూర్తిగా కాలిపోయిన దృశ్యం; భవనం లోపలి నుంచి చిన్నారిని తీసుకొస్తున్న ఫైర్ సిబ్బంది



మృత్యు జ్వాల

17 మంది మృతి

చార్మినార్ గుల్జార్‌హౌజ్ వద్ద ఘోర అగ్ని ప్రమాదం

మృతుల్లో 8 మంది చిన్నారులు, ఐదుగురు మహిళలు, నలుగురు వృద్ధులు

స్థానిక వ్యాపారి ఇంట్లో ఉదయాన్నే చెలరేగిన మంటలు

భయంతో ఒకే గదిలోకి వెళ్లి తలుపులు మూసేసుకున్న పది మంది.. పొగ, వేడి కారణంగా అపస్మారకస్థితిలోకి

ఆస్పత్రికి తీసుకెళ్లేసరికే వారిలో చాలా మంది మృతి

పక్క భవనం గోడలకు రంధ్రాలు చేసి.. ప్రమాదం జరిగిన భవనం లోపలికెళ్లిన అగ్నిమాపక సిబ్బంది

ఫైరింజన్‌లో నీళ్లు లేవు.. అంబులెన్స్‌లో ఆక్సిజన్ లేదు

ఉస్మానియాలో మంత్రులపై మృతుల బంధువుల ఆగ్రహం

షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం: ఫైర్ డీజీ నాగిరెడ్డి

షార్ట్ సర్క్యూట్ జరిగిన ఆనవాళ్లేవీ లేవు: సీతక్క చక్రపాణి

ఐదుగురు చిన్నారులను పట్టుకొని కూర్చున్న మహిళ

అందరూ ఊపిరాడక మృతి

సీఎం తీవ్ర దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్‌గ్రేషియా

బాధిత కుటుంబాలకు ఫోన్‌లో రేవంత్ పరామర్శ

ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశం

సంఘటనా స్థలానికి భట్టి, పొన్నం, దామోదర

మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం

క్షతగాత్రులకు రూ.50 వేలు: ప్రధాని మోదీ

ఇద్దరు అన్నదమ్ములు.. వారి పిల్లలు, మనవలు.. అంతా కలిపి 24 మంది! వేసవి సెలవుల్లో సరదాగా గడుపుదామని అంతా ఒకే చోటికి చేరారు!! రెండు రోజులపాటు ఆనందంగా గడిపారు. కానీ.. ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం రూపంలో మృత్యువు వారిలో 17 మందిని కబళించింది. అంతా నిద్రలో ఉండగా.. అగ్నికీలలు చుట్టుముట్టాయి. ప్రమాద సమయంలో మొదటి అంతస్తులో ఉన్నవారు కిందకి వెళ్లే దారి లేక, పైకి వెళ్లే దారి కనపడక.. ఏం చేయాలో తోచక.. ఒక గదిలోకి వెళ్లి తలుపులు మూసేసుకున్నారు! పొగ, వేడి తీవ్రతకు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. అగ్నిమాపక సిబ్బంది, సహాయక సిబ్బంది వచ్చి ఆస్పత్రులకు తరలించినా ఉపయోగం లేకపోయింది. ఈ ప్రమాదంలో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులు ఉండడం అందరి హృదయాలనూ కలచివేసింది. 11

మందుబాబులకు షాక్!



మద్యం ధరలు పెంచిన ప్రభుత్వం.. క్వార్టర్‌కు రూ.10, ఫుల్‌బాటిల్‌కు రూ.40 పెంపు

ఆదివారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి.. సర్కారుకు నెలకు రూ.160 కోట్ల అదనపు ఆదాయం

చీప్‌లిక్కర్, బ్రీజర్‌కు పెంపు నుంచి మినహాయింపు.. ఫిబ్రవరిలో బీర్ల ధరలు పెంచిన సర్కారు

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): మందుబాబులకు ప్రభుత్వం షాకిచ్చింది. రాష్ట్రంలో మద్యం ధరలను పెంచింది. క్వార్టర్‌కు రూ.10, హాఫ్‌కు రూ.20, ఫుల్‌బాటిల్‌కు రూ.40 చొప్పున ధరలు పెంచుతూ ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ధరల పెంపు వల్ల ప్రభుత్వానికి నెలకు రూ.160 కోట్ల మేర అదనపు ఆదాయం లభించనుంది. కాగా, క్వార్టర్ రూ.110కి అమ్ముతున్న చీప్‌లిక్కర్ ధరను మాత్రం పెంచలేదు. ఎక్కువ మంది పేదలు తాగే మద్యంగా దీనికి గుర్తింపు ఉంది. అదే సమయంలో తక్కువ ఆల్కహాల్ శాతం ఉండే బ్రీజర్ ధరలను కూడా పెంచలేదు. ఈ రెండు మినహా మిగతా అన్ని బ్రాండ్ల మద్యం ధరలనూ పెంచారు. పెరిగిన ధరలు ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి

మిగతా 3వ పేజీలో...

సౌర గిరి జలవికాసం
12 నల్లమలలో ఆరంభం

నేడు మాచారంలో సోలార్ పంపుసెట్లు పంపిణీ చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి

అనంతరం సభ.. ఆపై స్వగ్రామానికి..

కొండారెడ్డిపల్లిలో ఆంజనేయస్వామి గుడిలో పూజలు చేసి హైదరాబాద్‌కు

మున్నేరు-పాలేరు లింక్ కెనాల్‌కు రూ.162.54 కోట్లు విడుదల

12 సముద్రంలోకి పోయే నీటిని గ్రావిటీ కెనాల్ ద్వారా మళ్లింపు

సీఎం రేవంత్, సాగునీటి మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి పొంగులేటి

12 హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర!

ఇద్దర్ని అరెస్టు చేసిన రాష్ట్ర, ఏపీ పోలీసులు

నిందితులకు ఐఎస్‌తో సంబంధాలు

భారత్ సిమ్‌కార్డులతో పాక్‌లో వాట్సాప్

సైబర్ నేరగాళ్లు, ఉగ్రవాదుల చేతికి నంబర్లు

2 'ఆపరేషన్ ఘోస్ట్ సిమ్' పేరుతో అసోం, రాజస్థాన్, తెలంగాణలో ఏకకాలంలో దాడులు

ఏడుగురి అరెస్టు.. 948 సిమ్ కార్డుల స్వాధీనం

సంగారెడ్డిలో పట్టుబడ్డ మొఫిసిల్ ఇస్లాం

పాక్‌లో లష్కర్ ఉగ్రవాది సఫీవుల్లా హతం

సింధ్ ప్రావిన్స్‌లో గుర్తు తెలియని వ్యక్తి కాల్పులు

2 భారత్‌లో జరిగిన పలు దాడుల్లో కీలక పాత్ర

1 నుంచి సినిమా థియేటర్లు బంద్.. ఎగ్జిబిటర్ల నిర్ణయం 10

ఆంధ్రజ్యోతి

భారత్ సిమ్‌కార్డులతో
పాకిస్థాన్‌లో వాట్సాప్

- మిలటరీ ఇంటెలిజెన్స్ సమాచారంతో 'ఆపరేషన్ ఘోస్ట్ సిమ్'' పేరుతో ఏకకాలంలో మూడు రాష్ట్రాల్లో దాడులు
- ఏడుగురి అరెస్టు.. 948 సిమ్ కార్డుల స్వాధీనం
- సంగారెడ్డిలో పట్టుబడ్డ తాపీ మేస్త్రీ మొఫిసిల్ ఇస్లాం



గువాహటి/సంగారెడ్డి క్రైం(ఆంధ్రజ్యోతి), మే 18: "భారత ఆర్మీ జవానుకు.. పాకిస్థాన్ ఐఎస్ఐ నుంచి హనీట్రాప్..".. "భారత సిమ్‌కార్డులతో పాకిస్థానీ సైబర్ నేరగాళ్ల బురిడీ.. అమాయకుల లూటీ".. "టెర్రరిస్టుల ఫోన్లలో భారత సిమ్ నంబర్ల వాట్సాప్/టెలిగ్రామ్..".. తరచూ పతాక శీర్షికలకెక్కే ఈ తరహా వార్తల వెనక ఉన్న భారీ నెట్‌వర్క్ గుట్టును అసోం పోలీసులు రట్టు చేశారు. మిలటరీ ఇంటెలిజెన్స్ ఇచ్చిన సమాచారంతో 'ఆపరేషన్ ఘోస్ట్ సిమ్' పేరుతో రంగంలోకి దిగిన అసోం పోలీసులు తెలంగాణ సహా.. మూడు రాష్ట్రాల్లో ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 948 సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోం డీజీపీ హర్మీత్‌సింగ్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. మిలటరీ ఇంటెలిజెన్స్‌కు చెందిన గజరాజ్ కార్ప్స్ నుంచి పాకిస్థాన్‌లో వాడుతున్న ఘోస్ట్ సిమ్ నంబర్లపై అసోం పోలీసులకు సమాచారం అందింది. అంటే.. భారత్‌లో కొనుగోలు చేసిన సిమ్‌కార్డులకు సంబంధించిన వాట్సాప్, టెలిగ్రామ్ వంటి యాప్స్‌ను పాకిస్థాన్‌లో ఉన్న వారు నేరాల కోసం వాడుతుంటారు. మిలటరీ ఇంటెలిజెన్స్ గుర్తించిన నిందితులంతా దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నా.. అసోంకు చెందినవారే కావడంతో సమాచారాన్ని ఆ రాష్ట్ర పోలీసులకు అందజేశారు. "వెంటనే స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్టీఎఫ్)ను రంగంలోకి దింపాం. అసోంతో పాటు.. రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈనెల 16న దాడులు నిర్వహించి, ఏడుగురు నిందితులను అరెస్టు చేశాం. వీరిలో రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో సాధిక్(47), అఖీక్(25), అల్వార్‌లో ఆరిఫ్‌ఖాన్(20), సాజిత్(21), అసోంలోని ధూబ్రీకి చెందిన జకారియా అహ్మద్(24), ఇదే ప్రాంతానికి చెందిన మొఫిసిల్ ఇస్లాం(19)ని తెలంగాణలోని సంగారెడ్డిలో అరెస్టు చేశాం. ధూబ్రీకి చెందిన అర్షద్‌ఖాన్(34) విదేశాలకు వెళ్తుండగా.. ఢిల్లీ విమానాశ్రయంలో పట్టుకున్నాం. తదుపరి దర్యాప్తులో ధూబ్రీకి చెందిన మరో 14 మందిని అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నాం" అని డీజీపీ వివరించారు. అరెస్టయిన ఏడుగురి నుంచి 948 సిమ్‌కార్డులను, అక్రమ కమ్యూనికేషన్‌కు ఉపయోగించే పలు పరికరాలను సీజ్ చేశామని, అరెస్టుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని చెప్పారు. "నిందితులు భారత్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో తప్పుడు డాక్యుమెంట్లతో సిమ్‌కార్డులు తీసుకుంటారని తేలింది. వారు పాకిస్థాన్‌లో ఉన్న వారికి ఆ వివరాలను అందజేసేవారు. పాక్‌లో ఉన్నవారు వాట్సాప్, టెలిగ్రామ్ వంటి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటే.. నిందితులు వారికి ఓటీపీలను అందజేసి, ఆయా యాప్‌లను యాక్టివేట్ చేయించేవారు. పాకిస్థాన్‌లో ఉండేవారు ఆ వాట్సాప్, టెలిగ్రామ్ యాప్‌లను సైబర్ నేరాలకు వాడేవారా? ఉగ్రవాదానికా? లేక ఇంకేమైనా నేరాలకా? అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది" అని ఎస్టీఎఫ్‌కు చెందిన ఓ అధికారి వ్యాఖ్యానించారు.

సంగారెడ్డిలో కలకలం

అసోం పోలీసులు అరెస్టు చేసిన మొఫిసిల్ ఇస్లాంకు పాకిస్థాన్‌తో లింకులున్నట్లు తేలడంతో.. సంగారెడ్డి జిల్లాలో కలకలం రేగింది. అతను జిల్లాలోని కొండాపూర్ మండలం గొల్లపల్లిలో తాపీమేస్త్రీగా పనిచేస్తున్నట్లు స్థానిక స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గుర్తించారు. అతనితో కలిసి పనిచేసిన వారిని, మొఫిసిల్‌ను పనిలో పెట్టుకున్న కాంట్రాక్టర్‌ని ఎస్బీ బృందాలు ఆదివారం విచారించాయి. ఈ విచారణలో మొఫిసిల్ పది రోజుల క్రితమే పనిలో చేరినట్లు తేలింది. దాంతో.. ఈ ప్రాంతంలో పనిచేస్తున్న అసోంకు చెందిన వారిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

'ఆపరేషన్ సిందూర్' తర్వాతే?

ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ ఐఎస్ఐకు చెందిన వారు భారతీయులతో ఇక్కడి సిమ్ నంబర్లతో సంభాషణలు కొనసాగించినట్లు మిలటరీ ఇంటెలిజెన్స్ గుర్తించినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌పైనా సమాచారం కోసం కేంద్ర ఉద్యోగులకు వాట్సాప్‌లో సందేశాలు వచ్చినట్లు సమాచారం. ఆ వాట్సాప్ ఖాతాలను పరిశీలించగా.. సిమ్‌కార్డులు భారత్‌లో ఉండగా.. వాట్సాప్ వినియోగం పాక్‌లో జరుగుతున్నట్లు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన మిలటరీ ఇంటెలిజెన్స్.. ఆ సిమ్‌కార్డులు ఎవరి పేర్లతో ఉన్నాయో పరిశీలించి, సింహభాగం అసోం చిరునామాలు ఉండడంతో.. ఆ రాష్ట్ర పోలీసులకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

'పహల్గాం'కు ముందు జ్యోతి పాక్‌లోనే!

న్యూఢిల్లీ, మే 18: పాకిస్థాన్ ఏజెంట్లతో కలిసి గూఢచర్యానికి పాల్పడ్డ హరియాణాకు చెందిన యూట్యూబర్ జ్యోతిమల్హోత్రా(34) వ్యవహారంలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. పహల్గాం ఉగ్ర దాడికి ముందు ఆమె పాకిస్థాన్‌లోనే ఉందని హరియాణాలోని హిస్సార్ ఎస్పీ శశాంక్ కుమార్ సావన్ తెలిపారు. తరచూ ఆమె పాక్ పర్యటనలకు వెళ్లారని, ఒకసారి చైనా పర్యటనకూ వెళ్లినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ జ్యోతి మల్హోత్రా పాక్ ఏజెంట్లతో టచ్‌లో ఉన్నారని హిస్సార్ ఎస్పీ చెప్పారు. పోలీసులు ఆమె ఫోన్, లాప్‌టాప్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ విశ్లేషణ చేస్తున్నారు. కాగా, గతేడాది మే నెలలోనే కపిల్ జైన్ అనే 'ఎక్స్' వినియోగదారు జ్యోతిపై దృష్టి సారించాలని ఎన్ఐఏను కోరుతూ 'ఎక్స్'లో పోస్టు చేయడం విశేషం. ఆమె తొలుత పాక్ ఎంబసీలో ఫంక్షన్‌కు హాజరైందని, తర్వాత పాక్ పర్యటనకు వెళ్లిందని, అనంతరం కశ్మీర్ పర్యటనకూ వెళ్లనుందని... దీని వెనుక ఏదో ఉందని అందులో పేర్కొన్నారు. మే 7వ తేదీ నుంచి ఇప్పటివరకు పంజాబ్, హరియాణాల్లో మొత్తం ఏడుగురిని గూఢచర్యం కేసులో అరెస్టు చేశారు. ఈ గూఢచర్యం వ్యవహారం ఒడిశా రాష్ట్రానికీ చేరింది. ఒడిశాలో పూరీకి చెందిన ఓ మహిళా యూట్యూబర్‌కు జ్యోతి మల్హోత్రాతో పరిచయం ఉంది. జ్యోతి 2024 సెప్టెంబరులో పూరీని సందర్శించారు. పూరీకి చెందిన యూట్యూబర్ ఇటీవలే పాక్‌లోని కర్తార్‌పూర్ గురుద్వారాను సందర్శించారు.

గౌరవ్ గొగోయ్ ఐఎస్ఐతో పనిచేశారు

- కాంగ్రెస్ ఎంపీపై అసోం సీఎం హిమంత తీవ్ర ఆరోపణ

గువాహటి, మే 18: కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ఆ పార్టీ డిప్యూటీ నేత గౌరవ్ గొగోయ్‌పై అసోం సీఎం హిమాంత బిశ్వశర్మ తీవ్ర ఆరోపణలు చేశారు. పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ ఆహ్వానం మేరకు గౌరవ్ ఆ దేశంలో పర్యటించారని, ఆ సంస్థతో కలిసి పనిచేశారని తెలిపారు. తొలిసారిగా ఈ విషయాన్ని చెబుతున్నానని అన్నారు. ఇందుకు అన్ని ఆధారాలు ఉన్నాయని చెప్పారు. వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత సెప్టెంబరు పదో తేదీన ప్రజలకు వెల్లడిస్తామని తెలిపారు. బిశ్వశర్మ ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆరోపణ చేశారు. ఆయనేమీ విహార యాత్రకు వెళ్లలేదని, కచ్చితంగా శిక్షణ పొందడానికే వెళ్లి ఉంటారని ఆరోపించారు. దీనిపై గౌరవ్ గొగోయ్ స్పందిస్తూ సీఎం వ్యాఖ్యలు బి-గ్రేడ్ సినిమా కన్నా దారుణంగా ఉన్నాయని అన్నారు. ఆయన మానసిక ఆరోగ్యంపై తనకు ఆందోళన ఉందని చెప్పారు.

'సిందూర్'పై వివాదాస్పద పోస్టు.. ప్రొఫెసర్ అరెస్టు

సోనీపట్, మే 18: ఆపరేషన్ సిందూర్‌పై సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టు వివాదాస్పదంగా ఉందన్న ఆరోపణపై అశోకా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ అలీఖాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీలో ఉండగా ఆదివారం అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ నెల 7న ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. దీనిపై స్పందించిన అలీ ఖాన్.. వారు చెప్పిన మాటలు 'ఎవరికో ప్రతిబింబాలు మాదిరిగా ఉన్నాయ'న్న అర్థం వచ్చే రీతిలో వ్యాఖ్యానించారు. ఇది ఆ మహిళా సైనికాధికారులను అవమానించేదిగా ఉందంటూ కేసు నమోదైంది.

రాజ్యాంగమే సుప్రీం!

శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు పరస్పరం గౌరవించుకోవాలి

- ఈ వ్యవస్థల్లో ఏదీ ఎక్కువా.. తక్కువా కాదు
- ప్రజాస్వామ్యంలో 3 స్తంభాలూ సమానమే: సీజేఐ జస్టిస్ గవాయ్

ముంబై, మే 18: దేశంలో ఏ వ్యవస్థా గొప్పది కాదని.. భారత రాజ్యాంగం మాత్రమే సర్వోన్నతమైనదని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కీలక స్తంభాలు.. శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు మూడూ సమానమేనని అన్నారు. ఇవి ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరించాలని.. పరస్పరం గౌరవించుకోవాలని స్పష్టంచేశారు. న్యాయవ్యవస్థ తన పరిధిని అతిక్రమిస్తోందని పెద్దఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ నెల 14న 52వ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా ప్రమాణం చేసి తొలిసారి ముంబై వచ్చిన ఆయన్ను మహారాష్ట్ర-గోవా బార్ కౌన్సిల్ ఆదివారం సత్కరించింది. రాష్ట్ర న్యాయవాదుల సదస్సు కూడా నిర్వహించింది. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ ప్రసంగించారు. చట్టం చేసే అధికారం పార్లమెంటుకు ఉన్నప్పటికీ.. రాజ్యాంగ మౌలిక స్వరూపం జోలికి అది వెళ్లడానికి వీల్లేదన్నారు. 'రాజ్యాంగం సర్వోన్నత అధికారం, చట్టపాలన, న్యాయ వ్యవస్థకున్న స్వేచ్ఛ వంటివాటిని రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు సవరించడం గానీ, రద్దు చేయడం గానీ చేయజాలదు. రాజ్యాంగ మౌలిక నిర్మాణం దృఢతరమైనది. దాని మూలస్తంభాలైన శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు మూడూ సమానమే. కలిసిమెలిసి పనిచేయాలి' అని తెలిపారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న సమయంలో ప్రధాన న్యాయమూర్తిని కావడం సంతోషకరమని తెలిపారు. 'రాజ్యాంగంలోని మూడు స్తంభాలూ తమ తమ పరిధులకు లోబడి పనిచేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. శాసన, న్యాయ్యవ్యవస్థలు చేసిన పలు చట్టాల కారణంగానే సామాజిక-ఆర్థిక న్యాయం భావన నెరవేరుతుంది' అని ఆకాంక్షించారు. ఆయన ఇచ్చిన 50 కీలక తీర్పుల సంకలనాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. వాటిలో కొన్నిటిని జస్టిస్ గవాయ్ ప్రస్తావించారు. బుల్డోజర్ న్యాయానికి వ్యతిరేకంగా తానిచ్చిన తీర్పు గురించి వివరించారు. 'నివాస హక్కు ప్రాథమిక హక్కు. ఏ వ్యక్తి అయినా ఏదైనా కేసులో నిందితుడైనా.. దోషిగా నిర్ధారణ అయినా.. అతడి కుటుంబ నివాసం చట్టబద్ధమైనదైతే.. దానిని తొలగించడానికి, కూల్చడానికి వీల్లేదు. చట్ట పాలనను అనుసరించి వ్యవహరించాల్సిందే' అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ దత్తా, బొంబే హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే తదితరులు పాల్గొన్నారు.



సన్మాన కార్యక్రమంలో బాంబే హైకోర్టు సీజే జస్టిస్ అలోక్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్

'142' ప్రస్తావనపై చర్చ..

మహారాష్ట్ర సీఎస్, డీజీపీల ప్రోటోకాల్ ఉల్లంఘనపై జస్టిస్ గవాయ్ ఆర్టికల్ 142ను ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. చట్టసభలు పంపిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట కాలపరిమితికి లోబడి ఆమోదించాల్సిందేనని 142వ అధికరణ కింద తనకు సంక్రమించిన అధికారాన్ని వినియోగించి సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇటీవల చరిత్రాత్మక తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీన్ని ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ తీవ్రంగా విమర్శించారు. ఇంకోవైపు.. రాష్ట్రపతిని సైతం నిర్దేశించే అధికారం సర్వోన్నత న్యాయస్థానానికి ఉందా.. రాష్ట్రపతి గానీ, గవర్నర్ గానీ తమ విధుల నిర్వహణలో ఏ కోర్టుకూ జవాబుదారీ కాదని రాజ్యాంగంలోని 361వ అధికరణ చెబుతోందని.. 201వ అధికరణ కింద విచక్షణాధికారాలు ఉన్న రాష్ట్రపతికి న్యాయస్థానాలు గడువు నిర్దేశించవచ్చా.. తదితర 14 ప్రశ్నలు సంధిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటీవల సుప్రీంకోర్టును వివరణ కోరారు. ఇది కోర్టును ధిక్కరించడమేనంటూ విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో జస్టిస్ గవాయ్ 142 అధికరణపై చేసిన వ్యాఖ్య చర్చనీయాంశమైంది.

కలసికట్టుగా వ్యతిరేకిద్దాం!

- 'సుప్రీం'ను రాష్ట్రపతి వివరణ కోరిన వ్యవహారంలో 8 రాష్ట్రాలకు స్టాలిన్ లేఖ


చెన్నై, మే 18(ఆంధ్రజ్యోతి): 'శాసనసభలు ఆమోదించిన బిల్లులకు అంగీకారం తెలిపేందుకు రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు నిర్ణయించడానికి వీలుందా?' అంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 14 ప్రశ్నలతో సుప్రీం కోర్టును వివరణ కోరడాన్ని కలిసికట్టుగా వ్యతిరేకించాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఆ మేరకు పశ్చిమబెంగాల్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ, కేరళ, జార్ఖండ్, పంజాబ్, జమ్మూ-కశ్మీర్ రాష్ట్రాల సీఎంలకు ఆయన లేఖ రాశారు. 'రాష్ట్ర ప్రభుత్వాలు శాసనసభలో ఆమోదించిన బిల్లులకు అంగీకారం తెలిపేందుకు గవర్నర్, రాష్ట్రపతికి గడువును నిర్ణయిస్తూ ఇటీవల సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు తమిళనాడు రాష్ట్రానికేకాక అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తుంది" అన్నారు.

సీఎస్, డీజీపీ డుమ్మా..

ప్రోటోకాల్ ఉల్లంఘనపై సీజేఐ ఆగ్రహం

సీజేఐ సన్మాన కార్యక్రమానికి మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గానీ, డీజీపీ గానీ, ముంబై పోలీసు కమిషనర్ గానీ హాజరు కాలేదు. దీనిపై సదస్సులో జస్టిస్ గవాయ్ తీవ్రంగా స్పందించారు. 'ఒక మహారాష్ట్రీయుడు భారత ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు చేపట్టి.. తొలిసారి స్వరాష్ట్రానికి వస్తే.. హాజరు కావడం సముచితమని మహారాష్ట్ర సీఎస్, డీజీపీ, ముంబై కమిషనర్‌కు అనిపించలేదంటే.. ఇది కరెక్టో కాదో వారే ఆలోచించుకోవాలి. న్యాయవ్యవస్థను ఇతర వ్యవస్థలు గౌరవించడానికి సంబంధించిన అంశమిది. ప్రోటోకాల్‌కు కట్టుబడి ఉండాలని నేను పట్టుబట్టడం లేదు. అయితే ఓ వ్యవస్థ లేదా విభాగాధిపతి.. తొలిసారి రాష్ట్రానికి వస్తే.. అందునా ఆయన అదే రాష్ట్రానికి చెందినవారైతే.. ఇలా వ్యవహరించడం సముచితమో కాదో వారు ఆలోచించుకోవాలి. ఇలాంటి చిన్న చిన్న విషయాల జోలికి నేను వెళ్లను. అయితే ప్రజలందరికీ తెలియాల్సిన అవసరం ఉందనే దీనిని ప్రస్తావించాను. అదే మా న్యాయమూర్తుల్లో ఎవరైనా ప్రొటోకాల్ ఉల్లంఘిస్తే.. సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికారాలిచ్చే 142వ అధికరణపై చర్చలు పెట్టేస్తారు' అని గవాయ్ ఆక్షేపించారు. వ్యక్తులు తప్పనిసరిగా తన ముందు హాజరవ్వాలని ఆదేశాలిచ్చే అధికారాన్ని సుప్రీంకోర్టుకు ఈ అధికరణ ఇచ్చింది. బార్‌కౌన్సిల్ సన్మానం తర్వాత బాబాసాహెబ్ అంబేడ్కర్ స్మారక చిహ్నమైన చైత్యభూవిని సీజేఐ సందర్శించారు. అప్పటికే ఆయన చేసిన వ్యాఖ్యలు తెలియడంతో మహారాష్ట్ర సీఎస్ సుజాతా సౌనిక్, డీజీపీ రష్మీ శుక్లా, ముంబై పోలీసు కమిషనర్ దేవేన్ భారతి హడావుడిగా అక్కడకు చేరుకున్నారు.

లోకం తీరు



బయటికి చెప్పుకోలేక
చనిపోతున్నారు!



న్యూఢిల్లీ, మే 18: పురుషుల్లో రోజురోజుకూ మానసిక సమస్యలు పెరుగుతున్నాయని మానసిక వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను సమాజంలో చెప్పుకొనే పరిస్థితులు లేకపోవడం, పరిస్థితులను ఎదుర్కోవడానికి న్యాయపరమైన వెసులుబాటు లేకపోవడంతో బాధితులు కుమిలిపోతున్నారని తెలిపారు. ఫలితంగా పురుషుల్లో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని వివరించారు. 2022లో భారతదేశంలో ఆత్మహత్యలు చేసుకున్న వారిలో 72% మంది పురుషులేనన్న ఎన్‌సీఆర్‌బీ నివేదికను వారు ఉటంకించారు. గృహ హింస కేసులు, లైంగిక వేధింపుల కేసులు, న్యాయపరమైన వేధింపులు, భావోద్వేగాలను రెచ్చగొట్టడం, అసత్య ఆరోపణలు.. ఇలాంటి అంశాలు పురుషుల్లో ఎంతో మానసిక సంఘర్షణకు కారణం అవుతున్నాయని వైద్య నిపుణులు తెలిపారు. ఈ వ్యవహారాల్లో ఉపశమనం కోసం పురుషులకు తగిన న్యాయపరమైన వెసులుబాట్లు లేవని, దీనిపై వెంటనే దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వారు నొక్కి చెప్పారు. హరియాణాలో ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనంలో వివాహితులైన పురుషుల్లో 52.4శాతం మంది తాము లింగ వివక్షను ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఈ అధ్యయనాన్ని మానసిక వైద్య నిపుణులు ప్రస్తావించారు. పురుషుల మానసిక సమస్యలను చూసీచూడనట్లు వదిలివేయడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తుతోందని, న్యాయపరమైన సంస్కరణలు అవసరమని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ క్లినికల్ సైకాలజిస్ట్స్ జనరల్ సెక్రటరీ శ్వేతా శర్మ అభిప్రాయపడ్డారు.

భారత్‌తో ఉద్రిక్తతలుంటే
కష్టమే!

- 'బెయిల్ అవుట్' లక్ష్యాలకు ముప్పు
- పాక్‌కు ఐఎంఎఫ్ హెచ్చరిక

ఇస్లామాబాద్, మే 18: ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌కు తదుపరి నిధుల మంజూరుపై అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) కీలక నిర్ణయం తీసుకుంది. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల విషయంలో పాక్‌కు హెచ్చరిక చేయడంతోపాటు కొత్తగా 11 షరతులు విధించింది. బెయిల్ అవుట్ ప్రోగ్రామ్‌లో భాగంగా తదుపరి విడత నిధులు విడుదల చేయాలంటే ఇవి పాటించాల్సిందేనని స్పష్టంచేసింది. భారత్‌లో ఉద్రిక్తతలు ప్రోగ్రామ్ ఆర్థిక, బాహ్య, సంస్కరణల లక్ష్యాలకు ముప్పు పెంచుతాయని ఐఎంఎఫ్ హెచ్చరించిందని ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ వార్తాపత్రిక ఆదివారం నివేదించింది. పాకిస్థాన్‌కు విధించిన షరతుల్లో రూ.17.6 ట్రిలియన్ల బడ్జెట్‌కు పార్లమెంటరీ ఆమోదం, విద్యుత్తు బిల్లులపై రుణ సేవల సర్‌చార్జి పెంపు, మూడేళ్లకుపైగా వినియోగించిన కార్ల దిగుమతిపై ఆంక్షల తొలగింపువంటివి ఉన్నాయి. ఈమేరకు ఐఎంఎఫ్ శనివారం స్టాఫ్ లెవల్ రిపోర్టును విడుదల చేసింది. 'భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు అలాగే కొనసాగినా, పరిస్థితి మరింత దిగజారినా.. అది బెయిల్ అవుట్ ప్రోగ్రామ్ ఆర్థిక, బాహ్య, సంస్కరణ లక్ష్యాలకు ముప్పును పెంచుతుంది' అని పేర్కొంది. తాజా నిబంధనలతో పాక్‌పై ఐఎంఎఫ్ విధించిన షరతుల సంఖ్య 50కి చేరింది. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలను ఐఎంఎఫ్ తన నివేదికలో ప్రస్తావించింది. అయితే మార్కెట్ ప్రతిస్పందన నియంత్రణలోనే ఉందని పేర్కొంది. వచ్చే ఆర్థిక ఏడాది బడ్జెట్‌లో రక్షణ బడ్జెట్ రూ.2.414 ట్రిలియన్లుగా ఉందని, ఇది గత ఏడాదితో పోలిస్తే 12శాతం పెంపు అని తెలిపింది. ఐఎంఎఫ్ అంచనాలతో పోలిస్తే.. భారత్‌తో ఘర్షణల నేపథ్యంలో రక్షణ రంగానికి రూ.2.5 ట్రిలియన్లు అధికంగా కేటాయిస్తున్నట్లు పాక్ ప్రభుత్వం సూచించింది.

33 దేశాల రాజధానులు!
7 ప్రతినిధి బృందాలు



ఉగ్రవాదంపై భారత వైఖరి వినిపించడానికి సిద్ధం

- ఎన్డీయే నుంచి 31 మంది, ఇతర పార్టీల వారు 20 మంది
- తెలంగాణ నుంచి ఒవైసీకి స్థానం
- ఈ నెల 23 నుంచి పర్యటనలు

న్యూఢిల్లీ, మే 18: అంతర్జాతీయ వేదికపై పాక్ కుతంత్రాలను ఎండగట్టేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన ఏడు అఖిలపక్ష బృందాలు 33 దేశాల రాజధానులను సందర్శించనున్నాయి. ఈ బృందాల్లో ఎన్డీయే నుంచి 31 మంది, ఇతర పార్టీలకు చెందిన 20 మందితోపాటు 8 మంది మాజీ దౌత్యవేత్తలు కలిపి మొత్తం 59మంది సభ్యులు ఉంటారు. బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లోని యూరోపియన్ యూనియన్ (ఈయూ) ప్రధాన కార్యాలయాన్ని కూడా వీరు సందర్శిస్తారు. ఈ నెల 23 నుంచి ఈ బృందాల పర్యటనలు ప్రారంభంకానున్నాయి.

- సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్, అల్జీరియా దేశాలకు వెళ్లే మొదటి ప్రతినిధి బృందంలో బీజేపీ ఎంపీలు బైజయంత్ పాండా, నిశికాంత్ దూబే, ఫాంగ్నోన్ కొన్యాక్, రేఖా శర్మతోపాటు అసదుద్దీన్ ఒవైసీ (ఏఐఎంఐఎం), సత్నామ్ సింగ్ సంధూ (నామినేటెడ్ ఎంపీ), గులాం నబీ ఆజాద్ (కేంద్ర మాజీ మంత్రి, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం), హర్ష్ శ్రింగ్లా (విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి) ఉంటారు.
- యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఈయూ, ఇటలీ, డెన్మార్క్ దేశాలకు వెళ్లే రెండో బృందంలో బీజేపీ ఎంపీలు రవిశంకర్ ప్రసాద్, దగ్గుబాటి పురందేశ్వరి, ఎంపీ), సమిక్ భట్టాచార్యతోపాటు అమర్ సింగ్ (కాంగ్రెస్), ప్రియాంక చతుర్వేది (శివసేన-యూబీటీ), గులాం అలీ ఖతానా (నామినేటెడ్ ఎంపీ), ఎంజే అక్బర్ (కేంద్ర మాజీ మంత్రి), పంకజ్ సరన్ (మాజీ దౌత్యవేత్త) ఉన్నారు.
- ఇండోనేషియా, మలేసియా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్‌లో పర్యటించే మూడో బృందంలో సంజయ్ కుమార్ ఝా (జేడీయూ), అపరాజితా సారంగి, బ్రిజ్‌లాల్, ప్రధాన్ బారువా, హేమాంగ్ జోషి (బీజేపీ), యూసఫ్ పఠాన్ (టీఎంసీ), జాన్ బ్రిట్టాస్ (సీపీఎం), సల్మాన్ ఖుర్షీద్ (కాంగ్రెస్), మోహన్ కుమార్ (మాజీ దౌత్యవేత్త) ఉంటారు.
- యూఏఈ, లైబీరియా, కాంగో, సిరియా, సియెర్రా లియోన్ దేశాలలో పర్యటించే నాలుగో బృందంలో శ్రీకాంత్ ఏక్‌నాథ్ శిందే (శివసేన), బాన్సురి స్వరాజ్, అతుల్ గార్గ్, మనన్ కుమార్ మిశ్రా(బీజేపీ), ఎస్ఎస్ అహ్లూవాలియా (బీజేపీ మాజీ ఎంపీ), సస్మిత్ పాత్ర (బీజేడీ), మహమ్మద్ బషీర్ (ఐయూఎంఎల్), సుజన్ చినోయ్ (మాజీ దౌత్యవేత్త) ఉన్నారు.
- అమెరికా, పనామా, గయానా, బ్రెజిల్, కొలంబియా దేశాలను సందర్శించే ఐదో బృందంలో శశిథరూర్ (కాంగ్రెస్), శాంభవి (ఎల్‌జేపీ- రామ్‌విలాస్), సర్ఫరాజ్ అహ్మద్ (జేఎంఎం), జీఎం హరీశ్ బాలయోగి (టీడీపీ), శశాంక్ మణి త్రిపాఠి, భువనేశ్వర్ కలితా, తేజస్వి సూర్య (బీజేపీ), మిలింద్ మురళీ దేవరా (శివసేన), తరణ్‌జీత్ సంధూ (మాజీ దౌత్యవేత్త) ఉంటారు.
- స్పెయిన్, గ్రీస్, స్లోవేనియా, లాత్వియా, రష్యాల్లో పర్యటించే ఆరో బృందంలో కనిమొళి(డీఎంకే), రాజీవ్ రాయ్ (ఎస్పీ), మియాన్ అల్తాఫ్ అహ్మద్ (ఎన్‌సీ), బ్రిజేష్ చౌతా (బీజేపీ), ప్రేమ్ చంద్ గుప్తా (ఆర్‌జేడీ), అశోక్ కుమార్ మిట్టల్ (ఏఏపీ), మంజీవ్ ఎస్ పూరీ (మాజీ దౌత్యవేత్త), జావేద్ అష్రాఫ్ (మాజీ దౌత్యవేత్త) ఉంటారు.
- ఈజిప్ట్, ఖతార్, ఇథియోపియా, దక్షిణాఫ్రికా దేశాలను సందర్శించే ఏడో ప్రతినిధి బృందంలో సుప్రియా సూలే (ఎన్‌సీపీ-ఎస్‌సీపీ), రాజీవ్ ప్రతాప్ రూఢీ, అనురాగ్ సింగ్ ఠాకూర్, వి.మురళీధరన్ (బీజేపీ), విక్రమజీత్ సింగ్ సాహ్నీ (ఏఏపీ), మనీశ్ తివారీ, ఆనంద్ శర్మ(కాంగ్రెస్), లావు శ్రీకృష్ణ దేవరాయులు (టీడీపీ), సయ్యద్ అక్బరుద్దీన్ (మాజీ దౌత్యవేత్త) ఉన్నారు.


పాక్.. కాపీ, పేస్ట్ దౌత్యం!

- భారత్‌కు కౌంటర్‌గా విదేశాలకు శాంతి ప్రతినిధుల బృందం

ఇస్లామాబాద్, మే 18: ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందన్న అపఖ్యాతి నుంచి బయటపడేందుకు, ప్రపంచ వేదికపై తన పరువు ప్రతిష్ఠలు కాపాడుకోవడానికి పాకిస్థాన్ నానాపాట్లు పడుతోంది. పాక్ కుతంత్రాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు భారత ప్రభుత్వం ఏడు అఖిలపక్ష బృందాలను నియమించింది. దీన్ని కాపీ కొడుతూ శాంతి కోసం తాము పాకులాడుతున్నామనే వాదనను వినిపించడానికి పాక్ సిద్ధమైంది. తమపై భారత్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించడానికి ఒక ఉన్నత స్థాయి దౌత్య ప్రతినిధి బృందాన్ని ప్రధాన దేశాలకు పంపడానికి ప్రధాని షెహబాజ్ షరీఫ్ నిర్ణయించారని రేడియో పాకిస్థాన్ నివేదించింది. భారత ప్రభుత్వం తమ దౌత్య బృందాల వివరాలను వెల్లడించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రకటన వెలువడింది. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ చీఫ్ బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వంలోని ఈ శాంతి ప్రతినిధి బృందం అమెరికా, యూకే, బెల్జియం, ఫ్రాన్స్, రష్యాల్లో పర్యటిస్తుందని...శాంతి, స్థిరత్వం కోసం పాక్ చేస్తున్న ప్రయత్నాలను వివరిస్తుందని పీఎంవో పేర్కొంది.

సింధ్‌లో లష్కర్ ఉగ్రవాది
ఖాలిద్ హతం


- కాల్పులు జరిపిన గుర్తు తెలియని వ్యక్తి



న్యూఢిల్లీ, మే 18: లష్కర్ ఎ తోయిబా (ఎల్‌ఈటీ) ఉగ్రవాది రజావుల్లా నిజామనీ ఖాలిద్ అలియాస్ అబూ సఫీవుల్లా ఖాలిద్ ఆదివారం పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో హతమయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తి అతడిపై కాల్పులు జరిపినట్టు అధికారవర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం మాల్టీలోని తన ఇంటి నుంచి బయలుదేరి వెళ్తుండగా బాద్నీ క్రాసింగ్ వద్ద కాల్పులు జరిగాయని పేర్కొన్నాయి. 2006లో నాగ్‌పూర్‌లోని ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడికి ఇతడే కీలక సూత్రధారి. ముగ్గురు తీవ్రవాదులు వచ్చి కాల్పులు జరపగా ఎదురుకాల్పుల్లో వారంతా మరణించారు. దాదాపు 25ఏళ్లుగా భారత్‌పై ఏదో రూపంలో దాడులు చేస్తూనే ఉన్నాడు. తొలుత 2000లో నేపాల్‌లో లష్కర్ ఎ తోయిబాను ఏర్పాటు చేసి అక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహించాడు. ఉగ్రవాదుల భర్తీని కూడా అప్పుడే చేపట్టాడు. వినోద్ కుమార్, రజావుల్లా, మహమ్మద్ సలీం వంటి మారు పేర్లతో భారత్‌లో పలుమార్లు దాడులు చేశాడు. 2005లో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌పై జరిగిన దాడికీ కీలక సూత్రధారి ఇతడే. ఆ దాడిలో ప్రొఫెసర్ మునీష్ చంద్ర పురీ ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు గాయపడ్డారు. దాడులు చేసిన ఉగ్రవాదులు తప్పించుకున్నారు. దర్యాప్తు జరిపిన పోలీసులు లష్కర్ అగ్రనాయకుడు అబు అనీస్‌పై కేసు పెట్టారు. అతడు ఇప్పటికీ పోలీసులకు చిక్కలేదు. ప్రస్తుతం హతమైన ఖాలిద్..అబు అనీస్‌కు అత్యంత సన్నిహితుడు. 2008లో ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లో ఉన్న సీఆర్‌పీఎఫ్ స్థావరంపై జరిగిన దాడిలోనూ కీలక పాత్ర పోషించాడు. ఆ దాడిలో ఏడుగురు జవాన్లు, మరో సాధారణ పౌరుడు ప్రాణాలు కోల్పోయారు. దాడి చేసిన ఇద్దరు ఉగ్రవాదులు తప్పించుకున్నారు.

పాకిస్థాన్ కంటే నరకానికే వెళ్తా

- పుస్తకావిష్కరణ సభలో సినీ గేయ, కథా రచయిత జావేద్ అక్తర్



ముంబై, మే 18: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దాయాది దేశంపై ప్రముఖ బాలీవుడ్ సినీ గేయ, కథా రచయిత జావేద్ అక్తర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌కు వెళ్లాలా? నరకానికి వెళ్లాలా? అన్న ఆప్షన్లు తన ముందుకొస్తే తాను నరకాన్నే ఎంచుకుంటానని పేర్కొన్నారు. శనివారం ముంబైలో జరిగిన ఒక పుస్తకావిష్కరణ సభలో జావేద్ అక్తర్ మాట్లాడుతూ.. తనపై చాలా మంది ప్రశంసించారని, అదే సమయంలో ఇరుపక్షాల 'వేర్పాటువాదుల' నుంచి అవమానాలు, విమర్శలను ఎదుర్కొన్నానని చెప్పారు. 'నేను నాణేనికి ఒకవైపు చూస్తే నీవు నాస్తికుడి (కఫీర్)వి కనుక నరకాని (జహనుమ్)కి పొమ్మంటుంది. మరోవైపు చూస్తే నువ్వు ఉగ్రవాది (జిహాదీ)వి కనుక పాకిస్థాన్‌కు పొమ్మంటుంది. ఒకవేళ నా ముందు రెండు (పాకిస్థాన్/నరకం) అవకాశాలుంటే నేను నరకానికెళ్లడానికి ఇష్టపడతా' అని చెప్పారు.



సచివాలయం ఎదుట అందాల భామలు

అందాలొలికే..

సచివాలయంలో ప్రపంచ సుందరీమణుల సందడి

తెలంగాణ తల్లి విగ్రహానికి అందాలభామల నివాళి
తెలంగాణ పిండి వంటకాలతో ప్రభుత్వం తేనీటి విందు
వెయ్యికిపైగా డ్రోన్లతో ఆకట్టుకునేలా 'డ్రోన్ షో'
పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ సందర్శన

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): సాయం సంధ్యవేళ.. హుస్సేన్‌సాగర తీరాన.. విద్యుత్ కాంతుల వెలుగుల్లో.. రాష్ట్ర సచివాలయంలో అందాల భామలు సందడి చేశారు. పరిపాలనకు గుండెకాయ.. ప్రజల సంక్షేమం కోసం విధానాల రూపకల్పన జరిగే తెలంగాణ సచివాలయాన్ని ప్రపంచ సుందరి పోటీదారులు ఆదివారం సాయంత్రం సందర్శించారు. తొలుత సచివాలయం ప్రధాన ద్వారం వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం విగ్రహం ముందు నిలబడి ఫొటో దిగారు. ఆ తరువాత కొద్దిసేపు అక్కడ కలియదిరిగారు. అనంతరం సచివాలయం మధ్యలో పచ్చికబయళ్లపై ఏర్పాటు చేసిన తేనీటి విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. సుందరీమణులకు పసందైన తెలంగాణ పిండి వంటకాలతోపాటు మిర్చి బజ్జీ, పునుగులు, ఇరానీ చాయ్ సహా పలురకాల చిరుతిళ్లు, ప్రత్యేకమైన ఐస్‌క్రీమ్‌లను అందించారు.



సచివాలయంలో కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తున్న హరిచందన, కృష్ణభాస్కర్



అభివృద్ధిపై ప్రత్యేక వీడియో ప్రదర్శన

మిస్‌వరల్డ్ పోటీదారులు సచివాలయానికి వచ్చిన సందర్భంగా తెలంగాణ చరిత్ర, అభివృద్ధి, పారిశ్రామిక విధానాలు సహా పలు అంశాలతో కూడిన ప్రత్యేక వీడియోను ప్రదర్శించారు. వందల ఏళ్ల క్రితం తెలంగాణ ప్రాంతం ఎలా ఉండేది, ప్రత్యేకించి హైదరాబాద్ ప్రాంతం ఎలా ఉన్నది, ఏయే రంగాల్లో ప్రాముఖ్యత కలిగి ఉందనే విషయాలతోపాటు చార్మినార్ నిర్మాణం, దాని చరిత్రకు సంబంధించిన విషయాల స్నింటినీ ఆ వీడియోలో చూపించారు. రాష్ట్రంలో ఉన్న ప్రముఖ ఆలయాలు, జాతరలకు సంబంధించి కూడా వివరించారు. ఇక సాగునీటి రంగం, పంటల అంశాలకు సంబంధించి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు పలు అంశాలను ప్రత్యేకంగా వివరించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి తీసుకుంటున్న నిర్ణయాలు, పలు రంగాల వృద్ధి కోసం రూపొందించిన పాలసీలు, విదేశీ పెట్టుబడులు, ఇక్కడ కంపెనీల ఏర్పాటుకు ఉన్న అవకాశాల గురించి సవివరంగా ఆ వీడియోలో చూపించారు. విస్‌వరల్డ్ పోటీదారులకు సచివాలయంలో స్వాగతం పలికేందుకు, రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలను వివరించేందుకు ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, ఉపముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

పోటీదారులు కాదు.. రాయబారులు..

మిస్‌వరల్డ్ పోటీదారులను ఉద్దేశించి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. 'మీరు కేవలం పోటీదారులు మాత్రమే కాదు.. మీ దేశాల రాయబారులుగా మేం గుర్తుంచుకుంటాం. మీతోపాటు తెలంగాణ ఆత్మను మీ దేశాలకు తీసుకెళ్లి అక్కడి ప్రజలకు మా రాష్ట్రం గురించి తెలియజేయండి" అని అన్నారు. ఈ రోజు చార్మినార్ సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో 17 మంది చనిపోవడం బాధాకరమని, వారికి నివాళిగా ఒక్క నిమిషం మౌనం పాటిద్దామని అన్నారు. సచివాలయానికి ప్రస్తుత మిస్ వరల్డ్ క్రిస్టినా కూడా హాజరయ్యారు. ఆమెతో మంత్రి జూపల్లి, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్ సహా పలువురు ముచ్చటించారు.

కమాండ్ సెంటర్‌లో ముద్దుగుమ్మలు

సచివాలయం సందర్శనకు ముందు ఆదివారం మధ్యాహ్నం ప్రపంచ సుందరి పోటీదారులు బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను పరిశీలించారు. తొలుత బస్సుల్లో అక్కడికి చేరుకున్న ముద్దుగుమ్మలకు పోలీస్ అశ్వికదళం, పైపు బ్యాండ్, మోటర్ సైకిల్ రైడర్స్, స్నిఫర్ డాగ్ స్క్వాడ్‌లతో పోలీస్ శాఖ ఘనంగా స్వాగతం పలికింది. పోలీస్ కమాండ్ కంట్రోల్ ఆడిటోరియంలో పోలీస్ శాఖ పనితీరు విధానంపై ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మాదక ద్రవ్యాల నివారణ కోసం తెలంగాణ పోలీస్ చేపట్టిన చర్యలకు అందాలభామలు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ పోస్టర్లపై సంతకాలు చేసి.. సందేశాలు రాసారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలకు సేవలందిస్తున్న ట్రాన్స్‌జెండర్లతో కలసి ఫొటో దిగారు.

ట్యాంక్‌బండ్‌పై 'సన్‌డే ఫన్‌డే'

కవాడిగూడ/ఖైరతాబాద్: సచివాలయంలో జరిగిన ప్రపంచ సుందరీమణుల కార్యక్రమాన్ని ట్యాంక్‌బండ్ నుంచి సందర్శకులు వీక్షించేలా అక్కడ ప్రత్యేక ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. దీంతో హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన 'సన్‌డే ఫన్‌డే' కార్యక్రమం కోలాహలంగా జరిగింది. సచివాలయం ముందు తెలుగుతల్లి చౌరస్తా సమీపంలో ఏర్పాటుచేసిన పలు దేశాల జాతీయ జెండాల్లో ఇజ్రాయెల్ జెండాను తొలగించడం వివాదాస్పదమైంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనను నిందితులు ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టి వైరల్ చేయడంతో ఆ జెండాను తొలగించిన వారిపై కేసు నమోదైంది.



ఆకట్టుకున్న 'డ్రోన్ షో'..

సచివాలయం బయట పచ్చికబయళ్లలో ఏర్పాటుచేసిన కుర్చీల్లో అందాలభామలు ఆసీనులై.. వెయ్యి డ్రోన్లతో ప్రదర్శించిన 'డ్రోన్ షో'ను తిలకించారు. డ్రోన్ షోలో మిస్‌వరల్డ్ లోగో, తెలంగాణ జరూర్ ఆనా లోగోలు కనిపించినప్పుడు హర్షం వ్యక్తం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు సచివాలయానికి వచ్చిన సుందరీమణులు 7.50 గంటల వరకు అక్కడే ఉన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం దగ్గర నివాళి అర్పించే సమయంలో రాష్ట్ర గేయం 'జయ జయహే తెలంగాణ'ను వినిపించారు. జాతీయ గీతంతో తేనీటి విందు కార్యక్రమం ముగిసింది.



చాయ్ మస్తుంది..

తెలంగాణ వంటకాలు బాగున్నాయి. కొంచెం కారంగా ఉన్నాయి. అయినా ఇష్టంగా తింటున్నా. ఇప్పుడు వేసవికాలం కావడంతో ఉక్కపోత బాగా ఉంది. మేముంటున్న హోటల్‌లో కూడా పలు రకాలు వంటలు పెడుతున్నారు. చాయ్ చాలా బాగుంది.

-మిస్ క్రొయేషియా



హలీమ్ యమ్మీ..యమ్మీగా ఉంది..

తెలంగాణ రాష్ట్రం నాకు బాగా నచ్చింది. ఇక్కడ చూడడానికి చాలా ప్రాంతాలున్నాయి. హైదరాబాదీ బిర్యానీ సూపరుంది. ఇక హలీమ్ అయితే యమ్మీ.. యమ్మీగా చాలా బాగుంది. నిజం చెప్పాలంటే.. ఇక్కడి కొన్ని వంటకాలను నేను మా దేశానికి తీసుకెళ్లాలనుకుంటున్నాను. మిస్ వరల్డ్ పోటీల తరువాత కొన్ని దేశాలు తిరగాలని ప్లాన్ చేసుకున్నా. కానీ ఇప్పుడు నా మనసు మార్చుకున్నా.. నా కుటుంబంతో కలిసి మళ్లీ తెలంగాణకు వస్తా. అప్పుడు ఇంకొన్ని పర్యాటక ప్రాంతాలను కూడా చూసేస్తా.

-మిస్ ఆస్ట్రేలియా, జాస్మిన్ స్ట్రింగర్.



ఆటోగ్రాఫ్.. ఓ స్వీట్ మెమరీ

సచివాలయ సందర్శనకు వచ్చిన సుందరీమణులతో అక్కడున్న చాలామంది ఫొటోలు దిగారు. మరికొంత మంది వారి ఆటోగ్రాఫ్‌లను తీసుకున్నారు. చిన్నవారి నుంచి పెద్దవారి వరకు ప్రతీఒక్కరూ ఫొటోలు దిగుతూ.. అవకాశం దొరికినవారి నుంచి ప్రత్యేక పుస్తకాలపై సంతకాలు చేయించుకున్నారు. ఓ బుడతడు మాత్రం అక్కడున్న పలు దేశాలకు చెందిన అందగత్తెల ఆటోగ్రాఫ్‌లు తీసుకుంటూ కనిపించాడు.



సచివాలయంలో తేనీటి విందులో పాల్గొన్న ప్రపంచ సుందరీమణులు

మందుబాబులకు షాక్!

(మొదటి పేజీ తరువాయి)

వస్తాయని అధికారులు తెలిపారు. వాస్తవానికి 2023 మే నెలలో మద్యం ధరలను క్వార్టర్‌కు రూ.20 పెంచారు. అయితే మళ్లీ రెండు రోజుల్లోపే ఆ పెంపును రూ.10కి పరిమితం చేశారు. మద్యం ధరలు పెంచితే అమ్మకాలు పడిపోతాయంటూ డిస్టిలరీలు చేసిన విజ్ఞప్తి మేరకు ధర తగ్గిస్తున్నట్లు అప్పట్లో అధికారులు చెప్పారు. అప్పుడు తగ్గించిన రూ.10నే ఇప్పుడు పెంచామని ఎక్సైజ్ శాఖ తెలిపింది. ఈ పెంపు ద్వారా వచ్చే మొత్తం ప్రభుత్వానికి మాత్రమే వస్తుంది. తయారీదారులకు దీంతో ఏమాత్రం సంబంధం లేదు. కాగా, బీర్ల ధరలను ఈ ఫిబ్రవరిలోనే ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. బీర్ల ధరల పెంపు సమయంలో మాత్రం అటు తయారీదారులకు కొంత ధర పెంచి, దానిపై మళ్లీ ప్రభుత్వం కూడా పన్నులు విధించి ధరలు పెంచింది.

బీర్లను, బార్లను నమ్ముకొని పాలన సాగిస్తారా?

» రేవంత్‌రెడ్డీ.. మీరు చెప్పిన మార్పు ఇదేనా?: హరీశ్‌రావు

హైదరాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): ఇష్టం వచ్చినట్లు మద్యం ధరలు పెంచి, తాగుబోతుల ద్వారా రాష్ట్ర ఖజానా నింపాలని చూస్తారా? బీర్లను, బార్లను నమ్ముకొని రాష్ట్రంలో పాలన కొనసాగిస్తారా అని సీఎం రేవంత్‌రెడ్డిని మాజీమంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. బెల్ట్‌షాపులు మూస్తామని చెప్పి, గల్లీకో బెల్ట్‌షాపు తెరిచి తాగుబోతుల తెలంగాణగా మార్చే కుట్ర చేస్తున్నారని, కాంగ్రెస్ తెస్తామన్న మార్పు ఇదేనా అని ప్రశ్నించారు. ఓ వైపు మద్యం ధరలు పెంచి, మరోవైపు విక్రయాలను రెండింతలు చేయాలని అధికారులను ఆదేశించడంలోనే ప్రభుత్వం అంతర్యం స్పష్టమవుతోందన్నారు. ఉన్న మద్యం దుకాణాలు చాలక.. సర్కారు గల్లాపెట్టె నింపేందుకు గ్రామీణ జిల్లాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 30కిలోమీటర్లకు ఒకటి చొప్పున 100కుపైగా మైక్రో బ్రూవరీల ఏర్పాటు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని ఏం చేయదలుచుకున్నారో చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

» రష్యా కాన్సుల్ జనరల్ ఖోడ్జాయేవ్‌ను కోరిన భట్టి

హైదరాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. ప్రజాభవన్‌లో ఆయన్ను రష్యా కాన్సుల్ జనరల్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను భట్టి ఆయనకు వివరించారు. హైదరాబాద్ నగరంలో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేస్తున్నామని, ఫార్మా ఇండస్ట్రీతో పాటు ఇతర పరిశ్రమల విస్తరణకు కావలసిన సహకారాన్ని ప్రభుత్వం అందించి ప్రోత్సహిస్తోందని తెలిపారు. టెక్స్‌టైల్, కోల్ ఇండస్ట్రీ, బయోటెక్నాలజీ, టీ హబ్, ఐటీ ఇండస్ట్రీ అభివృద్ధి గురించి వివరించారు. పెట్టుబడులు పెట్టడానికి అన్ని రకాలుగా తెలంగాణ అనువుగా ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా వాలేరి ఖోడ్జాయేవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అడ్వాన్స్ టెక్నాలజీ, పురోగమిస్తున్న పరిశ్రమల అభివృద్ధిని గమనించామని చెప్పారు. కలిసి పనిచేద్దామని, రష్యా పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని ఖోడ్జాయేవ్ చెప్పారు.

నకిలీ వైద్యులపై మెడికల్ కౌన్సిల్ చర్యలు

హైదరాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లాలో నకిలీ వైద్యులుగా చెలామణి అవుతున్న వారిపై మెడికల్ కౌన్సిల్ కొరడా ఝులిపించింది. పలు చోట్ల తనిఖీలు నిర్వహించి నకిలీ డాక్టర్ల గుట్టురట్టు చేసింది. గతంలో కాంపౌండర్లుగా పనిచేసి ఆర్‌ఎంపీ సర్టిఫికెట్ సంపాదించి డాక్టర్ల వేషధారణలో ప్రజలను మోసం చేస్తున్న వారిపై 14కేసులు నమోదు చేసింది. డాక్టర్ లాలయ్య కుమార్, డాక్టర్ మహేష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసులు నమోదు చేసినట్లు తెలంగాణ వైద్య మండలి వైస్ చైర్మన్ జి.శ్రీనివాస్ తెలిపారు.



కానిస్టేబుల్ కిష్టయ్య కుమార్తెకు కేసీఆర్ మరోసారి ఆర్థిక సాయం

» మెడిసిన్‌లో పీజీ చదువుతున్న కిష్టయ్య కుమార్తె ప్రియాంక

మర్కుక్, మే 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను బలిదానం చేసిన కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబానికి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ మరోసారి ఆర్థికసాయం అందించారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి నివాసంలో తెలంగాణ అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబ సభ్యులు కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కిష్టయ్య కుమార్తె ప్రియాంక వైద్యవిద్య చదువుకు ఇప్పటికే 5 సంవత్సరాలుగా ఆర్థిక సాయం చేస్తున్న ఆయన తాజాగా పీజీ చదివేందుకు కూడా డబ్బును సమకూర్చారు. కిష్టయ్య కుమారుడు రాహుల్‌కు వివాహం నిశ్చయమైన విషయాన్ని తెలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. కిష్టయ్య కుటుంబానికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు.

రానున్న 5 రోజుల్లో భారీ వర్షాలు

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): రానున్న ఐదు రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ వెల్లడించింది. తెలంగాణలో ఉరుములు, పిడుగులతో పాటు గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. మరోవైపు రాయలసీమ, కోస్తాంధ్రలోని పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

దేశాభివృద్ధికే వన్ నేషన్ వన్ ఎలక్షన్

» ప్రభుత్వ విధానమే కాదు.. ప్రజలందరి అంశం
» భావి తరాల కోసం సంస్కరణలు అవసరం
» కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి ఒకే దేశం ఒకే ఎన్నిక (వన్ నేషన్ వన్ ఎలక్షన్) కీలకమని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. దీనిపై మేధావులు, రాజకీయ పార్టీలు, ప్రజలంతా చర్చించి చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో ఆదివారం.. ఒకే దేశం ఒకే ఎన్నిక - దేశవ్యాప్త అవగాహన' అనే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లయినా, మనం ఇంకా బ్రిటిష్ విధానాలనే అనుసరిస్తున్నామని చెప్పారు. భవిష్యత్ తరాల కోసం సంస్కరణలు తేవాల్సి ఉందన్న కిషన్ రెడ్డి.. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశానికి అనుగుణంగా చట్టాల్లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇప్పటికే కొన్ని చట్టాలను మార్చామని, కానీ కొందరు చట్టాల మార్పిడికి నిరంతరం అడ్డంకులు సృష్టిస్తున్నారని చెప్పారు. విభిన్న సమయాల్లో ఎన్నికల నిర్వహణ వల్ల దేశమంతా నిరంతర రాజకీయ చర్చలతో అనేక పని గంటలు వృథా అవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒకేసారి ఎన్నికలతో పాలనపై మరింత దృష్టి సారించే అవకాశం ఉంటుందని పేర్కొన్న కేంద్ర మంత్రి.. ఇది ప్రజా ఉద్యమంగా మారాలని ఆకాంక్షించారు. భావి తరాలకు మంచి దేశాన్నందించాలంటే వన్ నేషన్ వన్ ఎలక్షన్ అవసరమని, దీనికి ప్రజలంతా సహకరించాలని కోరారు. ఇది కేవలం ప్రభుత్వ విధానం మాత్రమే కాదని, దేశ ప్రజలందరి అంశమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సభలూ సమావేశాల్లో కూర్చుని మాట్లాడటానికి పరిమితం కాకుండా ప్రజల్లోకి చైతన్యం కలిగించాలన్నారు. జీఎస్టీ, ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్, సీఏఏ వంటి పలు సంస్కరణలను ప్రధాని మోదీ పట్టుదలతో సాధించరని కిషన్ రెడ్డి చెప్పారు. కేవలం పదవుల కోసం ఆలోచించే వారికి సంస్కరణలు తేవడం సాధ్యం కాదని, దేశం గురించి మాట్లాడే మోదీకే సాధ్యమని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై మోదీ సర్కారు తీసుకున్న కఠిన నిర్ణయాలను వివరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. పహల్గాం ఉగ్రదాడి తర్వాత కేవలం సంతాపం ప్రకటించి ఊరుకోలేదని, ఆపరేషన్ సిందూర్‌తో ప్రతీకారం తీర్చుకుందని వెల్లడించారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుపై విపక్షాలు రాద్ధాంతం చేశాయని ఆరోపించారు. కానీ, యావత్ ప్రపంచం భారత్ వైపు చూసేలా మోదీ సర్కారు పలు కీలక నిర్ణయాలు తీసుకుందని వెల్లడించారు.

వ్యక్తిత్వ హననం బాధాకరం

» సోషల్ మీడియాను కట్టడి చేయాలి
» ఏపీ సీఎం చంద్రబాబు



హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం, దుర్మార్గమైన ఆలోచనలు చేసినప్పుడు వాటిని ఎలా కట్టడి చేయాలన్నదానిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సాంకేతిక పురోగతి మంచిదేనని.. కానీ దానిని కొందరు చెడుకు ఉపయోగిస్తున్నారని ఆక్షేపించారు. సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారాలు, వ్యక్తిత్వహననానికి పాల్పడడం బాధాకరమని.. ఇంట్లో ఉండే ఆడబిడ్డలకూ ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ వెబ్‌సైట్ రజతోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సోషల్ మీడియాను పూర్తిగా రద్దుచేయాలని చెప్పనని.. అయితే నియంత్రణ మాత్రం అవసరమని నొక్కిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు సరైన మీడియాను ఏవిధంగా ప్రోత్సహించాలో దృష్టిపెట్టాలని సూచించారు. హైదరాబాద్‌లో పాత రోజులు జ్ఞాపకం వస్తున్నాయన్నారు. తాను సీఎంగా ఉన్నపుడు హైటెక్ సిటీ కట్టించి.. తెలుగు వారికి ఐటీ రంగాన్ని చేరువ చేశామన్నారు. 'మనం పనిచేస్తే.. ప్రజలు గుర్తుంచుకోరని అనుకుంటాం.. కానీ నేను కష్టంలో ఉన్నప్పుడు, జైల్లో ఉన్నప్పుడు నా కోసం ప్రజలు స్పందించడాన్ని జీవితాంతం మరచిపోను ' అని తెలిపారు.



మహాయానం

ఆకులు అరమోడ్చిన చెట్టు కింద
కళ్లమూసుకుని కూర్చున్నారిద్దరు
మధుపాత్రల్లో మౌనాన్ని నింపుకుని

కళ్లచెట్టు రెప్పల కింద నీడల్లో
పాకుతున్న లేత ఎండని
కళ్లమూసుకుని సిప్ చేస్తుండగా
వాళ్లని విప్పారిన కళ్లతో చూస్తూ
మధుపాత్రల్లో తేలే తెల్లమబ్బులు

దూరంగా 'అంబా' అనే దూడ అరుపు
శబ్దం ఇద్దరు మనుషుల్ని కలుపుతుంది
ఇద్దరి మధ్య మౌనం పొరల్లోకి
చేరినిద్రపోతుంది

దిక్కుల్లేని నిశ్శబ్ద సాగరం మీద
తెడ్లు లేని పుట్టి శబ్దం
దానిలో చెట్టుతో సహా ఇద్దరు మనుషులూ
ఒక దూడా
తెల్లమబ్బులతో కలిసి తేలుతూ తూలుతూ
ప్రయాణం

ఒక కల నుంచి ఇంకో కలలోనికా?
లేదా... ఒక మెలకువ నుండి ఇంకో
మెలకువలోనికా?

■ వసీరా

✆ 91777 27076

ప్రశ్నలు లేవనెత్తే చోట

ప్రశ్నలు లేవనెత్తే చోట
జవాబుల్లో కలుద్దాం,
విగ్రహాలతో కాదు
మనం పుస్తకాల్లో కలుద్దాం!

పంటలతోపాటు
పొలాల్లో కలుద్దాం,
పండించే రైతులకు తోడుగా
మనం రైతులతో కలుద్దాం!

కోర్టులు కచ్చేరీలలో కలుద్దాం
గ్రంథాలయాల్లో కలుద్దాం,
పేదల అందుబాటు న్యాయానికై
నిలబడే వకీళ్లతో కలుద్దాం!

బడులు మదర్సాలలో కలుద్దాం
కాలేజీలు యూనివర్సిటీలలో
కలుద్దాం,

దేశాభివృద్ధికి దారిచూపే
చదువు చెప్పే చోట కలుద్దాం!

విద్య అందరి హక్కు అనే
పని అందరికి కావాలనే,
కోట్లాది విద్యార్థుల్లో కలుద్దాం
కోట్లాది నవయువకులతో నడుద్దాం!

కొత్త సవాళ్లు ఎదురైతే
సమాధానాలలో కలుద్దాం
పోరాటాల మైదానాల్లో
పంటపొలాలు కార్ఖానాల్లో
అధికారానికై పిడికిలి బిగించే
శ్రామికులతో ఏకమవుదాం!

(మునేశ్ త్యాగి
హిందీ కవిత
ఆధారంగా)

■ నిఖిలేశ్వర్

✆ 91778 81201



సోమవారం 19 మే 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

'గస్సాల్, మరికొన్ని కథలు'

కె. ఆనందాచారి కథల సంపుటి 'గస్సాల్, మరికొన్ని కథలు' ఆవిష్కరణ మే 23 సా.5.30గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో పెద్దింటి అశోక్ కుమార్, ఏనుగు నర్సింహారెడ్డి, మామిడి హరికృష్ణ, వేముల శ్రీనివాస్, ప్రసేన్, నామోజు బాలాచారి, మువ్వా శ్రీనివాసరావు, ఆర్. సీతారాం తదితరులు పాల్గొంటారు.

తెలంగాణ సాహితి

'ఏకుదారం' నవల

బి. నాగశేషు నవల 'ఏకుదారం' ఆవిష్కరణ మే 24న తిరుపతి యూత్ హాస్టల్లో జరుగుతుంది. పుస్తక ఆవిష్కరణ పి.సి. వెంకటేశ్వర్లు, పుస్తక సమీక్ష కె. శ్రీనివాసులురెడ్డి, సభాధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, విశిష్ట అతిథి వి.ఆర్ రాసాని, ఆత్మీయ అతిథులు వై. సుభాషిణి, బొమ్మిశెట్టి రమేష్. వివరాలకు 9393662821.

ఆర్.సి. కృష్ణ స్వామి రాజు

కేంద్ర సాహిత్య అకాడమీ 'కవి సంధి'

కేంద్ర సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో అన్నవరం దేవేందర్‌తో 'కవి సంధి' కార్యక్రమం మే 25 సా.6గంటలకు కరీంనగర్‌లోని ఫిల్మ్ భవన్ ఏసీ హాలులో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అన్నవరం దేవేందర్ తన సాహిత్య జీవన యాత్రను వివరించి కవితా పఠనం చేస్తారు. కార్యక్రమ పర్యవేక్షణ: ప్రసేన్.

మృణాళిని

'దుఃఖం పండుతున్న నేల' కవితా సంపుటి

కంఠ బంగార్రాజు కవితా సంపుటి 'దుఃఖం పండుతున్న నేల' ఆవిష్కరణ మే 25ఉ.10గంటలకు విజయవాడ-గవర్నర్ పేటలోని బాలోత్సవ్ భవన్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త గోరటి వెంకన్న. రసరాజు, బి. ప్రసాద మూర్తి, బిక్కి కృష్ణ, కోయి కోటేశ్వర రావు తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 92464 15150

మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ

ఖమ్మం ఈస్తటిక్స్ పురస్కారాలకు ఆహ్వానం

ఖమ్మం ఈస్తటిక్స్ పురస్కారాల కోసం కవిత సంపుటాలకు, కథలకు ఆహ్వానం. మూడు ఉత్తమ కథలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.25వేలు, రూ.15 వేలు, రూ.10వేలు. ఉత్తమ కవితా సంపుటికి రూ.40వేల బహుమతి. కవితా సంపుటి 2024 ఏప్రిల్ - 2025 మార్చ్ మధ్య ప్రచురితమై ఉండాలి. కనీసం 25 కవితలకు తగ్గకుండా ఉండాలి. కథలు ఈ పురస్కారం కోసమే రాసినవై ఉండాలి. కవితా సంపుటాలు నాలుగు ప్రతులు పంపాలి. కథల యూనికోడ్ టెక్స్ట్‌ను మెయిల్ పంపుతూ నాలుగు ప్రింట్ కాపీలు పోస్ట్ చేయాలి. చిరునామా: ఖమ్మం ఈస్తటిక్స్ హార్వెస్ట్ స్కూల్, 5-7-200/11, పాకబండ బజార్, ఖమ్మం- 507003. ఫోన్: 98491 14369. ఈమెయిల్: khammamaesthetics@gmail.com

రవి మారుత్

వందేళ్ల నాటి డిటెక్టివ్ నవల 'చతురిక'


1917లో అంటే 108 ఏళ్ల కిందట కర్నూలులో ప్రచురితమైన ఉయ్యాలవాడ రామచంద్రరావు రచన 'చతురిక' నవల ఇటీవలే మళ్లీ వెలుగులోకి వచ్చింది. నాలుగు నెలల క్రితం కర్నూలులో సాహితీ స్రవంతి కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంలో దీన్ని మళ్ళీ విడుదల చేశాం. సుందరయ్య విజ్ఞాన కేంద్రం గ్రంథాలయంలో పుస్తకాల డిజిటల్ కాపీలు ఆన్‌లైన్‌లో తిరగేస్తుండగా ఇది నాకు కనిపించడం అనూహ్యమే. నాకు గతంలో తెలిసిన మేరకు, లేదా ఇది కనిపించిన తర్వాత పరిశోధించిన మేరకు ఎక్కడా ఈ నవల, రచయిత నమోదు కాలేదు. రాయలసీమ నవలలపై పరిశోధనలతో సహా ఇంతవరకూ ఎక్కడా ఈ నవల గురించి ప్రస్తావన లేదు.

కర్నూలు డిప్యూటీ కలెక్టరుగా పనిచేసిన నరహరి గోపాల కృష్ణమ శెట్టి 1872లో వెలువరించిన 'శ్రీరంగరాజ చరిత్రము' మొదటి నవల కాగా, 1878లో కందుకూరి వీరేశలింగం ప్రచురించిన 'రాజశేఖర చరిత్ర' రెండవ నవల అని సాహిత్య చరిత్ర చర్చలో ఒక దీర్ఘకాలిక అభిప్రాయం. అంతకన్నా ముందే చరిత్రకు సంబంధించిన నవలలు తెలంగాణలో వచ్చాయని మిత్రులు పలు వివరాలు ప్రకటించారు. తెలుగు నవలా వికాసం గురించి ఇంకా చాలా సమాచారం, ఆధారాలు ఉన్నా ఇక్కడ ఆ వివరాల్లోకి పోలేం. స్థూలంగా తెలుగు సాంఘిక నవల అన్న కోణం మాత్రమే తీసుకుంటున్నాను.

ఈ 'చతురిక' రచయిత ఉయ్యాలవాడ రామచంద్రరావు ఈ నవల నేరుగా షెర్లాక్ హోమ్స్‌కు అనుసరణ అని రాశారు. అయితే ఈ చిన్న నవల మొత్తంలో అనుకరణ కన్నా దేశీయతనే అధికంగా కనిపిస్తుంది. కథనానికి అనుసరించిన శిల్పం కూడా కృత్రిమత్వానికి చోటివ్వలేదు. భాష పరంగా అర్ధ గ్రాంథికం అనొచ్చు. అప్పటికీ ఇప్పటికీ పదాల వినియోగంలో వచ్చిన మార్పువల్ల కొంత బుర్రకు పనిపెట్టాల్సిన అగత్యమేర్పడుతుంది. అదే సమయంలో బ్రిటిష్ ప్రభావాలు, పదాలను పోకడలను గురించి కూడా కొంత చెప్పడానికి రచయిత ప్రయత్నించారు. భాష కొంత సమస్యగా కనిపించినా కథనం అప్పటి పరిస్థితులను కళ్లకు కడుతుంది.

ఒక రాజ వంశీకుడు గతంలో తను సన్నిహితంగా మెలిగిన వేశ్య చతురిక దగ్గర ఉండిపోయిన తమ జంట ఫోటోను ఎలాగైనా తెలియకుండా తెప్పించాలనుకోవడం కీలకమైన కథ. ఈ క్రమంలో గూఢచారి కథనాయకుడిని నియమిస్తాడు. కథను రచయిత ఉత్తమ పురుషలో చెబుతుంటారు. ఈ క్రమంలో కేవలం గూఢచర్యమే గాక పోటాపోటీ గూఢచర్యం (కౌంటర్ ఎస్పినోజ్) కూడా జరగడం చతురికలో అదనపు ఆకర్షణ. అయితే అది కొసమెరుపులా చివరి వరకూ అర్థం కాదు. బ్రిటిష్ వారి పాలనలో రాజరిక వాతావరణం, ఆనాటి కోర్టులు, పోలీసులు, దావాలు,

> **డిటెక్టివ్ కథల్లో మామూలుగా ఒక దుష్టపాత్రను పట్టుకోవడం తప్పనిసరి కాగా ఈ కథలో అలాటి పని జరగదు. మానవ స్వభావాల్లో మాయోపాయాలు, స్వప్రయోజనాల కోసం పెనుగులాటలు మాత్రమే చూపించారు. పెద్ద సామాజిక సందేశాల జోలికి అసలే పోలేదు. సందేశాత్మకం కాకున్నా చారిత్రాత్మకం గనుక సాహిత్య అధ్యయనాలకు దోహదం కాగలదని దీన్ని మళ్లీ ముద్రించాం.**



విందు వినోదాల వంటి ఆధునిక పట్టణ జీవిత లక్షణాలు గోచరిస్తాయి. ఒకరిని గురించి మరొకరు ఎలా ఆలోచించాలి, ఎలా పసిగట్టాలి, తమ ప్రయోజనాలను ఎలా కాపాడుకోవాలి... ఇవన్నీ నవీనకాలానికి ఏమాత్రం తీసిపోని రీతిలో నడుస్తాయి. నవల శీర్షిక చతురిక అన్నట్టే ఆ పాత్ర చాతుర్యంతో పాటు వ్యక్తిత్వం గల మహిళ అనీ తెలుస్తుంది. ఇది చదివాక కొంత వరకూ సాహిత్యజీవులను మధురవాణి గుర్తుకు వస్తే పొరబాటేమీ లేదు. కాకుంటే ఇది చిన్న నవలిక గనక అంత పరిధీ లేదు. పాత కాలపు రచనల్లో కీలక పాత్రధారిణులు వేశ్యలు కావడం యాదృచ్ఛికమేమీ కాదు. ఆనాటికి ఆ మాత్రం తెగువకు, చొరవకు అవకాశముండేది వారికే నని చెప్పాలి.



1917లో కర్నూలు లోని 'చంద్రమౌళీశ్వర ముద్రాక్షరశాల' అధినేత ఎస్.వి. రాఘవయ్య ఈ పుస్తక ప్రచురణకు ప్రేరణగా నిలవడమే గాక సంపాదకుడు గానూ వ్యవహరించారు. (ఆ 'చంద్రమౌళీశ్వర ముద్రాక్షరశాల' యాజమాన్యం మారినా సీఎం ప్రెస్ పేరుతో ఇంకా నడుస్తున్నది.) ఈ ప్రచురణకర్త రాఘవయ్య ఆ కాలంలో లలితా గ్రంథమాల పేరిట ఒక నవలల సీరిసే ప్రకటించారు. ఆ కాలానికే చందాదారులను చేర్చుకుని చౌకగా ఆఫర్లు కూడా ప్రకటించడం చూస్తాం.

'చతురిక' చదివిన తర్వాత రచయిత ఉయ్యాలవాడ రామచంద్రరావు కథనంలో మంచి నేర్పు కలవారనిపిస్తుంది. హాస్య వ్యంగ్యాలతో పాటు ఈ తరహా కథలకు ప్రాణమైన సస్పెన్స్‌ను కూడా జాగ్రత్తగా పాటించారు. అంతేగాక తన తర్వాతి వారిలా "పాఠక మహాశయా రమ్ము, ఆ ముసుగు మనిషని వెంబడింతము" వంటి కృతక ప్రయోగాలేమీ చేయకుండా సహజంగానే కథ చెప్పుకొచ్చారు. డిటెక్టివ్ కథల్లో మామూలుగా ఒక దుష్ట పాత్రను పట్టుకోవడం తప్పనిసరి కాగా ఈ కథలో అలాటి పని జరగదు. మానవ స్వభావాల్లో మాయోపాయాలు, స్వప్రయోజనాల కోసం పెనుగులాటలు మాత్రమే చూపించారు. పెద్ద సామాజిక సందేశాల జోలికి అసలే పోలేదు. సందేశాత్మకం కాకున్నా చారిత్రాత్మకం గనుక సాహిత్య అధ్యయనాలకు దోహదం కాగలదని దీన్ని మళ్లీ ముద్రించాం.

■ తెలకపల్లి రవి

"పద్యంలోనే ఎఫెక్టివ్‌గా చెప్పగలిగే విషయాలు కొన్ని ఉన్నాయి"

– ఏనుగు నరసింహారెడ్డి

సృజన ప్రక్రియలలో కొత్త కోణాలను అన్వేషించి అంతే అపురూపంగా వ్యక్తం చేస్తున్న కవి ఏనుగు నరసింహారెడ్డి. 'సమాంతర స్వప్నం', 'నేనే', 'కొత్త పలక', 'మూలమలుపు', 'నీడల దృశ్యం', 'పూల పూల వాన' పుస్తకాలు ఆయన కవిత్వ సృజనకు నిలువుటద్దాలు. కవిత్వంతోపాటు అనువాదాలు, విమర్శ, పరిశోధన గ్రంథాలు రాశారు. వర్తమాన కవులు ఎక్కువమంది పట్టించుకోని కవితా రూపాలైన రుబాయిలు, ఛందోబద్ధపద్యాల్ని కూడా ఆయన పట్టించుకున్నారు. పద్యాన్ని ఆధునీకరించి ప్రజలకు చేరువగా చేసిన కవులలో ఏనుగు నరసింహారెడ్డి పేర్కొనదగినవాడు. ఆయన ఇటీవల వెలువరించిన రాజకీయ శతకం 'ఏడుకోలల బాయి'. గుర్రం జాషువా రాసిన 'గబ్బిలం' ఎట్లా ప్రతీకాత్మక కావ్యమో, అట్లానే వ్యవస్థ డొల్లతనాన్ని బయటపెట్టే రాజకీయ ప్రతీకాత్మక కావ్యం 'ఏడుకోలల బాయి'. ప్రజలను ఓటర్లుగా మాత్రమే కాక చైతన్యవంతమైన పౌరులుగా జీవించమని చెబుతున్న పద్యాలివి. ఈ శతక నేపథ్యంలో ఏనుగు నరసింహారెడ్డి జరిపిన సంభాషణ ఇది.

మీ నుంచి వచన కవిత్వేతర రూపాలు అప్పుడు 'తెలంగాణ రుబాయిలు' ఇప్పుడు 'ఏడుకోలల బాయి' రావడానికి కారణాలేంటి?

కాలమే కవుల్ని ప్రభావితం చేస్తుంది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కాలంలో వచన కవిత్వంలో చెప్పిన విషయం కన్నా రుబాయిలలో చెప్పే విషయం ప్రజలను తొందరగా చేరుకుంటుందని భావించి అప్పుడు 'తెలంగాణ రుబాయిలు' రాశాను. అనుకున్నట్లుగానే అవి గేయంగా మారి అనేక మాధ్యమాల ద్వారా ప్రజల దగ్గరికి చేరాయి. ఇప్పుడు రాజకీయాలు వేస్తున్న వేషాలు, ఎన్నికలప్పుడు చేస్తున్న ఫీట్లు చూసి దీన్ని ఒకటో రెండో కవితలుగా రాస్తే లాభం లేదని, ఒక సంపూర్ణ కావ్యం నిర్మించాలని అనుకున్నాను. అందుకు పద్య కావ్యాన్ని ఎంచుకున్నాను.



మీరు ప్రధానంగా వచన కవి కదా. మరి ఈ 'ఏడుకోలల బాయి'ని పద్యాలలో రాయాలని ఎందుకనిపించింది?

నేను వచన కవినే. వచన కవిత్వంలో చెప్పలేని అంశం అంటూ ఏదీ ఉండదని నేను నమ్ముతాను. కానీ కొన్ని సందర్భాలలో వచన కవిత్వం కన్నా పద్యంలోనే ఎఫెక్టివ్‌గా చెప్పగలిగే విషయాలు కొన్ని ఉన్నాయని అనిపిస్తుంది. వర్తమాన రాజకీయాలను అనేకమంది వచన కవిత్వంలో రాశారు, నేనూ రాశాను. అవి రాజకీయం లోని కొన్ని అంశాలని స్పృశించి సద్దుమణిగాయి. కానీ డెబ్బై అయిదేళ్ళ స్వతంత్ర భారతంలో రాజకీయ పార్టీలు పోతున్న పోకడను సంపూర్ణంగా చర్చించడానికి ఒక పద్య కావ్యమే కావాలనిపించింది నాకు. అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రాలలోనూ అనేక భావజాలాలున్న ప్రభుత్వాలు వచ్చాయి. అయినా రాజకీయం సామాన్యులకు అసలైన జ్ఞానాన్ని కలిగించలేకపోతోంది. డబ్బుల చర్చ లేని రాజకీయం కనుచూపుమేరలో కనిపించకుండా పోయింది. ఈ agony నుండే 101 సీస పద్యాలలో రాజకీయాల గుట్టును, నాయకుల లోగుట్టును, ప్రజల అమాయకత్వాన్ని కదలకుండా నమోదు చేశాను. చాలామంది కవుల లాగే అడపాదడపా కొన్ని కవితలు రాసి ఊరుకోవడం కంటే ఇప్పుడున్న ఎన్నికల వ్యవస్థ రూపాన్ని పూర్తిగా తొలగించుకునేంత వరకు నిరంతరం ప్రాసంగికత ఉండే పద్యాలు కొన్ని రాసి ప్రజల నోళ్ళ మీద ఉండేట్లు చేయాలని అనిపించింది. తెలంగాణలో 2023లో జరిగిన ఎన్నికల్లో కొన్ని పద్యాలు రాసాను. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో మరిన్ని పద్యాలు రాశాను. ఇవి చదివిన వారిపై గట్టి ముద్ర వేస్తాయని మాత్రం కవిగా నేను బలంగా నమ్ముతున్నాను.



> **వర్తమాన రాజకీయాలను అనేకమంది వచన కవిత్వంలో రాశారు, నేనూ రాశాను. అవి రాజకీయం లోని కొన్ని అంశాలని స్పృశించి సద్దుమణిగాయి. కానీ డెబ్బై అయిదేళ్ళ స్వతంత్ర భారతంలో రాజకీయ పార్టీలు పోతున్న పోకడను సంపూర్ణంగా చర్చించడానికి ఒక పద్య కావ్యమే కావాలనిపించింది నాకు.**

ఎలాంటి శిల్ప వైవిధ్యంతో ప్రజలను చేరుకునే వ్యూహరచన చేశారు?

సీస పద్యానికి నిడివి ఎక్కువ ఉండడం అనేది ఒక సౌలభ్యం. అందువల్ల ఎక్కువ రాజకీయాలు చెప్పవచ్చు. బాగా నచ్చిన వారు ఎవరైనా పాడుకోవడానికి అనువైన లయ కూడా అందులో ఉంది. ఇక భాష కూడా సామాన్యులు రోజూ వాడుకునే మాటలనే తీసుకొని పద్యాల పట్టాల నడుమ ఇరికించాను. తెలంగాణ ప్రాంతపు లోకోక్తులు, సామెతలు, ఉర్దూ మిళిత పదబంధాలను ఇందులో చాలా చేర్చాను. అందువల్ల– తమిళ పదాలు ఉచ్చరించడానికి మొదలు కొంత కష్టపడ్డా తర్వాత అవి మరిచిపోలేని విధంగా ఉన్నట్లు– ఈ పద్యాలు కూడా చదవడానికి కొంత ప్రయత్నించాలి. చదివారా అవి మీ వెంటే ఉండిపోతాయి అని చెప్పగలను.

మకుటానికి ఒక పద్యాన్ని పూర్తిగా వాడుకున్న కవి గతంలో ఎవరూ లేరు. మీరు మకుటానికి అంత ప్రాధాన్యత ఇవ్వడానికి కారణమేమిటి?

నేను శతకం నిండా చెప్తున్న రాజకీయ అక్రమాలను ఓటరుకు ప్రతి పద్యంలో గుర్తు చేయవలసిన అవసరం ఉంది. అందుకే వ్యంగ్యంగా నిత్య వ్యవహార పదబంధంతో ఒక పూర్తి తేటగీతి పద్యాన్ని మకుటంగా పెట్టాను. ఎవరైనా ఆ ఒక్క మకుటాన్ని గుర్తుపెట్టుకుంటే ఆ పద్యం ఏమై ఉంటుందా అన్న క్యూరియాసిటీ రావాలన్నదే కవిగా నా లక్ష్యం.

"మాయ మాటల హామీల మర్మమెరిగి
గుర్తు లేకుండ ఓటెట్ల గుద్దుతావు
ఓరి ఎంకన్న! దోస్తుగా! ఒర్లుబోతు!
ఒక్క మాటన్న వినవారి తిక్కలోడ!"

'ఏడుకోలల బాయి' అని పేరు పెట్టడంలో గల సార్థకత ఏమిటి?

బావుల లోతు కొలవడానికి 'కోల' ఒక కొలమానం. ఏడు కోలల అంత లోతైన బావి అంటే అది చాలా లోతైన బావి అనే అర్థంలో వాడుతారు. ఎన్నికలు, ఓట్లు, రాజకీయాలు కూడా అంత లోతైనవి, అంత గుట్టు కలిగి ఉండేవి అనే అర్థంలో ఈ పేరు పెట్టాను. ఇంకా కొన్ని చోట్ల గుట్టుగా ఉండే మనుషులను 'వాడు మామూలోడు కాదురా. ఏడు కోలల బాయి! ఎవరికీ అర్థం కాడు' అనడం కూడా కద్దు. వెరసి రాజకీయ వ్యవహారం అంతా సామాన్య జనాలకు అర్థం కాని తంతు. అందుకే ఆ పేరు పెట్టాను.

ఇంటర్వ్యూ ■ **బెల్లంకొండ సంపత్ కుమార్**

✆ 99085 19151

"ప్రతీ రోజూ ముప్పై పైనే ఉత్తరాలు వచ్చేవి!"

"**సు**విశాలంగా విస్తరించుకుని ఉన్న నా ఒంటరితనపు సామ్రాజ్యానికి చక్రవర్తినైతే అయ్యాను కానీ మంత్రిలేక బాధపడుతున్నాను – రారాదూ!" అంటూ టీనేజ్‌లో ఒక ప్రేమలేఖని రాసి ఆంధ్రజ్యోతికి పంపిస్తే, పురాణం సుబ్రహ్మణ్య శర్మ ప్రచురించారు. ఆ తర్వాత 'మయూరి' పత్రికవారు ఒక కాలమ్ రాయమంటే వారం వారం ఒక ప్రేమలేఖని 'అమృతవర్షిణి' పేరుతో రాశాను. వాటిని సంపుటిగా ప్రచురించాలని ఇన్నర్ టెక్స్ట్ రెడీ చేస్తుంటే అక్కడక్కడా బొమ్మలుంటే బాగుండునని పించింది. వ్యక్తిగతంగా అస్సలు పరిచయం లేని ఆర్టిస్ట్ గోపి గారికి ఫోన్ చేసి కొన్ని బొమ్మలు కావాలని అడిగాను. చదివాక నచ్చితేనే వేస్తానన్నారు. టెక్స్ట్ పంపించాను.



మూడు రోజులు తర్వాత గోపీగారు పంపిన కవర్ తెరచి చూసి నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను. ఒకటో రెండో బొమ్మలు పంపిస్తారనుకుంటే ప్రతి లేఖకీ ఒక బొమ్మ, భలే అందంగా! వారికి థాంక్స్ చెప్పాలని కాల్ చేస్తే వారన్నారు, "ఒక్క బొమ్మతో ఆగలేకపోయానండి... ఎంత బాగా రాసారు! ఎన్ని సార్లు చదివానో! కాలమ్‌గా వచ్చినప్పుడు చూడలేదు... అందుకే నచ్చితేనే వేస్తానన్నాను. చలం గారి తరువాత ప్రేమ లేఖలు వేస్తుంది మీరేనేమో," అన్నారు. అమ్మాయిల్లో ఇదే మొదటి సంపుటా అని అడిగాను. తనకు తెలిసినంత వరకు ఇదే మొదటిదన్నారు.

నా మొదటి పుస్తకం

కుప్పిలి పద్మ



బొమ్మలతో లేఅవుట్ రెడీ. కవర్ పేజీ ఫిక్స్ చెయ్యాలి. ఏ బొమ్మా నచ్చేది కాదు. ఒకరోజు నల్లకుంటలో ఒక వీధిలో నడుచుకుంటూ వెళుతుంటే తలుపులు తెరిచున్న ఒక ఇంటి ముందుగదిలో గోడ మీదున్న ఒక క్యాలెండర్ ఆకర్షించింది. చొరవ చేసి లోపలికి వెళ్ళాను. అక్కడున్నవారు ఏం కావాలని అడిగారు. ఆ కాలెండర్ కవర్‌ను పుస్తకానికి కవర్ పేజీగా వేద్దామని ఉందని, ఆ క్యాలెండర్ ఎక్కడ దొరుకుతుందని అడిగాను. "మాదేనండి. కొత్తదైతే ప్రింటింగ్‌కి బాగుంటుంది" అంటూ కొత్త క్యాలెండర్‌ని తెప్పించారు. అప్పుడడిగాను "ఇదేం ఆఫీస్" అని. ప్రింటింగ్ ప్రెస్ అన్నారు. ఈ పుస్తకం ప్రింట్ చేస్తారా అని అడిగాను. "చేయొచ్చు, కవర్ డిజైన్ చేయడానికి మీకు తెలిసిన వాళ్ళున్నారా," అని అడిగారు. ఎవ్వరూ తెలియదంటే, 'ఫినిషింగ్ పాయింట్' వారితో మాటాడారు. వారి యువ డిజైనర్స్ కవర్ డిజైన్ చేశారు. అలా 1993 శ్రావణ మాసపు జల్లుల్లో 'అమృతవర్షిణి' కురిసింది.

ఆవిష్కరణ ఆసక్తి లేదు. పత్రికల్లో చక్కని సమీక్షలొచ్చాయి. విశాలాంధ్ర వారి బస్సు ఏ ఊర్లోకి వెళ్ళినా... వెళ్ళీవెళ్ళగానే క్షణాల్లో 'అమృతవర్షిణి'ని కొనుక్కోవటంతో రెండు వేల కాపీలు చాలా త్వరగా అమ్ముడైపోయాయి. పాఠకుల్లో చక్కని డిమాండ్ ఉండటంతో తిరిగి ప్రచురిస్తూ ఉండేదాన్ని.

'అమృతవర్షిణి'ని చదివి చేరా మాస్టారు గారు భావుకురాలివంటే; మునిపల్లె రాజు గారు, శ్రీపతి గారు 'అమ్మాయి చలం' అని మెచ్చుకున్నారు. ఒక ట్రైన్‌లో కలిసినప్పుడు కేశవరెడ్డి గారు 'అమృతవర్షిణి' అని పలకరించటం, చండీదాస్ గారు కొన్ని లేఖల్ని ప్రస్తావిస్తూ మాట్లాడటం, ప్రేమలేఖల్ని ప్రచురించి మొదటి అమ్మాయివని హరిగారు అనడం, వాసుదేవరావు గారు ఆత్మీయంగా ఆటోగ్రాఫ్ అడగటం అజంతా గారు మెచ్చుకున్నారని వారింటికి తీసుకెళ్ళి 'అమృతవర్షిణి' అని పరిచయం చెయ్యటం... ఇలా ఎందరో సాహితీవేత్తల ప్రశంసలు... మరో వైపు పాఠకుల నుంచి ప్రతీ రోజూ దాదాపు ముప్పై పైనే ఉత్తరాలు వచ్చేవి. దేశదేశాల్లో ఉన్న అనేకమంది సాహిత్య అభిమానులు అప్పట్లో ఈ పుస్తకాన్ని ఎంతో ఇష్టంగా చదివామనీ; అపురూపంగా దాచుకున్నామనీ; ఆమెరికాకో మరో దేశానికో చదువు కోసమో, ఉద్యోగం కోసమో వెళ్తున్నప్పుడు వాళ్ల తీసుకెళ్ళిన అతి కొద్ది పుస్తకాలలో 'అమృతవర్షిణి' ఒకటనీ; కొంతమందైతే ఒక్క 'అమృతవర్షిణి'ని మాత్రమే తీసుకెళ్లామనీ... ఇలా నా మొదటి పుస్తకం 'అమృతవర్షిణి' నాకెన్నో అందమైన జ్ఞాపకాల్ని, అపురూపమైన అభిమానుల్ని ఇప్పటికీ విరబూయిస్తోంది.

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.6 కనిష్ఠం 25.7



భీతిల్లిన నగరం

పాతబస్తీ ఘటనతో ఉలికిపాటు.. పెను విషాదం నింపిన అగ్ని ప్రమాదం

ఏకంగా 17 మందిని బలితీసుకున్న దుర్ఘటన

ఇదేరోజు మరో రెండు అగ్నిప్రమాదాలు

అంతకుముందు రెండుచోట్ల..



హైదరాబాద్ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఉదయం నగరం ఉలిక్కిపడి లేచింది. పిడుగులాంటి వార్త విని భీతిల్లింది. పాతబస్తీలో జరిగిన ఘోర విపత్తులో 17 మంది దుర్మరణం చెందారన్న వార్త కలిచివేసింది. చార్మినార్ సమీపంలోని గుల్జార్‌హౌజ్ వద్ద ఓ భవనంలో జరిగిన ప్రమాదంతో మంటలు, పొగ కమ్ముకోవడంతో ఊపిరాడక, బయటకు వెళ్లలేక మృత్యువాత పడినట్లు అధికారులు పేర్కొంటున్నారు. చనిపోయిన వారిలో ఎనిమిది మంది చిన్నారులు, ఐదుగురు మహిళలు, నలుగురు పురుషులున్నారు. పిల్లలను, వయోధికులను వదిలి వెళ్లలేక వారిని కాపాడే ప్రయత్నంలో 30 ఏళ్లు దాటిన ముగ్గురు మహిళలు, ఇద్దరు వ్యక్తులూ చనిపోయారు. కాగా, వరుస అగ్ని ప్రమాద ఘటనలు సిటీజనులను బెంబేలెత్తిస్తున్నాయి. ఆదివారమే మరో రెండో చోట్ల ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. మైలార్‌దేవ్‌పల్లి మొఘల్స్ కాలనీలోని మూడంతస్తుల భవనంలో స్వల్ప ప్రమాదం జరిగింది. ఇక్కడ 50 మందిని ఫైర్ సిబ్బంది రక్షించారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో గ్యాస్ ఆయిల్ తరలించే లారీలో ట్యాంకర్ బ్యాటరీ పేలి మంటలు చెలరేగాయి. పక్కనున్న రెండు ఖాళీ సిలిండర్ వాహనాలకూ మంటలు వ్యాపించాయి సకాలంలో ఫైరింజన్లు రావడంతో పెను ప్రమాదం తప్పింది. ఈనెల 9న చందానగర్‌లోని సెంట్రో భవనంలో అగ్ని ప్రమాదం సంభవించింది. 15వ తేదీన అఫ్జల్‌గంజ్‌లోనూ అగ్నిప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తు ఈ ఘటనల్లో ప్రాణనష్టం సంభవించలేదు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మంటలకు బలైన మోదీ కుటుంబం



ప్రహ్లాద్‌రాయ్ మోదీ (73)	భార్య మున్నీ మోదీ (70)
కుమారుడు పంకజ్ మోదీ (37)	కోడలు వర్షా మోదీ (32)
కుమార్తె శీతల్ జైన్ (46)	
మనవడు అనయ మోదీ	మనుమరాలు ఇదికా మోదీ
మనవడు ఇరాజ్ మోదీ (2)	
మనవడు రిషభ్ జైన్ (12)	మనుమరాలు ఆరుషి జైన్ (17)
మృతుల్లో ప్రహ్లాద్‌రాయ్ మోదీ బంధువులు	ప్రహ్లాద్ మోదీ సోదరుడు రాజేందర్ మోదీ (67), ఇతడి భార్య సుమిత్రా మోదీ (65), వీరి బంధువులు అభిషేక్ మోదీ (31), హర్షల్ గుప్తా, (7), రజని అగర్వాల్ (47), ప్రథమ్ అగర్వాల్ (14), ప్రియాంషి అగర్వాల్‌లు మరణించిన వారిలో ఉన్నారు.

అగ్నిప్రమాద ఘటనలో.. ఎప్పుడేం జరిగింది

ఆదివారం ఉదయం తెల్లవారుజామున 6:00 గంటలకు అగ్నిప్రమాదం జరిగినట్లు స్థానికులు గుర్తించారు.

6:10 స్థానికంగా ఉండే మహిళలు భవనంలో మనుషులున్నారని కాపాడాలంటూ హాహాకారాలు చేశారు.

- 6:15 చార్మినార్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు
- 6:16 ఫైర్ స్టేషన్‌కు స్థానికులు ఫోన్ చేశారు.
- 6:17 ఫైర్ ఇంజన్‌లు స్టేషన్ నుంచి ప్రారంభం అయ్యాయి
- 6:20 ఫైర్ ఇంజన్‌లు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు.
- 8:30 ఘటనా స్థలానికి చేరుకున్న సౌత్‌జోన్ డీసీపీ స్నేహమెహ్రా
- 9:00 క్షతగాత్రులను బయటకు తెచ్చిన రెస్క్యూ టీమ్
- 9:30 ఘటనా స్థలాన్ని గోల్కొండ బీజేపీ ఇన్‌చార్జి సందర్శన
- 9:40 చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ
- 10:15 ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- 10:40 సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- 11:15 బల్మూరి వెంకట్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్
- 11:30 హైడ్రా కమిషనర్ రంగనాథ్..11:40 డీజీపీ జితేందర్
- 11:50 తలసాని..
- 11:55 హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ
- మధ్యాహ్నం- 2:50 ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ
- 3:15 డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



అగ్నికీలలు

జీవితాలు బుగ్గిపాలు

రాత్రి వేళ ప్రమాదాలతో ప్రాణాలు హరీ

హైదరాబాద్ సిటీ, మే18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరంలో అగ్ని కీలలు ఎగిసిపడుతున్నాయి. పెద్దఎత్తున వ్యాపిస్తున్న మంటలు, దట్టంగా అలుముకుంటున్న పొగతో జీవితాలు బుగ్గవుతున్నాయి. ఎండాకాలం వస్తే తరచుగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రివేళ జరిగే అగ్ని ప్రమాదాల వల్లే ప్రాణనష్టం ఎక్కువగా జరుగుతోంది. నగరంలో మూడేళ్లలో జరిగిన భారీ అగ్ని ప్రమాదాలను పరిశీలిస్తే రాత్రివేళ జరిగిన వాటిలోనే మృతుల సంఖ్య భారీగా ఉన్నట్లు వెల్లడైంది.

- 2023 నవంబర్‌లో నాంపల్లిలోని బజార్‌ఘాట్‌లో రెసిడెన్షియల్ భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 9మంది మృతి చెందారు. రసాయనాలను నిల్వ ఉంచిన పార్కింగ్ ప్రాంతంలో మంటలు చెలరేగి పై మూడు అంతస్తులకు చేరాయి. దీంతో దట్టమైన పొగలతో ఆ భవనంలో అద్దెకు ఉంటున్న ఆరు కుటుంబాలు మంటల్లో చిక్కుకున్నాయి.
- 2023 ఏప్రిల్‌లో కుషాయిగూడలోని టింబర్ డిపోలో తెల్లవారుజామున అగ్ని ప్రమాదంలో మంటలు పక్కనే ఉన్న నాలుగు అంతస్తుల భవనంలోకి వ్యాపించాయి. మంటల ధాటికి భవనం రెండో అంతస్తులో ఉన్న ఒకే కుటుంబంలోని ముగ్గురు సజీవదహన మయ్యారు. దట్టమైన పొగ, మంటలు చుట్టుముట్టడంతో తప్పించుకునే మార్గం లేక మెట్లపైనే మృతి చెందారు.
- 2023 మార్చిలో సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు మరణించారు. కాంప్లెక్స్‌లోని ఐదో అంతస్తులో మంటలు చెలరేగడంతో 13మంది చిక్కుకుపోయారు. ఏడుగురిని అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. కానీ



మిగతా 6వ పేజీలో..

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదాలు

నాసిరకం విద్యుత్ తీగలు..

లోడ్‌కు మించి వినియోగంతో..

ఆలస్యంగా నివేదికలు



6

నమాజ్ చేసి వస్తూ... ఆర్తనాదాలు విని

షట్టర్ తెరిచి,

గోడలు బద్దలు కొట్టి

ప్రాణాలు కాపాడేందుకు

యువకుల యత్నం

ఇరుకుగా భవనాలు..

కింద వాణిజ్యం.. పైన నివాసాలు

ప్రమాదాలు జరిగితే అంతే..

ప్రాణాలకు ముప్పు ఉన్నా పట్టించుకోని వైనం

హైదరాబాద్ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): కింద దుకాణాలు.. పైన నివాసాలు. గ్రేటర్‌లోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. సెట్‌బ్యాక్‌లు ఉండవు. అగ్నిమాపక ఏర్పాట్లు చేయరు. కొన్ని భవనాల్లో ఫైర్‌సేఫ్టీ పరికరాలు ఉన్నా.. అలంకార ప్రాయమే. ఇదే మహానగరంలో అగ్ని ప్రమాదాల తీవ్రత పెరగడానికి ప్రధాన కారణం. ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావిడి చేసే ప్రభుత్వ విభాగాలు, అనంతరం మిన్నకుంటున్నాయి. దీంతో యథా ప్రమాదాలు.. తథా ప్రాణనష్టం అన్నట్టుగా పరిస్థితి మారుతోంది. గత మూడేళ్లలో గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో దాదాపు 58మంది మృత్యువాత పడ్డారు. నగరంలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఆదివారం చార్మినార్ సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో భారీగా ప్రాణనష్టం జరిగింది. దశాబ్దాల క్రితం నాటి భవనానికి సెట్‌బ్యాక్‌లు లేకపోవడం.. బయటకు వెళ్లే మార్గం లేక 17 మంది మృతి చెందారు. సహాయక చర్యలు చేపట్టడంలోనూ ఇబ్బందులు తలెత్తాయి. ఈ విషయాన్ని అగ్నిమాపక శాఖ అధికారికంగా ప్రకటించింది. పై అంతస్తులోకి వెళ్లేందుకు ఒకే మెట్ల మార్గం ఉండడం.. అది కూడా ఇరుకుగా ఉండడంతో మంటల్లో చిక్కుకున్న వారు కిందకు



ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఉన్న దుకాణ సముదాయం

మిగతా 6వ పేజీలో..

పొగ తీవ్రతతోనే ఎక్కువ ముప్పు

ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది

శ్వాసనాళాలు మూసుకుని..

ఆక్సిజన్ అందక ఉక్కిరిబిక్కిరి

వెంటనే ఆక్సిజన్ థెరపీ

ఇవ్వకపోతే కష్టమే..



ఫైల్

హైదరాబాద్ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల్లో దట్టమైన పొగవల్లే ఊపిరి భారంగా మారి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. అగ్ని ప్రమాదాల్లో విడుదలయ్యే కార్బన్ మోనాక్సైడ్ రక్తంలోని ఆక్సిజన్‌లో కలవడం వల్ల ఊపిరి తీసుకోవడం కష్టం మారి ప్రాణాపాయం కలుగుతుంది. కాలిన గాయాల కంటే పొగ తీవ్రత వల్లే గుల్జార్ హౌజ్ బాధితుల ప్రాణాలకు ముప్పు వాటిల్లి ఉండవచ్చుని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. అగ్నిప్రమాదాల్లో మంటల వల్ల అయ్యే గాయాల కంటే దట్టమైన

మిగతా 6వ పేజీలో..

చార్మినార్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు



హైదరాబాద్ సిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): గుల్జార్‌హౌజ్ ప్రమాద ఘటన నేపథ్యంలో చార్మినార్ పరిసరాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆదివారం సందర్భంగా చార్మినార్ సందర్శనకు పర్యాటకులు అధిక సంఖ్యలో విచ్చేసే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తం అయ్యారు. అగ్నిప్రమాదం జరిగిన ఘటన స్థలానికి ఫైర్ ఇంజన్లు, అంబులెన్స్‌లు సజావుగా వెళ్లేలా జాగ్రత్తలు తీసుకున్నారు. అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం, ప్రముఖులు ఘటనా స్థలాన్ని సందర్శించడానికి అనువుగా అక్కడ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. చార్మినార్ వైపు ట్రాఫిక్‌ను అనుమతించకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను మళ్లించారు.

సత్ఫలితాల.. సమ్మర్ యాక్షన్ ప్లాన్

ట్యాంకర్ బుక్ చేస్తే

24 గంటల్లోపే సరఫరా

గతేడాదితో పోలిస్తే

30 శాతం పెరిగిన డిమాండ్

వందలోపే పెండింగ్

ఉండేలా బోర్డు ప్రణాళిక



6

వ్యక్తి దారుణ హత్య

సిమెంట్ ఇటుకతో మోది..

కర్రతో కొట్టి చంపినట్లు

ఆనవాళ్లు



సుందరాంగుల సందడి

ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన సండేఫన్‌డేలో రద్దీ

కమాండ్ కంట్రోల్ సెంటర్, సచివాలయ ప్రాంగణంలో మిస్ వరల్డ్ అందగత్తెలు సందడి చేశారు. డ్రగ్స్‌పై పోలీసులు చేపట్టిన చర్యలకు మద్దతు చెబుతూ పోస్టర్లపై సంతకాలు చేస్తూ తమ సందేశాలను రాశారు. సచివాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో వేడివేడి మిర్చి బజ్జీలు, ఇరానీ చాయ్, ఉస్మానియా బిస్కెట్ ఇతర స్నాక్స్‌లను రుచిచూశారు. ఘుమఘుమలాడే తెలంగాణ పిండి వంటలను ఇష్టంగా తిన్నారు. మిస్‌వరల్డ్ పోటీల నేపథ్యంలో ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన సండే ఫన్‌డే కార్యక్రమం కోలాహలంగా సాగింది. ఒకవైపు సాంస్కృతిక కార్యక్రమాలు, మరోవైపు ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా సచివాలయంలో జరుగుతున్న ప్రపంచ సుందరీమణుల కార్యక్రమాలను వీక్షిస్తూ సరదాగా గడిపారు.

మరిన్ని చిత్రాలు 8లో..

ఫాల్కన్ స్కామ్‌లో మరో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ అప్లికేషన్ స్కామ్‌కు సంబంధించిన కేసులో ఇద్దరు కీలక వ్యక్తులను అరెస్టు చేశారు. ఫాల్కన్ గ్రూప్ నిర్వాహకుడు అమర్‌దీప్‌కుమార్ తండ్రి రబీంద్ర ప్రసాద్ సింగ్, అమర్‌దీప్ సోదరుడు సందీప్‌కుమార్ భార్య సుష్మారాజ్‌ను అరెస్టు చేసినట్టు సీఐడీ డీజీ షికాగోయల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిహార్‌లో ఖరీదైన విల్లాలో ఉంటున్న రబీంద్ర, సుష్మాను అరెస్టు చేసి రూ.8 లక్షలు, పలు ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు, పాస్‌పోర్టులు, పదుల సంఖ్యలో క్రెడిట్, డెబిట్ కార్డులు, ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అనే కంపెనీని రబీంద్ర ప్రసాద్‌సింగ్ రిజిస్టర్ చేయించి తన ఇద్దరు కుమారులతో ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ అప్లికేషన్ పేరిట స్కామ్‌కు తెరతీశారని, వీరంతా కలిసి 7,056 మంది నుంచి రూ.4,215 కోట్ల డిపాజిట్లు వసూలు చేశారని ఆమె తెలిపారు.

సైబరాబాద్‌లో 306 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు

హైదరాబాద్ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మద్యం తాగి వాహనాలను నడుపుతూ పట్టుబడిన 306 మందిపై ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వారం రోజులుగా కమిషనరేట్‌లో 16 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల పరిధుల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వవాహనాలను నడుపుతూ పట్టుబడిన వారిలో 246 మంది ద్విచక్రవాహనదారులు, 9 మంది మూడు చక్రాల వాహనదారులు, 50 మంది నాలుగు చక్రాల వాహనదారులు, భారీ వాహనం నడుపుతున్న ఓ వ్యక్తి ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదాలు



హైదరాబాద్ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి) షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు ప్రాణాలు తీస్తున్నాయి. ప్రతి సంవత్సరం గ్రేటర్‌లో పదుల సంఖ్యలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదాలు జరుగుతున్నా ఒకటి, రెండు ప్రమాదాలపై నివేదికలిచ్చి విద్యుత్ తనిఖీశాఖ (సీఈఐజీ) చేతులు దులుపుకుంటుంది. విద్యుత్ ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం.. ఘటనలు జరిగిన ఒకటి, రెండు రోజులు హడావిడి చేసి ఆ తర్వాత ప్రమాదాల నివారణను మరిచిపోతోంది. వేసవిలో జరిగే ప్రమాదాల్లో అధికంగా భవనాల్లో అంతర్గత వైరింగ్ సరిగా లేకపోవడం, లోడ్‌కు మించి విద్యుత్ వినియోగంతో జరుగుతున్నవేనని విద్యుత్‌రంగ నిపుణులు చెబుతున్నారు. గతంలో భారీ అగ్నిప్రమాదం జరిగి నుమాయిష్‌లో దుకాణాలు కాలి బూడిదయ్యాయి. ఆ తర్వాత కొన్ని నెలలకు అది షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదం కాదంటూ విద్యుత్ తనిఖీశాఖ నివేదిక ఇచ్చింది. రెండునెలల క్రితం ఖానామెట్‌లో 18 అంతస్థుల మీనాక్షి స్కైలాంజ్ అపార్ట్‌మెంట్‌లో విద్యుత్‌తీగల డక్ట్ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఇక్కడ షార్ట్‌సర్క్యూట్‌కు నాసిరకం కేబుళ్ల కారణమని అగ్నిమాపక శాఖ నిర్ధారించింది. అయినా ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలపై నివేదికలు ఆలస్యంగా రావడంతో ఏడాదిలో ఎన్ని ప్రమాదాలు జరిగాయనేది స్పష్టమైన లెక్కలు అధికారులు చెప్పలేకపోతున్నారు.

అవినీతికి కేంద్రంగా విద్యుత్ తనిఖీశాఖ

విద్యుత్ ప్రమాదాల నియంత్రణలో కీలకమైన విద్యుత్ తనిఖీశాఖ(సీఈఐజీ) షార్ట్ సర్క్యూట్ ప్రమాదాల నివారణను పట్టించుకోవడం లేదు. విద్యుత్ కేబుళ్లు, పరికరాల నాణ్యతను పరిశీలించడంతోపాటు 15మీటర్ల ఎత్తున్న బహుళ అంతస్థుల భవనాలకు అనుమతులు ఇచ్చేందుకు సీఈఐజీ విభాగాన్ని ఏర్పాటు చేసింది. పరిశ్రమలతోపాటు 15 మీటర్ల ఎత్తు దాటిన ప్రతి వాణిజ్య, గృహ సముదాయానికి విద్యుత్ తనిఖీ అధికారి ఎన్‌ఓసీ తప్పనిసరి చేసింది. భవిష్యత్తు విద్యుత్ అవసరాలు, ఎంపిక చేసిన విద్యుత్ సామర్థ్యం, ఇన్‌కమింగ్ లైన్, అంతర్గత విద్యుత్ లైన్లు, వినియోగించే కేబుళ్లు, ఏబీ స్విచ్‌లు, ఎర్తింగ్ సిస్టం సహా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మరు వంటివన్నీ పక్కాగా ఉన్నట్లు గుర్తించిన భవనాలకు నిరభ్యంతర పత్రం జారీ చేయాలి. పలు ప్రాంతాల్లో భవనాలను తనిఖీ చేయకుండానే ఎన్‌ఓసీలు జారీ చేసినట్లు ఆరోపణలున్నాయి. షార్ట్ సర్క్యూట్ అగ్ని ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది.

లోడ్ తనిఖీ చేయని లైన్ ఇన్‌స్పెక్టర్లు

భవనాల్లో విద్యుత్ తీగల పనితీరును లైన్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేయడం లేదు. గ్రేటర్‌లో పలు భవనాల్లో 10 ఏళ్ల క్రితం అప్పటి లోడ్‌కు అనుగుణంగా వేసిన విద్యుత్‌తీగలు ఇప్పటికీ వినియోగిస్తున్నారు. విద్యుత్‌తీగలు పాతబడిపోవడంతో పాటు అదనపు లోడ్ పడి తీగలు కాలిపోయే అవకాశాలున్నా వాటిని పట్టించుకోవడం లేదు. విద్యుత్ తీగలపై లోడ్ పెరిగి షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు నగరంలో ఎక్కువగా జరుగుతున్నాయని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వ్యాపార, వాణిజ్య సంస్థల్లో ఇష్టానుసారంగా వైరింగ్ చేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. భవనాల్లో లెక్కకు మించి ఏసీలు, సర్వర్లు వినియోగిస్తూ విద్యుత్ ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కొత్తగా నిర్మిస్తున్న బహుళ అంతస్థులు, కమర్షియల్ కాంపెక్స్‌ల్లో వైరింగ్‌పై ఎలాంటి తనిఖీలు లేకుండానే సర్టిఫికెట్లు జారీచేస్తున్నారు. పలు భవనాల్లో నాసిరకం కేబుళ్లు, ఏబీ స్విచ్‌లు వాడుతున్నారు. కంటికి కన్పించే ప్లగ్‌లు, స్విచ్‌బోర్డులు, లైట్లు మినహా గోడలు, స్లాబులో వాడే వైర్లలో నాణ్యత ఉండటం లేదు. సామర్థ్యానికి మించి ఏసీలు, వాషింగ్ మెషీన్లు, గ్రీజర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగించడం వల్ల ఒత్తిడికి కేబుళ్ల జాయింట్ల వద్ద షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగుతున్నాయి.

బీసీలకు రిజర్వేషన్ అమలు తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలి

● ఆర్. కృష్ణయ్య డిమాండ్

బర్కత్‌పుర, మే 18 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై రాష్ట్రప్రభుత్వం న్యాయనిపుణులతో చర్చించి ప్రత్యేక జీవో జారీ చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. రిజర్వేషన్లను అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ అంశంపై తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలా వెంకటేశ్ ఆధ్వర్యంలో 14 బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు పాస్ చేశారని, దీని అమలుకు అన్ని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేయాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు. సమాచార శాఖ కమిషనర్ల నియామకంలో బీసీలకు అన్యాయం జరిగిందని కృష్ణయ్య అన్నారు. మంత్రి వర్గ విస్తరణలో నామినేటెడ్ పదవుల్లో 50శాతం బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.7వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు.

మెట్రోస్టేషన్‌లో టీవీ చోరీ

బేగంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): హై సెక్యూరిటీ, నిత్యం సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉన్న మెట్రోస్టేషన్‌లో టీవీ మాయమైంది. ఆలస్యంగా గుర్తించిన ఉద్యోగులు బేగంపేట పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పరేడ్ గ్రౌండ్ మెట్రో స్టేషన్‌లో ఓ గదిలో 55 ఇంచ్‌ల స్కైవర్త్ టెలివిజన్‌ను అందుబాటులో ఉంచారు. ఇటీవల ఆ గదిలోకి వెళ్లిన అధికారులు టెలివిజన్ కనిపించకపోవడంతో అంతర్గత విచారణ జరిపి స్టేషన్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. గతనెల 20వ తేదీ ఉదయం 5.52 గంటలకు టెక్నీషియన్‌లు అశోక్, ఉమామహేశ్వర్ ఆ గదిలోకి వెళ్లి టెలివిజన్‌ను తీసుకెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది. దాని ఆధారంగా స్టేషన్ అధికారి డి. కృపాదర్శిని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆనందం.. అంతలోనే విషాదం..!

● మిస్‌వరల్డ్ హెరిటేజ్ వాక్ జరిగిన ఆరు రోజులకే అగ్ని ప్రమాదం

హైదరాబాద్ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ హెరిటేజ్‌వాక్‌లో భాగంగా చారిత్రక కట్టడం చార్మినార్ వద్ద ఆరు రోజుల క్రితమే సుందరీమణులు సందడిచేశారు. చార్మినార్‌ను ఆసక్తిగా తిలకించడంతోపాటు అక్కడ పోటీదారులతో నిర్వహించిన హెరిటేజ్ వాక్‌తో స్థానికులంతా ఆనందంతో ఉన్నారు. ఆ వేడుకను నగరప్రజలు మరిచిపోకముందే.. ఆదివారం ఉదయం చార్మినార్‌కు అతి దగ్గరగా ఉన్న గుల్జార్‌హౌస్ ప్రాంతంలో ఓ ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 17 మంది ప్రాణాలు కోల్పోవడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. హెరిటేజ్‌వాక్ తీసుకొచ్చిన ఆనందం కనీసం వారం రోజులపాటు కూడా లేకపోయిందని పలువురు వాపోయారు.

అగ్నికీలలు

(5వ పేజీ తరువాయి)

నలుగురు మహిళలతో సహా ఆరుగురు పొగ పీల్చడం వల్ల ఊపిరాడక మృతి చెందారు.

● 2023 జనవరిలో సికింద్రాబాద్‌లోని మినిస్టర్స్ రోడ్‌లోని నల్లగుట్ట వద్ద ఓ దుస్తుల దుకాణంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో ముగ్గురు కార్మికులు సజీవ దహనమయ్యారు.

● 2022 సెప్టెంబర్‌లో సికింద్రాబాద్‌లోని రూబీ హోటల్‌లో ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్‌లో విద్యుదాఘాతం వల్ల జరిగిన అగ్నిప్రమాదంలో 8 మంది మృతి చెందారు. 11 మందికి గాయాలయ్యాయి. పార్కింగ్ ప్రాంతంలో జరిగిన ప్రమాదంతో బయటకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో మృత్యువాత పడ్డారు.

● 2022 మార్చిలో సికింద్రాబాద్‌లోని బోయిగూడలో ఓ స్ర్కాప్ గోదామ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 12మంది సజీవ దహనమయ్యారు. 11 మృతదేహాలు గుర్తు పట్టలేని విధంగా కాలిపోయాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో కార్మికుడు వారం రోజులకు మరణించడంతో మృతుల సంఖ్య 12కు చేరింది.

నమాజ్ చేసి వస్తూ... ఆర్తనాదాలు విని..

● షట్టర్ తెరిచి, గోడలు బద్దలు కొట్టి..
● ప్రాణాలు కాపాడేందుకు యువకుల యత్నం


పిల్లలను కాపాడేందుకు యత్నించిన యువకులు

హైదరాబాద్ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): గుల్జార్‌హౌస్ వద్ద ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు స్థానిక యువకులు ప్రయత్నించారు. మీర్ జాహిద్, మహ్మద్ అజ్మత్, ఇబ్రహీం, అమీర్ ఉదయం మక్కా మసీదులో ఫజర్ నమాజ్ పూర్తి చేసుకొని గుల్జార్‌హౌస్ వైపునకు వెళ్తున్నారు. అదే సమయంలో కృష్ణా పెరల్స్‌లో అగ్ని ప్రమాదం నుంచి బయటపడిన ఇద్దరు మహిళలు కాపాడమని ఆర్తనాదాలు చేస్తున్నారు. యువకులు వారి వద్దకు వెళ్లి ఏం జరిగిందని ఆరా తీశారు. ఆ సమయంలో భవనం నుంచి దట్టమైన పొగ వస్తోంది. లోపల మంటలు చెలరేగుతున్నాయని, చిన్న పిల్లలు చిక్కుకుపోయారని, వారిని కాపాడాలని మహిళలు వేడుకున్నారు. యువకులు లోపలికి వెళ్లే ప్రయత్నం చేయగా మంటల తీవ్రతతో వెళ్లలేకపోయారు. లోపలికి వెళ్లేందుకు పక్కనే ఉన్న దుకాణం షట్టర్ తెరిచి పక్క భవనంలోకి ప్రవేశించారు. అక్కడి నుంచి పోలీసుల సహకారంతో రెండు గోడలు బద్దలు కొట్టి ప్రమాదం జరిగిన ఇంట్లోకి వెళ్లారు. ఓ గదిలో మహిళతోపాటు పిల్లలను గుర్తించామని మీర్ జాహిద్ చెప్పాడు. పిల్లలను కాపాడేందుకు మహిళ వారిని గట్టిగా కౌగిలించుకొని ఉంది. కానీ వారందరూ అప్పటికే చనిపోయి ఉన్నారు. ఈ సంఘటనను తలచుకొని కన్నీటి పర్యంతమయ్యానని, జీవితాంతం మర్చిపోలేనని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఇరుకుగా భవనాలు..

(5వ పేజీ తరువాయి)

రాలేకపోయారు. భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లోని మీటర్ ప్యానెల్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగినట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

ఆ ప్రాంతాల్లో అంగుళం ఖాళీ లేకుండా..

దశాబ్దాల క్రితం వ్యాపార, వాణిజ్య కేంద్రాలుగా గుర్తింపు పొందిన ప్రాంతాల్లో అనుకోని దుర్ఘటన జరిగితే అంతే. ఇరుకు గల్లీల్లో ఉండే బహుళ అంతస్థుల భవనాల్లో సహాయక చర్యలు చేపట్టడమూ కష్టమే. దుర్ఘటన జరిగితే మాత్రం ఆస్తి, ప్రాణనష్టం ఊహించలేం. పాతబస్తీతోపాటు కోఠి, బేగంబజార్, సికింద్రాబాద్ ఆర్‌పీ రోడ్, రెజిమెంటల్ బజార్ తదితర ప్రాంతాల్లో భవనాల మధ్య అంగుళం ఖాళీ కూడా ఉండదు. ఒకదానినొకటి ఆనుకొని నిర్మాణాలుంటాయి. కొన్ని చోట్లయితే రెండు భవనాలకు ఒకే గోడ ఉంటుంది. భవనంలోకి వెళ్లేందుకు ఒకే మార్గం, ఒకటి, రెండు మినహా కిటికీలు, వెంటిలేషన్ ఉండదు. బేగంబజార్‌లో ప్లాస్టిక్, ఇతరత్రా సామగ్రి నిల్వ చేసే గోడౌన్లూ అక్కడే ఉంటాయి. ఇలాంటి చోట్ల దుర్ఘటన జరిగితే..? ఆటోలు, కార్లు కూడా వెళ్లలేని ఈ ప్రాంతంలో ఫైరింజన్లు వెళ్లడం దాదాపు కష్టమే. సహాయక చర్యల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది.


ఇతర ప్రాంతాల్లోనూ..

పాతనగరమే కాదు.. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, ఎల్‌బీనగర్ జోన్ల పరిధిలోనూ కింద దుకాణాలు, పైన నివాసాలు ఉంటున్నాయి. సాధారణ వ్యాపారాలతో ఇబ్బందులు లేనప్పటికీ.. హోటళ్లు, మెస్‌లు, ఇంటీరియర్(ఉడ్‌వర్క్) ఎక్కువగా చేసే దుకాణాలతో పెను ముప్పు పొంచి ఉంది. అనుకోని ఘటన జరిగితే.. హోటళ్లు, మెస్‌లలోని సిలిండర్లు పేలి ప్రమాదాల తీవ్రత పెరుగుతోంది. ఉడ్‌వర్క్ చేసిన భవనాల్లో మంటలంటుకొని భారీ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల నివాస భవనాల్లోనే గోడౌన్లు ఉంటున్నాయి. గతంలో నాంపల్లి బజార్‌ఘాట్‌లో ఓ నివాస భవనంలో అగ్నిప్రమాదం జరిగి తొమ్మిది మంది మృతి చెందారు. భవన యజమానుల అత్యాశతో అమాయకులు బలవుతున్నారు.

చర్యలేవి.. నిబంధనల సవరణ ఎప్పుడు?

గ్రేటర్‌లోని చాలా ప్రాంతాల్లో భవనాలకు పట్టణ ప్రణాళికా విభాగం నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్‌లు లేవు. చాలా వరకు బహుళ అంతస్థుల భవనాల్లో అగ్నిమాపక ఏర్పాట్లూ ఉండవు. గతంలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టిన జీహెచ్‌ఎంసీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఈవీడీఎం) విభాగం 90శాతానికి పైగా భవనాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్టు గుర్తించారు. వేల సంఖ్యలో భవన యజమానులకు నోటీసులు జారీచేసినప్పటికీ మెజార్టీ యజమానులు వాటిని పట్టించుకోలేదు. అధికారులు కఠినమైన చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో అగ్నిమాపక శాఖ, భవన నిర్మాణ నిబంధనల్లో మార్పులు చేయాలని గతంలో ప్రభుత్వ విభాగాలు భావించాయి. ఇప్పటి వరకు నిబంధనల సవరణ జరగలేదు. భవన నిర్మాణం పూర్తయ్యాక నిబంధనలు పాటించారా, అగ్నిమాపక ఏర్పాట్లు చేశారా.. అన్నది చూడకుండా నిరభ్యంతర పత్రం ఇస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మున్ముందు పరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారతాయని నిపుణులు చెబుతున్నారు.

ఇదీ.. గుల్జార్‌హౌజ్ కథ!



హైదరాబాద్ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పాతనగరంలోని గుల్జార్‌హౌస్‌కు చార్మినార్‌కు ఉన్నంత చరిత్ర ఉంది..! 1591లో కుతుబ్‌షాహీ నవాబు మహమ్మద్ కులీకుతుబ్‌షా చార్మినార్‌ను నిర్మిస్తున్న సమయంలోనే.. నాలుగు వైపులా ఉద్యానవనం, నీటి కొలనులు ఉండాలని సంకల్పించారు. 1592లో చార్మినార్‌కు నాలుగు వైపులా.. నాలుగు ద్వారాలు/దర్వాజాలు(చార్‌కమాన్)ను.. మధ్యలో అష్టభుజి ఆకారంలో ఫౌంటెయిన్‌ను నిర్మించారు. మొదట్లో దీన్ని చార్‌సుఖ హౌజ్, ఆ తర్వాత సుఖహౌజ్‌గా పిలిచేవారు. పూల వనాలకు నీరందించడం వల్ల దీనిపేరు గుల్జార్‌హౌజ్ అయ్యింది. గుల్జార్ అంటే పూలవనం అని.. హౌజ్ అంటే నీటి కొలను అని అర్థం. శతాబ్దం క్రితం వరకు కూడా ఈ కొలను వేసవిలో స్థానికుల దాహార్తిని తీర్చేదని దక్కన్ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధులు చెబుతున్నారు. 1687లో మొఘలులు గోల్కొండ కోటను, హైదరాబాద్‌ను ఆక్రమించాక.. కులీకుతుబ్‌షా కాలం నాటి అద్భుత నిర్మాణాలు, రాజ ప్రాసాదాలను ఔరంగజేబు నేలమట్టం చేశాడని చరిత్ర పరిశోధకులు చెబుతున్నారు. అయితే.. చుట్టూ వనాలు పోయినా.. నేటికీ గుల్జార్‌హౌజ్ చరిత్రకు ప్రతిరూపంగా నిలిచిపోయింది. అసఫ్‌జాహీ(నిజాం)ల కాలంలో కూడా సైనికుల తాగునీటి అవసరాలకు గుల్జార్‌హౌజ్‌ను వినియోగించేవారు. మూడేళ్ల క్రితం గుల్జార్‌హౌజ్‌ను పునరుద్ధరించారు. అయితే.. టైల్స్ వేసి, గుల్జార్‌హౌజ్ రూపురేఖలను మార్చేశారంటూ అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి.

పొగ తీవ్రతతోనే ఎక్కువ ముప్పు

(5వ పేజీ తరువాయి)

పొగతో ప్రాణాలు పోయే ముప్పు అధికంగా ఉంటుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

కార్బన్ మోనాక్సైడ్‌తో..

అగ్నిప్రమాదాల్లో విడుదలయ్యే కార్బన్ మోనాక్సైడ్ అత్యంత వేగంగా రక్తంలోని ఆక్సిజన్‌లో కలుస్తుంది. దాదాపు 40 శాతం మేర దీని ప్రభావం ఉంటుండడంతో ఊపిరి అందదు. గుండెనొప్పికి ఆస్కారం ఉంటుంది. మెదడుకు ఆక్సిజన్ అందక కోమాలోకి సైతం వెళ్తారు. ఇటువంటి సమయంలో ఆక్సిజన్ థెరపీ ఇచ్చి, వెంటనే వారిని ఆస్పత్రికి తరలించాలి. భవనం పైకప్పు కూలిన ఘటనల్లో బాధితుల ఛాతీ ఎముకలు ఫ్రాక్చర్ అవుతాయి. రక్తనాళాలు చిట్లి ఊపిరితిత్తుల పొరలోకి రక్తం చేరుతుంది. దీంతో ఆ సమయంలో ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి అయ్యే అవకాశం ఉంటుంది.

ఇలా చేయాలి

మొదట అగ్నిప్రమాద బాధితులను అంబులెన్స్ వద్దకు తరలించి ఆక్సిజన్ థెరపీ అందించాలి. ఆ వెంటనే ఆస్పత్రికి తరలించాలి. ఊపిరితిత్తులకు ఏ మేరకు నష్టం వాటిల్లిందో పరిశీలించాలి. అగ్నిప్రమాదాల్లో 5 నుంచి 10 నిమిషాలున్నా సరే ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. పిల్లలకు ఊపిరితిత్తుల సామర్థ్యం తక్కువగా ఉండడం వల్ల కార్బన్ మోనాక్సైడ్ పీలిస్తే త్వరగా స్పృహ కోల్పోయే అవకాశం ఉంటుంది. వారికి వెంటనే ఆక్సిజన్ థెరపీ ఇవ్వాలి. ఆస్తమా రోగులకు ఈ పొగ మరింత ప్రాణాంతకం. వారు ఊపిరి తీసుకోలేక అవస్థ పడతారు. వారికి నెబ్‌లైజేషన్ ఇస్తూ త్వరితగతిన ఆస్పత్రికి తరలించాలి.

శ్వాసనాళాలు మూసుకుపోయి ఉక్కిరిబిక్కిరి



అగ్నిప్రమాదాల సమయంలో గాలిగొట్టాల నుంచి వెళ్లిన పొగతో ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. పొగ వస్తుండడంతో శ్వాస నాళాలు మూసుకుపోతాయి. దీంతో బయటి గాలి లోపలికి వెళ్లలేక.. లోపలి కార్బన్‌డయాక్సైడ్ బయటకు రాలేక శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. విషతుల్యాలు ఎక్కువ కావడంతో ఉమ్మి వంటి స్రావాలు పెరిగి ఊపిరి తీసుకోవడం భారంగా మారుతుంది. ఆయాసం, దగ్గు విపరీతంగా పెరిగిపోతుంది. పొగలో చిక్కుకున్న వారిని 5 నుంచి 10 నిమిషాల్లో బయటకు తీసుకురాలేకపోతే ప్రాణాలకు ముప్పు ఉంటుంది. బయటకు తీసుకువచ్చిన వెంటనే వారికి ఆక్సిజన్ అందించడం, వెంటిలేటర్ ఏర్పాటు చేయాల్సిన అవసరముంది.

- డాక్టర్ పెద్ది శ్రీకాంత్, క్లినికల్, ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు, స్టార్ ఆస్పత్రి

బయటకు వెళ్లే మార్గాలు వెతుక్కోవాలి



అగ్నిప్రమాదాల్లో ఒకవైపు పొగ, మరోవైపు వేడిమి వల్ల ఇబ్బంది తీవ్రమవుతుంది. విపరీతమైన పొగ పీల్చుకున్న వారికి 20 నుంచి 30 నిమిషాల్లో వెంటనే చికిత్స అందించకపోతే ఇబ్బందులు వస్తాయి. కొందరిలో అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రస్ సిండ్రోమ్ (ఎఆర్‌డీఎస్) వచ్చే అవకాశాలు ఉంటాయి. అగ్ని ప్రమాదాల్లో కళ్లు దెబ్బతినే ప్రమాదం ఉంది. అగ్నిప్రమాదాల సమయంలో బాధితులు వెంటనే బయటకు వెళ్లేందుకు మార్గాలు వెతుక్కోవాలి. పొగను పీల్చుకోకుండా ఉండడానికి మాస్కులు ధరించడం, దుప్పట్లు వంటివి ఒంటినిండా కప్పుకొని బయటికి వెళ్లాలి. దీనివల్ల కొంతమేరకు పొగనుంచి తప్పించుకోవడానికి అవకాశముంటుంది.

- డాక్టర్ రాజమనోహర్ ఆచార్యులు, క్రిటికల్‌కేర్, పల్మనాలజిస్టు, మెడికవర్ ఆస్పత్రి

వృత్తిని చాలెంజ్‌గా తీసుకుంటే మంచి ఫలితాలు

● మాజీ స్పీకర్ మధుసూదనాచారి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

బర్కత్‌పుర, మే 18(ఆంధ్రజ్యోతి): వృత్తిని చాలెంజ్‌గా తీసుకునప్పుడే మంచి ఫలితాలు వస్తాయని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. వృత్తిని ఎంచుకునే ముందు ఆ వృత్తిపట్ల ఉన్న అవగాహను పరిగణలోకి తీసుకోవాలని ఆయన కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సమాచార హక్కు వికాస సమితి గౌరవ అధ్యక్షుడు కాచం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విశ్వంభర పత్రిక మొదటి వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పత్రికలు ప్రధాన పాత్రపోషించాయని, దానిలో 'ఆంధ్రజ్యోతి' పత్రిక నిర్వహించిన పాత్ర అమోఘం అన్నారు. పత్రికలు ప్రజల పక్షాణ నిలబడి వారి గొంతుకగా మారాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... వాస్తవాలకు జర్నలిజం నిలువుటద్దంగా నిలుస్తుందన్నారు. సోషల్‌మీడియా ఎంత అభివృద్ధి చెందినా పత్రికలకు ప్రజల ఆదరణ తగ్గలేదన్నారు. ప్రజలు పత్రికలు చదివే విధంగా గ్రంథాలయాలను విరివిగా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

తెలుగు అక్షరంపై చెరగని ముద్ర చలం

● చలం భావన కన్వీనర్ డా. నాళేశ్వరం శంకరం



చలం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, మే 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు అక్షరం మీద అంచలంచల ప్రభావం వేసినవాడు చలం అని చలం భావన కన్వీనర్ నాళేశ్వరం శంకరం అన్నారు. ఆదివారం రవీంద్ర భారతిలో జీవజలం చలం సాహిత్య స్మారకోపన్యాస సభ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా. నందిని సిధా రెడ్డి, డా. నాళేశ్వరం శంకరం ఎన్. మల్లేశ్వరి, నెల్లుట్ల రమాదేవి పాల్గొని చలం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ.. చలం రచనలు చేసిన కాలం తరువాత ఎనిమిది దశాబ్దాలు గడిచాక కూడా ఇప్పటికీ చలం రచనల గురించి మాట్లాడుకుంటున్నామంటే ఆ రచనలలో ఉన్న సార్వకాలీనతను అర్థం చేసుకోవచ్చు అన్నారు. ఉన్నతమైన స్వచ్ఛమైన షరతుల్లేని ప్రేమను వ్యక్తం చేస్తూ చలం ప్రేమలేఖలు రాశాడు. ఇందులో కొన్ని వ్యక్తులకు రాసినవి, మరికొన్ని ఊహామూర్తులకు రాసినవి. గొప్ప ప్రేమ లేనిదే ప్రేమలేఖలు రాయలేరు అంటాడు చలం. ఈ 'ప్రేమ లేఖలు' పుస్తకం చదవడం ఒక అద్భుతమైన అనుభవం అని అన్నారు. రమాదేవి, హరికృష్ణ మాట్లాడారు.

'చూపు ఎంత అలిసిందో' గజల్ సంపుటి ఆవిష్కరణ



గజల్ సంపుటిని ఆవిష్కరిస్తున్న కొలకలూరి ఇనాక్ తదితరులు

రవీంద్రభాతి, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గజల్ రచయిత్రి, గాయని 'మళ్ళ జ్యోతిర్మయి' రచించిన 'చూపు ఎంత అలిసిందో' గజల్ సంపుటిని పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. ఆదివారం రవీంద్రభారతిలో జరిగిన ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సాహితవేత్త డా.కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. జ్యోతిర్మయి గొంతులో వినిపించే విషాద.. ఛాయ హృదయానికి హత్తుకుంటుందన్నారు. తెలుగు గజల్‌ను జ్యోతిర్మయిలా గొప్పగా పాడే గాయని వేరొకరు లేరన్నారు. జ్యోతిర్మయి పాటలో ఆత్మాభివ్యక్తి బాగుంటుందన్నారు. గజల్ ఓ సారి వింటే మనం కూడా గజల్‌ను పాడటానికి ఇష్టపడతామన్నారు. గజల్‌లో ఉన్న ఆర్తి జ్యోతిర్మయి స్వరంలోనే ఉందంటూ ప్రశంసించారు. గజల్ వింటే ఓ పలకరింపుగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో రచయిత వాహెద్, బిక్కి కృష్ణ, సినీ దర్శకుడు, రచయిత దేవిశ్రీ ప్రసాద్, డి. విజయభాస్కర్, విజయలక్ష్మి పండిట్, చల్లా స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

బాలభాస్కర్‌కు సత్కారం



రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్‌గా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ బాలభాస్కర్‌ను ఆదివారం శాలువ, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.పర్వతాలు గౌడ్, డాక్టర్ జక్కయ్య, డాక్టర్ ప్రసాద్ తదితరులు సన్మానించిన వారిలో ఉన్నారు.

\- బర్కత్‌పుర, మే 18(ఆంధ్రజ్యోతి)

పుచ్చలపల్లి సుందరయ్య స్మారకోపన్యాస సభ నేడు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వినయ్‌కుమార్, రమణారావు తదితరులు

రాంనగర్, మే 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమర యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను ఈనెల 19న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఎస్వీకే ట్రస్ట్ కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సుందరయ్య కళానిలయంలో సుందరయ్య స్మారకోపన్యాస సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 1987లో సుందరయ్య విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కేంద్రం నుంచి పేదలు, కార్మికులకు విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనకు కృషి చేసిందన్నారు. 19వ తేదీన సాయంత్రం ఎస్వీకేలో సుందరయ్య స్మారకోపన్యాసం సందర్భంగా నేటి రాజకీయాలు- షహీద్ భగత్‌సింగ్ చరిత్రపై ప్రొఫెసర్ చమన్‌లాల్ ప్రసంగించనన్నారని తెలిపారు. దీనికి సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సీపీఎం నేతలు తమ్మినేని వీరభద్రం, బుచ్చిరెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నేతలు భూపతి వెంకటేశ్వర్లు, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్

మద్యం బాబులకు అడ్డాగా మారిన వైనం

చార్మినార్, మే 18 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు ప్రాధాన్యమిస్తూ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మైదానాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. రూ. కోట్లలో ఖర్చుచేసి నిర్మించిన భవనాలు భూత్ బంగ్లాలుగా మారుతున్నాయని క్రీడాకారులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఎంతో కొంత బాగున్నా.. పాతబస్తీలో మాత్రం ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాతబస్తీ క్రీడాకారుల సౌకర్యార్థం 2017లో మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించి పలు అంతస్తుల్లో వివిధ ఇండోర్ గేమ్స్‌కు సంబంధించి



మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవనం



అరకొర వసతుల మధ్య క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

క్రీడా పరికరాలు సమకూర్చారు. క్రికెట్, ఫుట్‌బాల్ టేబుల్ టెన్నిస్, యోగా, జిమ్నాస్టిక్, జిమ్, బాక్సింగ్, గ్రౌండ్‌లు ఏర్పాటు చేశారు. రానురాను మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌పై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆదరణ తగ్గుతూ వచ్చింది.

బల్దియా కార్యాలయం మార్పుతో..

2021లో ఇదే కాంప్లెక్స్‌లోని మొదటి అంతస్తులో చార్మినార్ సర్కిల్ కార్యాలయాన్ని మార్చడంతో మరింత ఇబ్బందులు తలెత్తాయి. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు సెల్లార్‌లో తమతమ వాహనాలను పార్కింగ్ చేయడం మొదలు పెట్టారు. తర్వాత పరిసర బస్తీల వారు తమ కార్లను ఇక్కడ పార్కింగ్ చేస్తుండడంతో ఆఫీస్‌కొచ్చే వారు పార్కింగ్ కోసం ఇబ్బంది పడుతున్నారు.

మొదటి అంతస్తులో వివిధ శాఖలకు సంబంధించి చాంబర్లు ఏర్పాటు చేశారు. క్రీడలపై సంబంధిత అధికారులు సైతం ఆసక్తి చూపకపోవడంతో కొందరు ఆకతాయిలు క్రీడా సామగ్రిని ధ్వంసం చేశారు. తలుపులు, కిటికీలు, విరిగిపోయాయి. కనీసం సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడంతో ఆకతాయిలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పముఖులు సందర్శించినా ఫలితం శూన్యం..

మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమస్యలపై క్రీడాకారులు, స్థానిక నాయకులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా పలుమార్లు వారు సందర్శించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఎమ్మెల్యేలు, ఎంపీ, సైతం పరిశీలించి వెళ్లిపోయారే తప్ప.. ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కేవలం మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారుల ముందు ప్రణాళికలు రూపొందించండి, అంచనాలు వేయండి అంటున్నారే తప్ప క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని సమాచారం.

ఇక్కడే ఓ గదిలో ఇష్టానుసారంగా పాత ఫైల్స్ పడేయడంతో ఇటీవల అగ్ని ప్రమాదం సైతం చోటు చేసుకుంది. మూత్రశాలలు, మరగుదొడ్లు సైతం ధ్వంసమవుతున్నాయి.



నిరుపయోగంగా ఉన్న బాస్కెట్ బాల్ రింగ్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

సెక్యూరిటీ ఏర్పాటు చేయాలనీ సర్కిల్ అధికారులను కోరినా స్పందన లేదు. ఎవరూ లేకపోవడంతో రాత్రి సమయంలో మద్యం దారులు వచ్చి క్రీడా సామగ్రితో పాటు, కిటికీలు, తలుపులు ఎలక్రిక్ బోర్డులను ధంసం చేస్తున్నారు. మరమ్మతు చేయాలని ఉన్నతాధికారులకు పలుమార్లు అర్జీలు ఇచ్చినా స్పందన లేదు. నూతన క్రీడా పరికాలు సమకూరిస్తే క్రీడాకారులకు సౌకర్యంగా ఉంటుంది.

\- ఇంతియాజ్ అహ్మద్ సర్కిల్ స్పోర్ట్స్ గేమ్స్ ఇన్‌స్పెక్టర్

ఒక్క ఫోన్ కాల్‌తో మహిళలకు రక్షణ

గన్‌పార్క్, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాలు, అఘాయిత్యాలు చోటు చేసుకోకుండా నిరంతరం ఇక్కడి పోలీసులు అప్రమత్తంగా ఉంటారు. పల్లె, పట్నం, వీధులు, బస్తీలు, కాలనీల్లో పోకిరీల బెడద నుంచి కాపాడుతారు. సకాలంలో వారికి భద్రత, రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ పోలీసు శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. అర్ధరాత్రి, అపరాత్రి అయినా సరే ఇబ్బందుల్లో ఉండే మహిళలు, యువతులు, బాలికల భద్రతకు 24 బై 7 విధులు నిర్వహిసున్నారు. ఆపదలో ఉన్న సమయంలో సేఫ్టీ వింగ్‌కు ఒక్క ఫోన్ కాల్ చేస్తే పోలీసులు పావుగంటలోనే ఆ సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని చర్యలు చేపడతారు. కష్టాల్లో ఉన్న వారికి రక్షణ కల్పించి అండగా నిలుస్తారు. ఆకతాయిల పనిపట్టి, వారి ఆధారాలను సేకరించి పాస్ట్ ట్రాక్‌కోర్టు ద్వారా వేగంగా శిక్షలు పడేందుకు గట్టి చర్యలు చేపడుతన్నారు.



లక్డికపూల్‌లోని ఉమెన్ సేఫ్టీవింగ్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారి

24 గంటలు మహిళల రక్షణకు

మహిళలు ఆపత్కాల సమయంలో ఉంటే వెంటనే సెల్ నంబరు 87126 56858 నంబరును సంప్రదించాలి. లక్డికాపూల్ బస్టాపు, మెట్రో స్టేషన్ పక్కనే ఉన్న ఉమెన్ సేఫ్టీవింగ్ రాష్ట్ర కార్యాలయం ఉంది. ఈశాఖను 2019లో ఏర్పాటు చేశారు. వీరి సేవలను గుర్తించిన కేంద్రం తగిన విధంగా ప్రోత్సహిస్తోంది. రాష్ట్ర పోలీసు డీజీ అధికారిణి శిఖాగోయల్ నేతృత్వంలో ఉమెన్స్ సేఫ్టీ వింగ్‌తో మహిళల భద్రతను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. మండల కేంద్రాలు, జిల్లాలు, నగరాల్లో మహిళలపై హింసాత్మక సం ఘటనలు జరిగితే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేస్తారు. అప్పుడు స్థానిక ప్రజా ప్రతినిధులు మహిళల కేసుల్లో పెత్తనం చెలాయించి కేసు నీరుగార్చే పని చేస్తారు. అలాంటి వారికి అవకాశం ఇవ్వకుండా, వారి ఆటలు సాగకుండా బాధితులకు న్యాయం చేయడమే ధ్యేయంగా ఉమెన్స్ వింగ్ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి కేసు పూర్వపరాలు డీజీ సమీక్షా సమావేశంలో కేసు నమోదు సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలపై రివ్యూ చేస్తారు. పెండింగ్ ఉంటే జిల్లా ఎస్పీలను అలర్ట్ చేస్తారు. ఏది ఏమైనా కేసుకు న్యా యం చేస్తారు. స్థానిక పోలీసు స్టేషన్లలో అన్యాయం జరిగితే ఇక్కడి ఉమెన్స్ సేఫ్టీ వింగ్‌కు వచ్చి ఫిర్యాదు చేయొచ్చు. మహిళా ఉద్యోగులు తప్పనిసరిగా వారి సెల్‌ఫోన్లలో టీసేఫ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తున్నారు. 100, 112కు సైతం ఫోన్ చేయొచ్చు.

ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి



సుబుదేంద్రా తీర్థ స్వామితో దిడ్డి రాంబాబు తదితరులు

బర్కత్‌పుర, మే 18(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆధ్యాత్మిక చింతన పెపొందినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని రాఘవేంద్ర మఠం పీఠాధిపతి సుబుదేంద్రా తీర్థ స్వామి అన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని రాఘవేంద్ర స్వామి మఠంలో ఆధునికీకరించిన పరిమళ కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యాకిషన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, అనంత్‌పురానిక్, అనిల్, విఠల్‌జోషి, బద్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరాంఘర్ చౌరస్తా రైల్వే బ్రిడ్జి కింద రాకపోకలు బంద్

రాజేంద్రనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19నుంచి ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి కింద నుంచి వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్టు రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ తెలిపారు. దుర్గానగర్ నుంచి ఆరాంఘర్ చౌరస్తా వైపు వచ్చే వాహనదారులు, శివరాంపల్లి నుంచి దుర్గానగర్ వైపు వెళ్లే వాహనదారులు ఆ మార్గంలో వెళ్లవద్దన్నారు. చాంద్రాయణగుట్ట నుంచి వచ్చే వాహనదారులు దుర్గానగర్ వైపు కాకుండా కాటేదాన్ మీదుగా ఓల్డ్ కర్నూలు రోడ్డు ద్వారా ప్రయాణించాలన్నారు. శివరాంపల్లి నుంచి ఆరాంఘర్ మీదుగా దుర్గానగర్ వెళ్లేవారు గగన్‌పహాడ్ ఓల్డ్ కర్నూలు రోడ్డులో వెళ్లాన్నారు. 15 రోజుల పాటు ఇలాగే ఉంటుందని వాహనదారులు గమనించి సహకరించాలన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



శిల్పారామంలో కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శిస్తున్న కళాకారులు

మాదాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం కనువిందు చేసే నృత్యాలు చూపరుల మదిని దోచుకున్నాయి. సంగీత సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఈరోజు నృత్య కిన్నెర మద్దాలి ఉషా గాయత్రీ, శిష్య బృందం "మాతృదేవో భవ" అనే కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించారు. భమిడి పల్లి నరసింహ మూర్తి సత్య యుగం, కృత యుగం, త్రేతాయుగం, ద్వాపర యుగం, కలియుగంలో మాతృమూర్తులు పార్వతీ దేవి, లీలావతి, సీత, యశోద, వకుళా దేవి మాతృ ప్రేమని కూచిపూడి నృత్య రూపకంలో వివరించారు. కార్యక్రమంలో కళాకారులు వాసవి చౌదరి, రమ్య వేణి, లక్ష్మి, నీరజ, ఆశ్రిత షిండే, యశస్వినీ తన్మయి, సహస్ర, లక్ష్మి వాత్సల్య, రసజ్ఞ, లాస్య ప్రియా, సుఖి, చేరిష్య, ఇరా, దీక్షిత తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

ధూల్‌పేటలో గంజాయి విక్రేత అరెస్ట్

● 6 కిలోల గంజాయి స్వాధీనం



ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితుడు

హైదరాబాద్ సిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): ధూల్‌పేట్‌లో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ అధికారులు అరెస్ట్ చేశారు. ధూల్‌పేట రహీంపురా ప్రాంతానికి చెందిన నవీన్ సింగ్, ఇందూరు అమ్రేష్, వినోద్, లడ్డు, బిజయ్‌టర్కీ కలిసి గంజాయి విక్రయిస్తున్నారు. వీరి దందాపై పక్కా సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బృంద సభ్యులు రహీంపురాలో నవీన్‌సింగ్ ఇంటిపై దాడి చేశారు. నవీన్‌సింగ్‌ను అరెస్ట్ చేసి, అతడి నుంచి 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అమ్రేష్, వినోద్, లడ్డు, బిజయ్ టర్కీ పరారీలో ఉన్నట్టు ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ టీమ్ లీడర్ అంజిరెడ్డి తెలిపారు.

'మావోలతో చర్చలు జరపాలి'



మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు చిత్రంలో చలపతిరావు, గోవర్ధన్

రాంనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోలతో శాంతి చర్చలను జరపాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జేవీ చలపతిరావు, సాధినేని వెంకటేశ్వర్‌రావు, గోవర్ధన్ మాట్లాడారు. భారత్, పాక్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అటవీ ప్రాంతాల్లో కాల్పుల విరమణకు స్వస్తి పలికి మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్‌చేశారు. సాయుధ పోలీసులను క్యాంపుల నుంచి సత్వరమే తరలించాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులపై కాల్పుల పేరుతో హత్యలు చేయడం దుర్మార్గమని ఆరోపించారు. కర్రె గుట్ట నుంచి సాయుధ పోలీసులు వెనక్కిరావాలని డిమాండ్ చేశారు. కగార్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 24 వరకు శాంతియుత కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, మే 18 (ఆంధ్రజ్యోతి): హుందానగర్ రైల్వే స్టేషన్ ప్లాట్‌పారం - 5 వద్దగల ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి కిందపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి తీవ్ర గాయాలతో మృతిచెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ చిన్మయ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం అర్ధరాత్రి 35 ఏళ్ల వయసుగల గుర్తుతెలియని వ్యక్తి ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఒకే భవనం.. 2 పోలీస్‌స్టేషన్లు.. 2 ఏసీపీ కార్యాలయాలు!

● గతంలో స్టోర్ రూం.. ఇప్పుడు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్

● స్థలం సరిపోక కానిస్టేబుళ్ల ఇబ్బందులు

ఖైరతాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): పౌర హక్కులకు భంగం కలిగితే చట్టం ప్రకారం చర్యలు తీసుకునే పోలీసులకే కక్కలేక.. మింగలేక అనే పరిస్థితి నెలకొంది. తమ బాధలను ఉన్నతాధికారులకు చెప్పుకోలేక, ఉన్న వసతులు సరిపోక సతమతమవుతున్నా ఉన్నతస్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో చేసేదేమీలేక ఉన్నంతలో సర్దుకుంటున్నారు. ఖైరతాబాద్ ఐమాక్స్ ఎదురుగా ఉన్న గ్రౌండ్ ప్లస్ టు భవనంలో ఖైరతాబాద్ శాంతి భద్రతల పోలీస్‌స్టేషన్, సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు పని చేస్తున్నాయి. దీంతో పాటు సైఫాబాద్ డివిజన్ శాంతిభద్రతల ఏసీపీ కార్యాలయంతో పాటు సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీకార్యాలయాలు సైతం ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పనిచేస్తుండగా మొదటి అంతస్తులో ఇద్దరు ఏసీపీల చాంబర్లు, కార్యాలయాలు ఉన్నాయి. ఇక రెండవ అంతస్తులో సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ల కార్యాలయాలు, ఉండగా ట్రాఫిక్ ఎస్‌ల విశ్రాంతి గదులు ఉన్నాయి. గతంలో స్టోర్ రూంగా ఉన్న ప్రాంతాన్ని ప్రస్తుతం సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌గా వినియోగిస్తుండడం విశేషం

పాస్‌పోర్టు కార్యాలయాన్ని పోలీస్ స్టేషన్లుగా..

ఐమాక్స్ ఎదురుగా ఉన్న హెచ్‌ఎండీఏ స్థలంలో ప్రభుత్వం జీ ప్లస్ 2 అంతస్తుల్లో ఓ భవనాన్ని నిర్మించింది. పాస్‌పోర్టు వెరిఫికేషన్ కార్యాలయం కోసం దీనిని నిర్మించారు. నిర్మాణం పూర్తయిన కొన్ని సంవత్సరాల వరకు ఇందులో పాస్‌పోర్టు వెరిఫికేషన్ కార్యాలయం నడిచింది. అనంతరం పై అంతస్తులో స్థలం ఖాళీగా ఉండడంతో సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు దాని పరిధిలో భవనం లేకపోవడంతో పోలీసు ఉన్నతాధికారుల జోక్యంతో సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీల కార్యాలయాలు ఇందులోకి వచ్చాయి. కొన్ని రోజుల అనంతరం ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ కొత్తగా ఏర్పాటు కావడం, సైఫాబాద్ పరిధి నుండి ఇందులో చేరిన చాలా ప్రాంతాలకు సమీపంలో ఉంటుందని ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించేందుకు పాస్‌పోర్టు కార్యాలయాన్ని తొలగించి ఒక అంతస్తు మొత్తం వినియోగించుకునే ఏర్పాట్లు చేసి కొత్త పీఎస్‌ను ప్రారంభించారు. ఆ తరువాత సైఫాబాద్ డివిజన్ శాంతి భద్రతల విభాగం ఏసీపీ కార్యాలయాన్ని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ నుండి ఈ భవనానికి మార్చారు. దీంతో ఒకే భవనంలో రెండు పోలీస్‌స్టేషన్లు, రెండు ఏసీపీల కార్యాలయాలు నడుస్తుండడంతో ఎస్‌లు, సిబ్బందికి సరిపడా విశ్రాంతి గదులు లేకుండా పోయాయి. ఈ మధ్యే మహిళా పోలీసు సిబ్బందికి విశ్రాంతి గదిని నిర్మించారు. భవనం సెల్లార్‌లో శాంతి భద్రతల పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇనిస్పెక్టర్ కార్యాలయంతో పాటు ఎస్‌ల రెస్ట్ రూం ఉంది. దీంతో పాటు ఉన్న ఒకే గదిలో దాదాపు 200 మందికి పైగా ఉన్న శాంతి భద్రతలు, ట్రాఫిక్ విభాగాల పోలీసు సిబ్బంది సర్దుకొని కాలం వెల్లదీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ గతంలో స్టోర్ రూంగా వినియోగించిన ప్రాంతంలో నడుస్తోంది. స్థలం సరిపోక ఈ గది ముందు భాగంలో వేసిన రేకుల షెడ్డులో పోలీస్‌స్టేషన్ రిసెప్షన్ నడుస్తోంది.



ఖైరతాబాద్ శాంతి భద్రతలు, సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల భవనం

త్వరలో ట్రాఫిక్ పీఎస్ పరిధి విస్తరణ

ప్రస్తుతం ఉన్న సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిని మరింత పెంచే ఆలోచనలో అధికారులు ఉన్నారు. నారాయణగూడ, నాంపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధుల్లోని కొన్ని ప్రాంతాలను సైఫాబాద్‌లో కలిపేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీంతో మరింత మంది సిబ్బందిని సైఫాబాద్ ట్రాఫిక్ కోసం నియమించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ పోలీస్‌స్టేషన్‌కు ఒక ఇనిస్పెక్టర్ ఉండగా ఇటీవలే నారాయణగూడ పీఎస్‌లో ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన మరో అధికారిని అదనపు ఇనిస్పెక్టర్‌గా నియమించారు. ఇప్పుడున్న ఇరుకైన భవనంలోనే రెండవ అంతస్తులో అదనపు ఇనిస్పెక్టర్ కోసం చాంబర్ నిర్మిస్తున్నారు. ఇక మరింత మంది ఎస్ఐలు, సిబ్బంది ఇక్కడకు వస్తే పరిస్థితి ఏంటని అధికారులు, సిబ్బంది హైరానా చెందుతున్నారు.



కమాండ్ కంట్రోల్ రూం వద్ద స్వాగతం పలుకుతున్న పోలీస్ శునకం



సుందరీమణుల సందడి



సచివాలయంలో సుందరాంగులు





సచివాలయంలో మిస్ వరల్డ్ పోటీదారులు

నగరంలో ఆదివారం ప్రపంచ సుందరీమణులు సందడి చేశారు. సచివాలయం, కమాండ్ కంట్రోల్ సెంటర్ కార్యాలయంలో ఇలా ఫొటోలకు ఫోజులు ఇచ్చారు.

- ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు

ఉల్లంఘనులు

మూడు నెలల్లో 1.44 లక్షల కేసులు

● రాంగ్‌రూట్‌లో వాహనదారుల డ్రైవింగ్ ●పోలీసులు స్పెషల్ డ్రైవ్



హైదరాబాద్ సిటీ మే 18 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గార్డెన్స్ పరిధిలో రాంగ్‌రూట్‌లో రయ్ మంటూ దూసుకొచ్చిన వాహనదారుడిని ఢీ కొట్టి వెళ్లిపోయాడు. అతను తేరుకునేలోపు, పాదచారుడు పట్టుకుందామని ప్రయత్నించేలోపే ఉడాయించాడు. రెండు రోజుల క్రితం జరిగిన ఘటన ఇదీ..

● లక్డీకాపూల్ ప్రాంతంలో యూటర్న్ దూరంగా ఉందని భావించిన వాహనదారుడు రాంగ్ రూట్లో ఓ కాలేజీ బస్సుకు ఎదురొచ్చాడు. వేగంగా వెళ్తున్న బస్సు డ్రైవర్ ఒక్కసారిగా పక్కకు తిప్పాడు. దీంతో ప్రమాదం తప్పింది. ఒక ప్రాంతంలో వాహనదారుడు రాంగ్‌రూట్లో వెళ్తూ బస్సు డ్రైవర్‌ను తిడుతూ.. రూబాబుగా మాట్లాడుతూ వెళ్లాడు.

ఇలాంటి ఘటనలు అన్ని ట్రై కమిషనరేట్ పరిధిలోని అన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో నిత్యకృత్యం. తొందరగా వెళ్లాలని కొందరు.. యూటర్న్ దూరం ఉందని ఇంకొందరు.. పెట్రోల్ ఆదా చేయాలని మరి కొందరు. ఇలా వివిధ రకాల కారణాలతో కొంతమంది వాహనదారులు రాంగ్‌రూట్లో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ ప్రమాదాల్లో వారి ప్రాణాలు పోగొట్టుకోవడం లేదా ఇతరుల ప్రాణాలు తీయడం చేస్తున్నారు. 2023లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో సిటీ పరిధిలో 8 మంది రాంగ్ రూట్ డ్రైవింగ్ వల్ల ప్రాణాలు కోల్పోగా.. 150 క్షతగాత్రులయ్యారు. 2024లో ఇప్పటి వరకు ఒకరు మృతిచెందగా 128 మంది క్షతగాత్రులు గాయాలపాలయ్యారు.

ఉక్కుపాదం..

ట్రాఫిక్ ఉల్లంఘనలను నియంత్రించాలని నిర్ణయించిన సిటీ ట్రాఫిక్ పోలీసులు.. రాంగ్ రూట్ డ్రైవింగ్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రంగంలోకి దిగిన స్పెషల్ టీమ్‌లు సిటీ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రాంగ్‌రూట్‌లపై ఉక్కుపాదం మోపారు. దాంతో ఈ ఏడాది 3 నెలల్లో 1,44,778 రాంగ్ రూట్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసినట్లు జాయింట్ సీపీ జోయల్ డేవిస్ పేర్కొన్నారు. అడ్డదారిలో పట్టుబడ్డ వారికి చలానాలు విధించడంతో పాటు అవగాహన కల్పించినట్లు వెల్లడించారు.

అడ్డదారిలో అడ్డంగా..

నగరంలో ట్రాఫిక్ నరకం నుంచి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఎన్ని కేసులు నమోదు చేసినా, ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా వాహనదారుల్లో మార్పు రావడంలేదు. పోకిరీలు, ఆకతాయిలతో పాటు.. ఎంతోమంది ఉన్నత విద్యావంతులు.. ట్రాఫిక్ రూల్స్ పట్ల అవగాహన ఉన్న వారు సైతం ఇష్టానుసారంగా అడ్డదారిలో అడ్డదిడ్డంగా వాహనాలు నడుపుతున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్న సిబ్బంది ఉల్లంఘనులపై చలానాలు విధిస్తున్నారే తప్ప ఎక్కడికక్కడ వాహనదారులను నిలువరించలేకపోతున్నారు.



వేడుకలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, పలువురు మంత్రులు

నిశ్చితార్థ వేడుక.. సీఎం హాజరు

నార్సింగి ఏసీపీ రమణగౌడ్, జగదీశ్వరిల ఏకైక కుమారుడు పవన్‌రాజ్‌కు, ఆంధ్ర రాష్ట్రం ఏలూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చిరంజీవి, శ్రీదేవిల ఏకైక కుమార్తె సాయిశృతితో నిశ్చితార్థం జరిగింది. ఆదివారం సాయంత్రం రంగారెడ్డిజిల్లా శంకర్‌పల్లి మండలం మీర్జాగూడ పరిధిలో గల నియో కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న ఈ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

- శంకర్‌పల్లి, మే 18(ఆంధ్రజ్యోతి)

వ్యక్తి దారుణ హత్య

సిమెంట్ ఇటుకతో మోది.. కర్రతో కొట్టి చంపినట్లు ఆనవాళ్లు



ఘటనా స్థలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

అడ్డగుట్ట, రాంగోపాల్‌పేట్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన సికింద్రాబాద్ మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సికింద్రాబాద్ మంజు టాకీస్ ఎదురుగా జేకే ఫర్నిచర్ దుకాణం వద్ద గుర్తుతెలియని 55 ఏళ్ల వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఆదివారం ఉదయం స్థానికంగా ఉన్న వ్యక్తి 100 పోలీస్ కంట్రోల్‌రూంకు సమాచారం ఇచ్చాడు. హుటాహుటిన మహంకాళి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూజ్ టీం కూడా రంగంలోకి దిగాయి. సిమెంట్ ఇటుకతో అతనిని తలపై మోదీ హత్య చేసిన అనంతరం వెదురు కర్రతో కొట్టి చంపినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయని పోలీసులు తెలిపారు. ఎన్ని గంటలకు హత్య జరిగి ఉండొచ్చని, హత్య చేసింది ఎవరు? అనే కోణాల్లో డీఐ ప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. హత్యకు గురైన వ్యక్తి యాచకుడు, హత్య చేసిన వ్యక్తి కూడా యాచకుడేనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు.



స్వాధీనం చేసుకున్న విదేశీ మద్యంతోపాటు నిందితులను చూపుతున్న పోలీసులు

విదేశీ మద్యం పట్టివేత.. ఇద్దరు నిందితుల అరెస్టు

హైదరాబాద్ సిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): విదేశీ మద్యంను ఆదివారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి మద్యం బాటిళ్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. బిర్లామందిర్ వెనుక వైపు ఉన్న ఆదర్శనగర్‌లో మద్యం బాటిళ్లను కారులో తరలిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. ఎస్టీఎఫ్ఏ అంజిరెడ్డి బృందం సభ్యులు రంగంలోకి దిగి వాహనాన్ని ఆపి తనిఖీలు చేశారు. 52 విదేశీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎ.శ్రీకుమార్ అగ్రవాల్, రోహిత్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. నిందితులకు మద్యాన్ని సరఫరా చేసిన సురేనియా చంద్ర దీపు పరారీలో ఉన్నట్లు ఎస్టీఎఫ్ఏ టీమ్ లీడర్ వెల్లడించారు. పట్టుబడిన మద్యం విలువ రూ.3.60 లక్షలు ఉంటుందని చెప్పారు. నాంపల్లి ఎక్సైజ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్టీఎఫ్ఏ టీంను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అభినందించారు.

ఉల్లాసంగా ఉత్సాహంగా

● కంటి క్యాన్సర్ పై అవగాహనకే 'వైట్‌థాన్ రన్'



జెండా ఊపి 10కే రన్‌ను ప్రారంభిస్తున్న నాగిరెడ్డి, ప్రశాంత్‌గార్గ్

రాయదుర్గం, మే 18 (ఆంధ్రజ్యోతి) : టీ-వర్క్స్ వద్ద నిర్వహించిన వైట్‌థాన్ 10కె రన్‌ను రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ వై నాగిరెడ్డి ప్రారంభించారు. పిల్లలకు వచ్చే కంటి క్యాన్సర్‌పై అవగాహన, చికిత్స కోసం విరాళాల నిమిత్తం ఎల్వీప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ వైట్‌థాన్ ద్వారా తెలుసుకున్న సమాచారాన్ని మన పరిధిలో ఉన్న వారితో పంచుకోవాలని నాగిరెడ్డి అన్నారు. తద్వారా చిన్న పిల్లల్లో వచ్చే ఈ క్యాన్సర్లు ముందుగా గుర్తించేందుకు వీలుందన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్‌గార్గ్ మాట్లాడుతూ ప్రతీచిన్నారి కంటిని, ప్రాణాన్ని రెటినోబ్లాస్టోమా నుంచి కాపాడాలన్నారు. 'వైటథాన్' నిధులతో ఇప్పటి వరకు మూడు వేలకు పైగా ఉచితంగా చికిత్సలు చేశామన్నారు. యేటా కంటి క్యాన్సర్స్ కొత్త కేసులు 150 నుంచి 200వరకు వస్తుంటాయని తెలిపారు. చికిత్స పొందిన కేసుల్లో 90 శాతం మంది పిల్లల ప్రాణాలు రక్షించామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సీతారాములు

నేతన్నలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

● మాజీ ఎమ్మెల్సీ సీతారాములు

మన్సూరాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు పొద్దంతా పనిచేసినా పూటగడవని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతుంటే వారిని ఆదుకోవాల్సి పోయి కోట్లు ఖర్చుపెట్టి అందాల పోటీలు నిర్వహించడమేమిటని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ చేరుపల్లి సీతారాములు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ సహారా స్టేట్స్ సీనియర్ సిటిజన్స్ భవన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ అధ్యక్షతన ఆదివారం సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. చేనేత రుణాలు మాఫీ చేస్తామని, నూలుపై సబ్సిడీ ఇస్తామని ప్రకటించి ఏడాది గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటికీ అందించలేదని, వెంటనే రుణమాఫీ చేసి సబ్సిడీని నేతన్నల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు.

కామ్రేడ్ రఘుపాల్ కన్నుమూత

బీబీనగర్ ఎయిమ్స్‌కు పార్థివ దేహం అప్పగింత



రఘుపాల్ (ఫైల్)

బీబీనగర్, రాజాపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం బొందుగులకు చెందిన సీపీఎం సీనియర్ నేత, అఖిల భారత శాంతి సంఘీభావ సమితి జాతీయ నాయకుడు గంగసాని రఘుపాల్ (83) ఆదివారం మృతిచెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. రఘుపాల్ మృతికి గ్రామ, మండల అఖిల పక్ష నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. రఘుపాల్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. 1942 మే 22న జన్మించిన రఘుపాల్ బీఎస్సీ, ఎల్ఎల్‌బీ చదివారు. 1964 నుంచి సీపీఎంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 15 సంవత్సరాలు హైదరాబాద్ నగర కార్యదర్శిగా వ్యవహరించారు. ప్రస్తుతం సీపీఎం అఖిల భారత శాంతి సంఘీభావ సమితి జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా ఉన్నారు. కాగా, తన పార్థీవ దేహాన్ని ఏదైనా మెడికల్ కళాశాలకు పరిశోధనల నిమిత్తం అప్పగించాలనే రఘుపాల్ కోరిక మేరకు కుటుంబ సభ్యులు ఆయన పార్థీవ దేహాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని ఎయిమ్స్ మెడికల్ కళాశాలకు అప్పగించారు. సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు సమక్షంలో ఎయిమ్స్ ఆదివారం అప్పగించారు. కాగా, చిన్నప్పటి నుంచే కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితుడైన నేత రఘుపాల్ అని, ఆయన జీవితం ఆదర్శనీయమని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. ఆదివారం రఘు మృతదేహానికి స్థానిక సీపీఎం నేతలతో కలిసి ఆయన నివాళులర్పించారు. నిత్యం పార్టీ కోసం ప్రజాసమస్యలపైనే పోరాటం చేసేవారని చెప్పారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్, కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, కనకారెడ్డి, రాములు, చంద్రారెడ్డి, కల్లూరి మల్లేశ్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

లాడ్జిలో బజాజ్ ఎలక్ట్రానిక్ గోడౌన్ మేనేజర్ ఆత్మహత్య



మేఘూన్ (ఫైల్)

అడ్డగుట్ట, మే 18 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు లాడ్జిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. షాద్‌నగర్‌కు చెందిన కృష్ణాగౌడ్ కుమారుడు మేఘూన్ గౌడ్ (22) షాద్‌నగర్‌లోని బజాజ్ ఎలక్ట్రానిక్ గోడౌన్‌లో మేనేజర్. గత నెల ఆడిట్‌లో 10 ఏసీలు తక్కువ రావడంతో షోరూం నిర్వాహకులు అతడిపై అనుమానంతో షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ విషయం తెలుసుకొని ఇంటికి రాకుండా బయటే తిరుగుతున్నాడు. ఈనెల 10 నుంచి సికింద్రాబాద్‌లోని ఈశ్వర్ లాడ్జిలో బస చేస్తున్నాడు. ఆదివారం తాను ఉంటున్న గది నుంచి దుర్వాసన రావడంతో నిర్వాహకులు గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు మృతదేహాన్ని పరిశీలించారు. ఆ మేరకు పోస్టుమార్టం కోసం గాంధీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అక్రమార్కుల బరితెగింపు

● మరోసారి కేసు నమోదు

బంజారాహిల్స్, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో అనుచరగణంతో ప్రవేశించి సీసీ కెమెరాలు బిగించిన తండ్రీకొడుకులపై మరోసారి కేసు నమోదైంది. ఇదివరకే ఈ విషయమై వీరిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. తాజాగా ఇదే ప్రాంతమైన బంజారాహిల్స్ రోడ్డు నంబరు 10 సర్వే నంబరు 403/1లో ప్రభుత్వానికి చెందిన 300 కోట్ల రూపాయలు విలువ చేసే సుమారు మూడెకరాల స్థలం ఉంది. పార్థసారథి అతడి కుమారుడు విజయ్‌భార్గవ్ స్థలం తమదేనంటూ పలు మార్లు అక్రమంగా ప్రవేశించారు. అప్పటి రెవెన్యూ అధికారులు ఫిర్యాదు మేరకు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. తాజాగా ఈ ఇద్దరూ స్థలం వద్ద ఉన్న ప్రభుత్వ సూచిక బోర్డు తొలగించారు. బయట సీసీ కెమెరా ఏర్పాటు చేసి ప్రైవేటు సైన్యంతో స్థలంలోకి అక్రమంగా ప్రవేశించారు. అధికారుల విచారణలో వాస్తవమేనని తేల్చారు. దీంతో సీసీకెమెరాను తొలగించి, మళ్లీ బోర్డు ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్ పోలీసులకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటో జర్నలిస్టు శివకుమార్ హఠాన్మరణం

సీఎం రేవంత్ సంతాపం



శివకుమార్

హైదరాబాద్ సిటీ, మే18 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఫొటో జర్నలిస్టు పీవీ శివకుమార్ (66) ఆదివారం గుండెపోటుతో మరణించారు. బంజారాహిల్స్‌లోని ఫొటోగ్రాఫర్స్ కాలనీలోని తన ఇంట్లో అస్వస్థతకు గురవ్వగా వెంటనే జూబ్లీహిల్స్‌లోని అపోలోకు తరలించారు. చికిత్సపొందుతూ ఆయన మధ్యాహ్నం 3 గంటలకు మరణించిన్నట్లు వైద్యులు ప్రకటించారు. ఆయనకు భార్య బి.సత్యవాణి, కొడుకు ఉన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, దిహిందూ పత్రికల్లో పని చేసిన ఆయన 2015లో స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. సోమవారం ఉదయం 11 గంటలకు మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా, శివకుమార్ మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. వి.వి.ఎస్. లక్ష్మణ్, శివలాల్ యాదవ్‌లు కూడా సంతాపం తెలిపారు.

సత్ఫలితాల.. సమ్మర్ యాక్షన్ ప్లాన్

● ట్యాంకర్ బుకింగ్ చేస్తే 24 గంటల్లోపే సరఫరా

● అవసరమైతే 24/7 సేవలు

● గతేడాదితో పోలిస్తే 30 శాతం పెరిగిన డిమాండ్

● వందలోపు పెండింగ్ ఉండేటట్లు వాటర్‌బోర్డు ప్రణాళిక



హైదరాబాద్ సిటీ, మే18 (ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో నగరంలో నెలకొన్న ట్యాంకర్ల డిమాండ్‌ను అధిగమించేందుకు వాటర్‌బోర్డు రూపొందించిన ప్రణాళికలు పక్కగా అమలవుతున్నాయి. ట్యాంకర్ బుకింగ్ చేస్తే 24 గంటల్లోనే డెలివరీ చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా సరఫరా అవుతున్నాయి. అవసరమైన ప్రాంతాల్లోనే 24/7.. అవసరం లేని ప్రాంతాల్లో కేవలం 12 గంటలే సరఫరా చేస్తున్నారు.. గతేడాదితో పోల్చితే 30 శాతం డిమాండ్ పెరిగింది. అయినా 24 గంటల లోపే సరఫరా జరుగుతోంది. ప్రస్తుతం రోజుకు పది వేలకు పైగా ట్యాంకర్ల బుకింగ్‌లు వచ్చినా ఇదే సమయం తీసుకుంటున్నారు.

గతేడాదితో పోల్చితే జనవరిలోనే మూడింతలు ట్యాంకర్ల డిమాండ్ పెరిగిన నేపథ్యంలో వాటర్‌బోర్డు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అన్నీ డివిజన్ల వారీగా సమీక్షలు చేస్తూ డిమాండ్‌ను అధిగమించేందుకు చేసిన కసరత్తు కలిసొచ్చింది. రూపొందించుకున్న సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను మార్చి 15వ తేదీ నుంచి జూన్ 15 వరకు అమలు చేస్తుండగా.. ఈ రెండు నెలల పాటు ఆశించిన స్థాయిలోనే ప్రయోజనాలు చేకూరాయి. గచ్చిబౌలి, హైటెక్ సిటీ, కొండాపూర్, మాదాపూర్, జూబ్లీహిల్స్, హఫీజ్‌పేట, మియాపూర్, ఎస్ఆర్‌నగర్, యూసఫ్‌గూడ, బంజారాహిల్స్, నిజాంపేట, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ఇలా గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో ట్యాంకర్ల డిమాండ్ పెరుగుతోంది. గతేడాదితో పోల్చితే 30 శాతానికి పైగా డిమాండ్ పెరిగింది.

1,116 ట్యాంకర్లు.. 10 వేలకు పైగా ట్రిప్పులు

ప్రస్తుతం నగరంలో ఒక్కో రోజు 10 వేలకు పైగా ట్యాంకర్లు బుకింగ్ అవుతున్నాయి. బుకింగ్ అనుగుణంగానే వాటర్‌బోర్డు 1116 ట్యాంకర్లు ఏర్పాటు చేసింది. ఏ రోజుకు ఆరోజు వివిధ ఫిల్లింగ్ స్టేషన్ల వారీగా ఏ మేరకు ట్యాంకర్లు పెండింగ్ సమాచారం తెలుసుకోవడం అదనంగా ట్యాంకర్లను ఏర్పాటు చేయడం, ఫిల్లింగ్ పాయింట్లు తక్కువగా ఉంటే మరిన్నీ ఫిల్లింగ్ పాయింట్లను పెంచడం చేస్తున్నారు. దీంతో రోజూవారిగా పెండింగ్ ట్యాంకర్లు 100 కూడా దాటడం లేదు. మార్చి నెల వరకు గ్రేటర్‌లో కేవలం 1080 ట్యాంకర్లు ఉండగా.. వాటిని 1116కు పెంచారు. ఫిల్లింగ్ స్టేషన్లు 73 నుంచి 84కు, ఫిల్లింగ్ పాయింట్లు 104 ఉండగా.. 134కు పెంచారు.

● ఇటీవల మౌలాలి ప్రాంతంలో ఫిల్లింగ్ స్టేషన్ వైపు వెళ్లే మార్గంలో జీహెచ్ఎంసీ అధికారులు రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. రోజుకు ఆ ప్రాంతంలో ఫిల్లింగ్ స్టేషన్ నుంచి 200లకు పైగా ట్యాంకర్ల సరఫరా అయ్యేవి. ప్రస్తుతం రోడ్డు నిర్మాణం వన్‌వేగా మారిన నేపథ్యంలో పెండింగ్ ట్యాంకర్లు పెరగడంతో 24/7 సరఫరా చేసేందుకు వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి ఆదేశాలిచ్చిన్నట్లు తెలిసింది.

తెలంగాణ సినిమాకు ప్రత్యేక పాలసీ

● వంద కోట్లతో ప్రత్యేక నిధి

● సమావేశంలో వక్తల డిమాండ్




మాట్లాడుతున్న చల్లా శ్రీనివాస్

హైదరాబాద్ సిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సినిమాను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రత్యేక పాలసీని ప్రకటించాలని వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ సంస్కృతి, చరిత్ర, అస్తిత్వాన్ని ప్రతిబింబించే సినిమాలకు పన్ను రాయితీ కల్పించాలని కోరారు. తెలంగాణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్ హాల్లో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్ అధ్యక్షతన 'తెలంగాణ సినిమా రంగం అభివృద్ధి, అవరోధాలు' అంశంపై చర్చా గోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా సినీ విమర్శకుడు హెచ్ రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం వంద కోట్ల రూపాయలతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి, తద్వారా తెలంగాణ సినిమాల నిర్మాణానికి ఆర్థిక తోడ్పాటు అందించాలని సూచించారు. ఆంధ్రజ్యోతి ఆదివారం ఎడిటర్, సినీ విమర్శకుడు చల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ పూణె ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ తరహాలో ఇక్కడా ఓ విద్యా సంస్థను నెలకొల్పాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. సినిమా పాలసీ విధి విధానాలను సూచిస్తూ ఒక డ్రాఫ్టును ప్రత్యేకంగా రూపొందించి ఇచ్చినట్లు చెప్పారు. దాన్ని ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. దర్శకుడు అక్షర కుమార్ మాట్లాడుతూ రాయితీలు, అనుమతుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని ఆకాంక్షించారు. పాశం యాదగిరి, మోహన్ బైరాగి, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, దాసోజు లలిత, సయ్యద్ రఫీ, ఖాజా మన్సూర్, ప్రసేన్, సారంగి అవార్డుల నిర్వాహకుడు ఖాజా ఆఫ్రీది తదితరులంతా కలిసి తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఏర్పాటుతో పాటు ఏటా ఉత్తమ తెలంగాణ సినిమాకు కోటి రూపాయల నగదు పురస్కారం ప్రకటించాలని, ఇంకా పలు అంశాలను అంశాలను తీర్మానించారు. తెలంగాణ సినిమా పరిరక్షణ కమిటీని రవీందర్ ప్రకటించారు.

పదేళ్ల తర్వాత..

ప్లే ఆఫ్స్‌కు పంజాబ్


హర్‌ప్రీత్ బ్రార్ (3/22)

10 పరుగులతో ఓడిన రాజస్థాన్

తిప్పేసిన హర్‌ప్రీత్ ● వధేరా, శశాంక్ మెరుపులు

జైపూర్: లెఫ్టామ్ స్పిన్నర్ హర్‌ప్రీత్ బ్రార్ (3/22) కీలక వికెట్లతో మ్యాచ్‌ను మలుపు తిప్పడంతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 10 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించింది. నేహల్ వధేరా (37 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో 70), శశాంక్ సింగ్ (30 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 59 నాటౌట్) ధనాధన్ అర్ధ శతకాలతో చెలరేగారు. మరో మ్యాచ్‌లో గుజరాత్ జట్టు ఢిల్లీని ఓడించడంతో పంజాబ్.. పదేళ్ల సుదీర్ఘ విరామానంతరం ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. చివరిసారిగా 2014లో పేఆఫ్స్ చేరిన పంజాబ్.. ఆ సీజన్‌లో రన్నరప్‌గా నిలిచింది.


ప్రీతీ జింటా

తొలుత పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 219 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ (30) రాణించాడు. తుషార్ దేశ్‌పాండే రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో రాజస్థాన్ ఓవర్లన్నీ ఆడి 209/7 స్కోరు మాత్రమే చేసింది. ధ్రువ్ జురెల్ (53), యశస్వి జైస్వాల్ (50) హాఫ్ సెంచరీలు వృథా అయ్యాయి. జెన్సన్, ఒమర్జాయ్ చెరో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. హర్‌ప్రీత్ బ్రార్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

ఆరంభం అదిరినా..: రాయల్స్ ఓపెనర్లు జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ (40) తొలి వికెట్‌కు 29 బంతుల్లోనే 79 పరుగులతో ఛేదనను ధాటిగా ఆరంభించారు. అయితే, ఐదో ఓవర్‌లో హర్‌ప్రీత్ బౌలింగ్‌కు దిగడంతో సీన్ మారింది. వైభవ్‌ను అవుట్ చేసిన హర్‌ప్రీత్ బ్రేక్‌ను అందించాడు. ఆ తర్వాత 9వ ఓవర్‌లో జైస్వాల్‌ను పెవిలియన్ చేర్చిన బ్రార్.. రాజస్థాన్ జోరుకు కళ్లెం వేశాడు. శాంసన్ (20)ను ఒమర్జాయ్ అవుట్ చేయగా.. పరాగ్ (13)ను కూడా హర్‌ప్రీత్ బౌల్డ్ చేయడంతో 14 ఓవర్లకు రాజస్థాన్ 146/4తో నిలిచింది. డెత్ ఓవర్లలో జురెల్ ధాటిగా ఆడుతూ ఆశలు రేపాడు. కానీ, ఆఖరి ఓవర్‌లో విజయానికి 22 రన్స్ కావల్సి ఉండగా.. జురెల్, హసరంగ (0)ను అవుట్ చేసిన జెన్సన్ జట్టును గెలిపించాడు.

తడబడి నిలబడి..: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న పంజాబ్ పవర్‌ప్లేలోనే 34/3తో కష్టాల్లో పడినా.. వధేరా, శశాంక్ సింగ్ అర్ధ శతకాలతో ఆదుకోవడంతో భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు ఆర్య (9), ప్రభ్‌సిమ్రన్ (21)ను దేశ్‌పాండే వెనక్కి పంపగా.. ఓవెన్ (0)ను మఫాక డకౌట్ చేశాడు. ఈ దశలో వధేరాకు జతకలసిన కెప్టెన్ అయ్యర్ నాలుగో వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశాడు. అయితే, అయ్యర్‌ను పరాగ్ క్యాచవుట్ చేయడంతో క్రీజులోకి వచ్చిన శశాంక్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. కానీ, అర్ధ శతకం పూర్తి చేసుకొన్న వధేరాను ఆకాశ్ అవుట్ చేయడంతో.. ఐదో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక, డెత్ ఓవర్లలో శశాంక్, అజ్మతుల్లా ఒమర్జాయ్ (21 నాటౌట్) 24 బంతుల్లో 60 పరుగులు జోడించడంతో.. పంజాబ్ స్కోరు 220 మార్క్‌కు చేరువైంది.


నేహల్ వధేరా (70)

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) హెట్‌మయర్ (బి) దేశ్‌పాండే 9, ప్రభ్‌సిమ్రన్ (సి) శాంసన్ (బి) దేశ్‌పాండే 21, ఓవెన్ (సి) శాంసన్ (బి) మఫాక 0, వధేరా (సి)హెట్‌మయర్ (బి) మధ్వాల్ 70, శ్రేయాస్ (సి) జైస్వాల్ (బి) పరాగ్ 30, శశాంక్ (నాటౌట్) 59, అజ్మతుల్లా ఒమర్జాయ్ (నాటౌట్) 21; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 219/5; వికెట్ల పతనం:** 1-19, 2-34, 3-34, 4-101, 5-159; **బౌలింగ్:** ఫజల్ ఫరూకీ 3-0-39-0, దేశ్‌పాండే 4-0-37-2, మఫాక 3-0-32-1, పరాగ్ 3-0-26-1, హసరంగ 3-0-33-0, మధ్వాల్ 4-0-48-1.

రాజస్థాన్: జైస్వాల్ (సి) ఓవెన్ (బి) బ్రార్ 50, వైభవ్ (సి) బ్రాట్‌లెట్ (బి) బ్రార్ 40, శాంసన్ (సి) జెన్సన్ (బి) ఒమర్జాయ్ 20, పరాగ్ (బి) బ్రార్ 13, జురెల్ (సి) ఓవెన్ (బి) జెన్సన్ 53, హెట్‌మయర్ (సి) బ్రాట్‌లెట్ (బి) ఒమర్జాయ్ 11, దూబె (నాటౌట్) 7, హసరంగ (సి) ప్రభ్‌సిమ్రన్ (బి) జెన్సన్ 0, మఫాక (నాటౌట్) 8; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 209/7; వికెట్ల పతనం:** 1-76, 2-109, 3-114, 4-144, 5-181, 6-200, 7-200; బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-60-0, జెన్సన్ 3-0-41-2, బ్రాట్‌లెట్ 1-0-12-0, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-22-3, చాహల్ 4-0-30-0, ఒమర్జాయ్ 4-0-44-2.

రన్నరప్ యుకీ జోడీ

న్యూఢిల్లీ: భారత స్టార్ యుకీ భాంబ్రీ.. ఫ్రాన్స్‌లో జరిగిన బొర్డాక్స్ ఏటీపీ చాలెంజర్ ఈవెంట్‌లో డబుల్స్ రన్నరప్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో యుకీ/రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ 6-7(1), 6-7(2)తో ఫ్రాన్సిస్కో (పోర్చుగల్)/లుకాస్ (ఆస్ట్రియా) జంట చేతిలో ఓడింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	12	9	3	0	18	0.795
బెంగళూరు	12	8	3	1	17	0.482
పంజాబ్	12	8	3	1	17	0.389
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	12	6	5	1	13	0.260
కోల్‌కతా	13	5	6	2	12	0.193
లఖ్‌నవూ	11	5	6	0	10	-0.469
హైదరాబాద్	11	3	7	1	7	-1.192
రాజస్థాన్	13	3	10	0	6	-0.701
చెన్నై	12	3	9	0	6	-0.992

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

నేటి మ్యాచ్

వేదిక లఖ్‌నవూ
హైదరాబాద్ x లఖ్‌నవూ రా. 7.30 నుంచి

హెడ్‌కు కొవిడ్

న్యూఢిల్లీ: సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ కొవిడ్ బారిన పడ్డాడు. దీంతో అతను సోమవారం లఖ్‌నవూ జట్టుతో జరిగే మ్యాచ్‌కు అందుబాటులో ఉండడం లేదని సన్‌రైజర్స్ చీఫ్ కోచ్ వెటోరీ ఆదివారం ప్రకటించాడు. అయితే.. హెడ్‌కు ఎప్పుడు, ఎక్కడ వైరస్ సోకిందన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. పూర్తిగా కోలుకున్న తర్వాత హెడ్ జట్టుతో కలుస్తాడని తెలిపాడు.

క్రికెటర్లకు పెయిడ్ ఫ్యాన్స్ ఉన్నారు !



న్యూఢిల్లీ: కొందరు క్రికెటర్లకు పెయిడ్ ఫ్యాన్స్ ఉన్నారని భారత జట్టు మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. అయితే ఆ క్రికెటర్లు ఎవరో అతడు వెల్లడించలేదు. ఓ క్రీడా చానెల్ చర్చలో హర్భజన్ మాట్లాడుతూ 'ఆడినంత కాలం ధోనీ ఐపీఎల్‌లో కొనసాగాలి. మహీ ఇంకా ఐపీఎల్ ఆడాలని అతడి ఫ్యాన్స్ బలంగా కోరుకుంటున్నారు. వారంతా ధోనీకి నిజమైన అభిమానులు. అయితే సోషల్ మీడియాలో కొందరు ఫ్యాన్స్ ఉంటారు. వారు మాత్రం డబ్బులు తీసుకొనే అభిమానులు. వారిని వదిలేయండి. వారిపై చర్చ సాగిస్తే దానికి అంతూ..దరీ ఉండదు' అని వ్యాఖ్యానించాడు. అదే చర్చలో పాల్గొన్న మరో భారత ఆటగాడు ఆకాశ్ చోప్రా కల్పించుకొని 'భజ్జీ భాయ్..మరీ అలా నిజాలు చెప్పకు' అని నవ్వుతూ అన్నాడు.

తిరుమలేశుడి సేవలో గంభీర్

తిరుమల (ఆంధ్రజ్యోతి): భారత క్రికెట్ చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నాడు. వేకువజామున ఆలయంలో జరిగిన సుప్రభాతసేవలో కుటుంబ సమేతంగా పాల్గొన్నాడు. సుప్రభాత పఠనం అనంతరం గర్భాలయానికి చేరుకుని మూలవిరాట్టును దర్శించుకున్నారు.



ఒక్కరు గెలిస్తే..ముగ్గురు ముందుకెళ్లారు

ఐపీఎల్‌లో ఆదివారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఒకే విజయంతో ఏకంగా మూడు జట్లు ప్లే ఆఫ్ స్థానాలను ఖరారు చేసుకున్నాయి. డబుల్ హెడర్‌లో భాగంగా రాత్రి జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జట్టు ఢిల్లీని ఓడించి 18 పాయింట్లతో టాప్ లేపింది. అయితే అప్పటిదాకా ప్లేఆఫ్స్ బెర్తులు ఖరారు కాని బెంగళూరు, పంజాబ్ జట్లనూ గుజరాత్ తమతోపాటు ముందుకు తీసుకెళ్లింది. ఇప్పుడిక మిగిలిన ఏకైక బెర్తు కోసం ఢిల్లీ (13), ముంబై (14), లఖ్‌నవూ (10) జట్లు పోటీ పడనున్నాయి.

ప్లేఆఫ్స్‌కు గుజరాత్

బెంగళూరు, పంజాబ్ కూడా..

- సుదర్శన్ అజేయ శతకం • రాణించిన గిల్
- పది వికెట్లతో ఢిల్లీ చిత్తు

రాహుల్ శతకం వృథా


సాయి సుదర్శన్ (108 నాటౌట్)
గిల్ (93 నాటౌట్)

న్యూఢిల్లీ: ఐపీఎల్ తాజా సీజన్‌లో అదిరే ఆటతో దూసుకెళుతున్న గుజరాత్ టైటాన్స్ ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టింది. 200 పరుగుల ఛేదనను ఓపెనర్లు సాయి సుదర్శన్ (61 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 108 నాటౌట్), శుభ్‌మన్ గిల్ (53 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 93 నాటౌట్) విధ్వంసకర ఆటతీరుతో పూర్తి చేశారు. దీంతో ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో 10 వికెట్లతో టైటాన్స్ ఘనవిజయం అందుకుంది. అలాగే 18 పాయింట్లతో పట్టికలో టాప్‌నకు చేరింది. ఈ ఫలితంతో ఆర్‌సీబీ, పంజాబ్ (17 పాయింట్ల చొప్పున) జట్లు కూడా ప్లేఆఫ్స్‌లో చోటు దక్కించుకోవడం విశేషం. ముందుగా ఢిల్లీ 20 ఓవర్లలో 3 వికెట్లకు 199 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (65 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్సర్లతో 112 నాటౌట్), పోరెల్ (19 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 30), అక్షర్ (16 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 25), స్టబ్స్ (10 బంతుల్లో 2 సిక్సర్లతో 21 నాటౌట్) రాణించారు. ఛేదనలో గుజరాత్ 19 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 205 పరుగులు చేసి నెగ్గింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సుదర్శన్ నిలిచాడు.


కేఎల్ రాహుల్ (112 నాటౌట్)

ఇద్దరూ పోటాపోటీగా..: 200 పరుగుల ఛేదనను గుజరాత్ మెరుపు ఆటతో ఆరంభించింది. ఓపెనర్లు గిల్, సుదర్శన్‌ల నిలకడ ఈసారీ కొనసాగింది. రెండో ఓవర్‌లోనే సాయి 6,4,4,4తో 20 పరుగులు రాబట్టాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 59 పరుగులతో నిలిచింది. ఆ తర్వాత 11వ ఓవర్‌లోనే స్కోరు వందకి చేరింది. ఇక డెత్ ఓవర్లలో వీరి దూకుడు మరింత పెరగడంతో లక్ష్యం వేగంగా కరిగింది. 18వ ఓవర్‌లో సిక్సర్‌తో సాయి 56 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. సమీకరణం 12 బంతుల్లో 6 రన్స్‌కు మారడంతో ఓవర్ ఉండగానే మ్యాచ్‌ను ముగించారు.

అజేయ శతకంతో అదుర్స్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ ఇన్నింగ్స్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన రాహుల్ కదం తొక్కాడు. చివరి వరకు క్రీజులో నిలిచి అజేయ శతకంతో అండగా నిలిచాడు. అయితే జట్టు ఆరంభం నత్తనడకన సాగినా మధ్య ఓవర్ల నుంచి వేగం పుంజుకుంది. రాహుల్‌కు పోరెల్, అక్షర్, స్టబ్స్ సహకారం అందించారు. ఓపెనర్ డుప్లెసి (5) నిరాశపర్చగా.. ఐదు ఓవర్లలో డీసీ 28/1 స్కోరు మాత్రమే. రాహుల్ మాత్రం రబాడ ఓవర్‌లో 6,4,6 బాదడంతో 17 రన్స్ సమకూరాయి. దీంతో పవర్‌ప్లేలో జట్టు 45 పరుగులతో పర్వాలేదనిపించింది. మరో ఎండ్‌లో పోరెల్ తొమ్మిదో ఓవర్‌లో 4,6తో ఆకట్టుకున్నాడు. కానీ పోరెల్‌ను స్పిన్నర్ సాయికిశోర్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. రాహుల్ మాత్రం ధాటిని కొనసాగిస్తూ 14వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో స్కోరును పెంచే ప్రయత్నం చేశాడు. కెప్టెన్ అక్షర్ ఉన్న కాసేపు ఎదురుదాడికి దిగి మూడో వికెట్‌కు 45 పరుగులు జోడించాడు. 15-18 ఓవర్ల మధ్య రాహుల్ కేవలం ఆరు బంతులే ఎదుర్కోవడంతో చివర్లో వేగం తగ్గింది. అయితే 19వ ఓవర్‌లో తను 6,4తో శతకం పూర్తి చేసుకున్నాడు. ఇక ఆఖరి ఓవర్‌లో రాహుల్ 4,4 స్టబ్స్ 6తో 16 రన్స్ రాగా టైటాన్స్ ముందు 200 లక్ష్యాన్ని ఉంచింది.

1 టీ20ల్లో వేగంగా (224 ఇన్నింగ్స్) 8 వేల రన్స్ పూర్తి చేసిన తొలి భారత క్రికెటర్‌గా రాహుల్. ఓవరాల్‌గా గేల్, బాబర్ తర్వాత నిలిచాడు.

స్కోరుబోర్డు

ఢిల్లీ: కేఎల్ రాహుల్ (నాటౌట్) 112, డుప్లెసీ (సి) సిరాజ్ (బి) అర్షద్ 5, పోరెల్ (సి) బట్లర్ (బి) సాయి కిశోర్ 30, అక్షర్ (సి) సాయి కిశోర్ (బి) ప్రసిద్ధ్ 25, స్టబ్స్ (నాటౌట్) 21, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 199/3; వికెట్ల పతనం:** 1-16, 2-106, 3-151; **బౌలింగ్:** సిరాజ్ 4-0-37-0, అర్షద్ ఖాన్ 2-0-7-1, రబాడ 2-0-34-0, ప్రసిద్ధ్ 4-0-40-1, రషీద్ 4-0-32-0, సాయి కిశోర్ 4-0-47-1.

గుజరాత్: సాయి సుదర్శన్ (నాటౌట్) 108, గిల్ (నాటౌట్) 93, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం:** 19 ఓవర్లలో 205/0; **బౌలింగ్:** అక్షర్ 3-0-35-0, నటరాజన్ 3-0-49-0, ముస్తాఫిజుర్ 3-0-24-0, చమీర 2-0-22-0, విప్రజ్ 4-0-37-0, కుల్దీప్ 4-0-37-0.

'శాఫ్' చాంపియన్ భారత్

యుపియా (అరుణాచల్‌ప్రదేశ్): దక్షిణాసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (శాఫ్) అండర్-19 చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య భారత్ విజేతగా నిలిచింది. ఆదివారం ఇక్కడ హోరాహోరీగా సాగిన ఫైనల్..పెనాల్టీ షూటౌట్‌లో మనోళ్లు 4-3తో బంగ్లాదేశ్‌ను ఓడించారు. నిర్ణీత సమయానికి ఇరుజట్లు 1-1 గోల్‌తో సమంగా నిలిచాయి. ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలవడం ఇది రెండోసారి.

బంగ్లా ఆంక్షలకు ప్రతి ఆంక్షలు

- చెల్లుకు చెల్లు చెప్పిన భారత్
- దేశీయ ఎంఎస్ఎంఈలకు ఊరట



న్యూఢిల్లీ: భారత-బంగ్లాదేశ్ మధ్య వైరం ముదురుతోంది. ఆ దేశం నుంచి దిగుమతయ్యే రెడీమేడ్ దుస్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ వస్తువుల దిగుమతులను భూమార్గం ద్వారా కాకుండా కోల్‌కతా లేదా ముంబై సమీపంలోని నవసేనా రేవుల ద్వారా మాత్రమే అనుమతిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. భారత నూలు, బియ్యం దిగుమతులతో పాటు అనేక వస్తువులపై బంగ్లాదేశ్ ఇటీవల ఇదే తరహా ఆంక్షలు విధించింది. ఎవరైనా భారత ఎగుమతిదారు భూమార్గం ద్వారా బంగ్లాదేశ్‌కు సరుకులు ఎగుమతి చేయాలంటే ప్రతి కిలోమీటరుకు టన్నుకు 1.8 టాకాల చొప్పున ప్రత్యేక ఫీజు విధించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం బంగ్లా దిగుమతులపై ఈ ఆంక్షలు విధించింది. ఈ నిషేధం ప్రభావం మన దేశానికి బంగ్లాదేశ్ చేసే 42 శాతం (77 కోట్ల డాలర్లు) ఎగుమతులపై ఉంటుందని అంచనా.

ఎంఎస్ఎంఈలకు ఊరట

ఈ నిషేధం ప్రభావం ఈశాన్య రాష్ట్రాలు, దేశంలో ఇతర ప్రాంతాల్లో రెడీమేడ్ దుస్తులు తయారు చేసే దేశీయ ఎంఎస్ఎంఈలకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. నిజానికి బంగ్లాదేశ్ చౌకగా చైనా నుంచి వస్త్రాలు దిగుమతి చేసుకుని వాటిని దుస్తులుగా మార్చి మన దేశానికి జీరో డ్యూటీతో ఎగుమతి చేస్తోంది. దీనికి చెక్ పెట్టాలని దేశీయ పరిశ్రమ ముఖ్యంగా ఎంఎస్ఎంఈలు ఎప్పటి నుంచో ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. 'మేము ఎప్పటి నుంచో దీని గురించి అడుగుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం దేశీయ పరిశ్రమకు ఎంతో మేలు చేస్తుంది. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం' అని దుస్తుల ఎగుమతి ప్రోత్సాహక మండలి (ఏఈపీసీ) జాతీయ వైస్ చైర్మన్ ఏ శక్తివేల్ అన్నారు.

బంగ్లాకే అధిక నష్టం

ఈ పరస్పర ఆంక్షలతో బంగ్లాదేశ్ అధికంగా నష్టపోతుందని భావిస్తున్నారు. ఇప్పటి వరకు ఆ దేశ ప్రధాన ఎగుమతులైన దుస్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను భూమార్గం ద్వారా కోల్‌కతా, లేదా ముంబైకి తరలించి విదేశాలకు ఎగుమమతి చేసేది. దీంతో ఈ రేవులు బంగ్లాదేశ్ సరుకులతో నిండిపోయి తమ సరుకులు నిల్వ చేసేందుకు కనీసం చోటు కూడా దొరకడం లేదని భారత ఎగమతిదారులు ఎప్పటి నుంచో ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. గత ఏడాది బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని పడగొట్టి మహ్మద్ యూనస్ నాయకత్వంలోని ప్రభుత్వం అధికారం చేపట్టాక అక్కడ భారత వ్యతిరేకత ప్రబలిపోయింది. దీంతో కేంద్ర ప్రభుత్వం బంగ్లాదేశ్‌పై ఆర్థిక యుద్ధాన్ని తీవ్రం చేస్తోంది.

బిజినెస్

స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు రూ. 2 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: గత మూడేళ్లలో మన దేశ ఎగుమతుల స్వరూపం మారిపోయింది. స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు పెట్రో ఉత్పత్తులు, వజ్రాల ఎగుమతులను మించిపోయాయి. 2023-24లో 1,557 కోట్ల డాలర్లుగా ఉన్న వీటి ఎగుమతి 2024-25 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 55 శాతం వృద్ధి రేటుతో 2,414 కోట్ల డాలర్లకు (సుమారు రూ.2.05 లక్షల కోట్లు) చేరాయి. గత ఆర్థిక సంవత్సరం మన దేశం నుంచి అమెరికా, నెదర్లాండ్స్, ఇటలీ, జపాన్, చెక్ రిపబ్లిక్ దేశాలు అత్యధికంగా స్మార్ట్‌ఫోన్లు దిగుమతి చేసుకున్నాయి. గత మూడేళ్లలో మన దేశం నుంచి స్మార్ట్‌ఫోన్లు అమెరికాకు ఐదు రెట్లు, జపాన్‌కు నాలుగు రెట్లు పెరిగాయని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఫ్యూచర్ జెనరాలి 'హెల్త్ అన్‌లిమిటెడ్'

ప్రైవేట్ రంగంలోని ఫ్యూచర్ జెనరాలి ఇండియా ఇన్సూరెన్స్ తాజాగా 'హెల్త్ అన్‌లిమిటెడ్' పేరుతో అపరిమిత ప్రయోజనాలతో కూడిన ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పాలసీ కస్టమర్లకు కంపెనీ సమ్ అస్యూర్డ్‌తో సంబంధం లేకుండా జీవితంలో ఒకసారి అపరిమిత బీమా కవరేజీ సౌకర్యాన్ని ఆఫర్ చేస్తోంది. పాలసీదారు వైద్య ఖర్చు బీమా కవరేజీని వించిపోతుందేమో అన్న భయం లేకుండా నిశ్చింతగా చికిత్స పొందవచ్చని కంపెనీ పేర్కొంది. అయితే, ఈ అపరిమిత సమ్ అస్యూర్డ్ పునరుద్ధరణ సౌకర్యం రెండో క్లెయిమ్ నుంచి అందుబాటులోకి వస్తుంది.

త్వరలో హారియర్ ఈవీ

టాటా మోటార్స్

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) రంగంలో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలని టాటా మోటార్స్ భావిస్తోంది. ఇందులో భాగంగా హారియర్ ఈవీని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు కంపెనీ ప్రకటించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) కంపెనీకి చెందిన సియెర్రా ఈవీ మార్కెట్లోకి రానుంది. వీటితో పాటు ఇప్పటికే మార్కెట్ చేస్తున్న ఈవీలకు మరిన్ని ఫీచర్లు జోడించబోతోంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో టాటా మోటార్స్ 65,000 ఈవీలను విక్రయించింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 10 శాతం తక్కువ. దీంతో కొత్త మోడల్స్, ఉన్న మోడల్స్‌కు మరిన్ని ఫీచర్లు జోడించడం ద్వారా ఈవీ మార్కెట్లో దూసుకుపోవాలని కంపెనీ భావిస్తోంది.

టాటా ఈవీ మెగాచార్జర్స్: ఇంటర్‌సిటీ, అర్బన్ ఈవీ మొబిలిటీ కోసం టాటా ఈవీ వ్యూహాత్మకంగా హైస్పీడ్ చార్జర్స్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. చార్జర్‌జోన్, స్టాటిక్‌తో కలిసి 10 టాటా ఈవీ మెగాచార్జర్స్‌ను ప్రారంభించింది. వ్యూహాత్మకంగా కొన్ని నగరాలు, హైవేలపై వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

స్థిరంగా సిమెంట్ డిమాండ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)పై సిమెంట్ పరిశ్రమ చాలా ఆశలు పెట్టుకుంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం డిమాండ్ 7 నుంచి 7.5 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని 'ఇక్రా' రేటింగ్ సంస్థ అంచనా. 2024-25 మార్చి త్రైమాసికంలో కంపెనీల సిమెంట్ అమ్మకాల పరిమాణం 3.5 నుంచి 10 శాతం వరకు పెరిగింది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, గ్రామీణ డిమాండ్ పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా కలిసి వస్తోంది.

ధరలపై నిరాశే: గత ఆర్థిక సంవత్సరం ప్రముఖ కంపెనీల బస్తా (50 కిలోలు) సిమెంట్ ధర ఒక దశలో రూ.300కు పడిపోయింది. మార్చి నెలాఖరులో మాత్రమే ఇది రూ.350కి చేరింది. 2024-25లో కంపెనీలకు బస్తాకు సగటున రూ.340కి మించి రాలేదు. 2023-24తో పోలిస్తే ఇది 7 శాతం తక్కువ

25,400పైన బుల్లిష్

(మే 19-23 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో నిఫ్టీ


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 23,379-25,116 పాయింట్ల మధ్యన కదలాడి 339 పాయింట్ల నష్టంతో 25,020 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి: 25,400 **బ్రేక్‌డౌన్ స్థాయి** : 24,600
నిరోధ స్థాయిలు: 25,225, 25,325, 25,425 (25,125 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,800 24,700, 24,600 (24,900 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	550
వరంగల్	527	గోదావరి	540
చిత్తూరు	613	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	124
వరంగల్	125	గుంటూరు	127
కరీంనగర్	125	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	122
కర్నూలు	125	నెల్లూరు	127
విశాఖపట్నం	121	అనంతపురం	127
గోదావరి	124		

25,000 ఎగువన నిలదొక్కుకుంటేనే..

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ఆరంభంలో బుల్లిష్ ట్రెండ్‌తో ప్రారంభమై ఆ తర్వాత కరెక్షన్‌కు లోనైంది. అనంతరం కోలుకుని చివరకు 25,000 స్థాయిలకు స్వల్ప ఎగువన క్లోజైంది. వారం మొత్తానికి నిఫ్టీ 1,000 పాయింట్లకు పైగా లాభపడింది. నిఫ్టీ గత ఆరు వారాలుగా 22,000 పాయింట్ల నుంచి ర్యాలీని కనబరుస్తూ వచ్చింది. రికార్డు స్థాయిలో 12 శాతం మేర ర్యాలీని సాధించింది. అయినప్పటికీ నిఫ్టీ ఇంకా ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయిలైన 26,200 పాయింట్లకు దిగువనే ఉంది. మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్స్ కూడా గత వారం మంచి లాభాలను నమోదు చేశాయి. కాగా ఈ వారం మార్కెట్ పాజిటివ్‌గా ప్రారంభమైనా అప్రమత్త ధోరణిలో కొనసాగే వీలుంది. కీలకమైన 25,000 పాయింట్ల వద్ద మరోసారి పరీక్షను ఎదుర్కొనే వీలుంది. కొద్ది రోజుల పాటు ఇక్కడ నిలదొక్కుకుంటేనే అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తుందా లేదా అనేది తెలుస్తుంది.

బుల్లిష్ స్థాయిలు: ప్రస్తుత గరిష్ఠ స్థాయిలైన 25,000 వద్ద కన్సాలిడేషన్‌కు అవకాశం ఉంది. సానుకూల ట్రెండ్‌ను సూచిస్తే 25,200 వద్ద మైనర్ నిరోధ స్థాయిలుంటాయి. ఇది గత ఏడాది అక్టోబరు 15న ఏర్పడిన స్థాయి. పాజిటివ్ ట్రెండ్‌ను కొనసాగిస్తే తదుపరి నిరోధ స్థాయి 25,500.

బేరిష్ స్థాయిలు: ఏదేనీ బలహీనతను సూచిస్తే తదుపరి 25,000 దిగువన మద్దతు స్థాయిలుంటాయి. ప్రస్తుత అప్‌ట్రెండ్‌ను కొనసాగించాలంటే మాత్రం ఈ స్థాయిల వద్ద కచ్చితంగా నిలదొక్కుకోవాలి. తదుపరి మద్దతు స్థాయిలు 24,800, 24,500. అయితే ఈ మద్దతు స్థాయి కొంత దూరంగా ఉన్నందు వల్ల తక్షణ ముప్పు ఉండదు.

బ్యాంక్ నిఫ్టీ: వీక్లీ ప్రాతిపదికన ఈ సూచీ 3.2 శాతం లాభపడి 55,350 వద్ద క్లోజైంది. ఈ వారం అప్‌ట్రెండ్‌ను కనబరిస్తే తదుపరి నిరోధ స్థాయిలు 56,000 వద్ద ఉంటాయి. అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయిలకు ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత మద్దతు స్థాయిలైన 55,500 వద్ద విఫలమైతే బలహీనతగా భావించి అప్రమత్తం కావాలి.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం 20 డీఎంఏను అధిగవించి సానుకూల సంకేతాలు వెలువరించింది. ఈ వారం 25,000 వద్ద అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ కన్నా పైన నిలదొక్కుకున్నప్పుడే మరింత సానుకూల ధోరణి ఏర్పడుతుంది. స్వల్పకాలిక ఓవర్‌బాట్ పొజిషన్‌లోకి మార్కెట్ ప్రవేశిస్తుండటంతో స్వల్పకాలిక ఇన్వెస్టర్లు గరిష్ఠ స్థాయిల వద్ద అప్రమత్తంగా ఉండాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,140, 25,200
మద్దతు	25,000, 24,920

పడితే కొనుగోలు చేసే వ్యూహం బెటర్!

అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తగ్గటంతో దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం రాణించే అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం నిఫ్టీ 25,000 పైన ముగియటం పాజిటివ్ సెంటిమెంట్‌ను నింపుతోంది. ప్రస్తుతం రక్షణ, షిప్ బిల్డింగ్, రైల్వే, ఏవియేషన్, చమురు, గ్యాస్ సరఫరా, డైమండ్, జువెలరీ రంగాలకు చెందిన షేర్లు బలాన్ని ప్రదర్శిస్తున్నాయి. మీడియా, హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్, ఐటీ రంగాల్లో అంతగా మూమెంటమ్ కనిపించటం లేదు. ఇన్వెస్టర్లు నాణ్యమైన షేర్లను బై ఆన్ డిప్స్ పద్ధతిలో కొనుగోలు వ్యూహాన్ని పాటించటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

టాటా టెక్నాలజీస్: గత ఏడాది సెప్టెంబరు నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ కౌంటర్‌లో ప్రస్తుతం అక్యుములేషన్ జరుగుతోంది. షార్ట్‌టర్మ్ మూమెంటమ్, వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. పైగా నెల రోజుల గరిష్ఠాన్ని బ్రేక్ చేశాయి. గత శుక్రవారం 4.3 శాతం లాభంతో రూ.750 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.740 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.810/900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.710 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆర్‌వీఎన్ఎల్: ఏడాది కాలంగా డౌన్‌ట్రెండ్‌లో సాగుతూ వస్తున్న ఈ షేరులో ప్రస్తుతం మూమెంటమ్ పెరిగింది. బేస్‌తో పాటు 20, 50 రోజుల సగటు ధరను అధిగమించింది. గత శుక్రవారం ఈ షేరు 8.9 శాతం లాభంతో రూ.409 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.400 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.425/440 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.385 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా: సుదీర్ఘకాలంగా పతనమవుతూ వస్తున్న ఈ కౌంటర్‌లో ప్రస్తుతం మంచి బేస్ ఏర్పడింది. గత శుక్రవారం 5.8 శాతం లాభంతో రూ.730 వద్ద క్లోజయి గత నెల గరిష్ఠ స్థాయిని అధిగమించింది. రిలేటివ్ స్ట్రెంత్ కూడా పెరుగుతోంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.810 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.775 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మోతీలాల్ ఓస్వాల్: ప్రస్తుతం ఈ కౌంటర్‌లో మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతున్నాయి. జనవరి నుంచి కొనసాగిన పతనం ముగిసింది. అక్యుములేషన్ కొనసాగుతోంది. పైగా నెల రోజుల గరిష్ఠాన్ని అధిగమించింది. గత శుక్రవారం 3.8 శాతం లాభంతో రూ.789 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.780 శ్రేణిలో ఎంటరై రూ.850/890 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.750 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సీజీ పవర్: ప్రస్తుతం ఈ షేరు అక్యుములేషన్ ముగింపు దశలో ఉంది. షార్ట్, మిడ్ టర్మ్‌లో మూమెంటమ్ ప్రదర్శిస్తున్నాయి. 20, 50 రోజుల మూవింగ్ యావరేజెస్‌ను అధిగమించింది. గత శుక్రవారం 2.7 శాతం లాభంతో రూ.696 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.690 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.770/800 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.670 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.



పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

» నాలుగో రోజు 1.30 లక్షల మంది పుణ్య స్నానాలు

» కాళేశ్వరంలో భక్తజనంతో కిక్కిరిసిన వీధులు

భూపాలపల్లి, మే18 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల సందర్భంగా కాళేశ్వర క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోతోంది. రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరిగిపోతుండడంతో కాళేశ్వరం క్షేత్రంలో వీధులన్నీ సందడిగా మారాయి. పుష్కరాల్లో మొదటి రెండు రోజులు జనం పెద్దగా కనిపించకపోయినా శని, ఆదివారాల్లోనే దాదాపు రెండున్నర లక్షల మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. ఆదివారం ఒక్కరోజే దాదాపు 1.30 లక్షల మందికి పైగా భక్తులు సరస్వతి పుష్కరాల్లో పుణ్యస్నానాలు చేశారు. ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. పుణ్యస్నాలు ఆచరించిన ప్రముఖుల్లో పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతి మహాస్వామి, హైకోర్టు న్యాయమూర్తి సుధా, ప్రముఖ సినీ నటుడు రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు. భక్తుల రద్దీ పెరగడంతో మహాదేవపూర్ నుంచి కాళేశ్వరం దాకా ట్రాఫిక్ సుమారు 10 గంటల పాటు స్తంభించిపోయింది. దాదాపు 16 కిలోమీటర్ల మేర ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోవడంతో పుష్కరాలకు వచ్చిన భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు. అన్నారం క్రాస్ వద్ద ఆర్టీసీ బస్సు నడిరోడ్డుపై పంచర్ కావడంతో ట్రాఫిక్ సమస్యలు మొదలైనట్లు భక్తులు చెప్పారు. ట్రాఫిక్‌ను సరి చేసేందుకు అధికారులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. వేలాదిమంది సరస్వతి ఘాట్ల వరకు మండుటెండలో కాలినడకన వెళ్లి పుణ్య స్థానాలు ఆచరించారు. ఆదివారం భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిసినా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా ఉదాసీనంగా వ్యవహరించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భక్తులకు తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చలివేంద్రాలు ఏర్పాటుచేసి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే భక్తులకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లను కూడా పంపిణీ చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా పుష్కరాలకు సంబంధించి విస్తృత ప్రచారం జరుగుతుండడంతో భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్వయంగా కాళేశ్వరంలోనే విడిది చేసి వసతులు, ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చర్యలు చేపడుతున్నారు. సరస్వతీ పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు కాళేశ్వర క్షేత్రం మొత్తాన్ని ఏరియల్ వ్యూ ద్వారా వీక్షించడం కోసం అధికారులు హెలీకాప్టర్ జాయ్ రైడ్‌ను యాత్రాదాం.ఓఆర్‌జి ద్వారా అందుబాటులోకి తెచ్చారు.హెలీకాప్టర్ ద్వారా పుష్కరాలను వీక్షించడం కోసం ఒక్కో వ్యక్తికి రూ.4,500లను రుసుముగా నిర్ణయించారు.

ఘనంగా నూతన పోప్ ప్రమాణ స్వీకారం



వాటికన్ సిటీ, మార్చి 18: నూతన పోప్ లియో-16 ప్రమాణ స్వీకారం ఆదివారం ఇక్కడ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో జరిగిన ప్రారంభ ప్రార్థనకు దాదాపు 2 లక్షల మంది హాజరయ్యారు. వారసత్వంగా వస్తున్న గొర్రెపిల్ల ఉన్నితో చేసిన శాలువాను భుజాలపై వేసినప్పుడు, 'మత్స్యకారుని ఉంగరాన్ని' వేలికి తొడిగినప్పుడు ఆయన ఉద్వేగానికి గురయ్యారు. ఉంగరాన్ని తొడిగిన అనంతరం చేతులను చూసుకొని దండాన్ని ధరించారు. తరువాత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవానికి భారత ప్రభుత్వ ప్రతినిధిగా రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ హాజరయ్యారు.

గురితప్పిన ఇస్రో బాణం

పీఎస్ఎల్వీ-సీ61 మూడో దశలో సాంకేతిక సమస్య.. రాకెట్ కూల్చివేత



సూళ్లూరుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇస్రోకు తిరుగులేని విజయాలు అందించిన పీఎస్ఎల్వీలో చిన్న అపశ్రుతి చోటుచేసుకుంది. సాంకేతిక సమస్యతో ఇస్రో బాణం గురితప్పింది. శ్రీహరికోట నుంచి 101వ అంతరిక్ష ప్రయోగంగా ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ61 ప్రయోగం విఫలమైంది. సరిహద్దులపై నిఘా కోసం రూపొందించిన ఈవోఎస్-09 (రీశాట్-1బీ) ఉపగ్రహాన్ని తీసుకుని భారీ అంచనాలతో నింగిలోకి ఎగిరిన పీఎస్ఎల్వీ-సీ61 సాంకేతిక సమస్య కారణంగా లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. నింగిలోకి దూసుకెళ్లిన కాసేపటికే మూడో దశలో సాంకేతిక సమస్య తలెత్తడంతో రాకెట్ ప్రయాణ గమన దిశ మారింది. సాంకేతిక సమస్యను గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ దిశను మార్చి నిర్దేశిత మార్గంలోకి తీసుకొచ్చేలా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఈ మిషన్‌ను అర్ధంతరంగా ముగించాల్సి వచ్చింది. ప్రామాణిక భద్రత ప్రొటోకాల్‌ను అనుసరించి సాంకేతిక సమస్యను గుర్తించిన తర్వాత రాకెట్‌లోని నాలుగో దశ, పేలోడ్ (ఈవోఎస్-09)లను పేల్చివేశారు. అనంతరం మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో ఛైర్మన్ నారాయణన్ దీనిపై ప్రకటన చేశారు. పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ ద్వారా ఈవోఎస్-09 ఉపగ్రహాన్ని 524 కిలోమీటర్ల దూరంలోని సూర్య-సమకాలీన కక్ష్యలోకి చేర్చాలని ఇస్రో భావించింది. దీనిలో అమర్చిన సీ-బ్యాండ్ సింథటిక్ ఎపర్చర్ రాడార్ సాయంతో అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ హై రిజల్యూషన్‌తో కూడిన చిత్రాలను తీయవచ్చు.

పీఎస్ఎల్వీకి మూడో పరాజయం

అంతకుముందు శనివారం ఉదయం 7:59 గంటలకు ప్రారంభమైన 22 గంటల కౌంట్‌డౌన్ పూర్తవగానే ఆదివారం ఉదయం 5:59 నమిషాలకు షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి పయనమైంది. 8 నిమిషాలకు తన రెండు దశలను సునాయసనంగా పూర్తి చేసుకొంది. మూడో దశలోకి ప్రవేశించగానే సాంకేతిక సమస్య తలెత్తింది. ఘన హైడ్రాక్సిల్-టెర్మినేటెడ్ పాలిబ్యూటాడిన్ (హెచ్‌టీపీబీ) మోటారుతో నడిచే మూడో దశ (పీఎస్3) సరిగ్గా పనిచేయలేదు. దీంతో రాకెట్ గతి తప్పింది. పీఎస్3 దశకు సంబంధించిన డేటా, తయారీ రికార్డులను పరిశీలించేందుకు ఇస్రో ఒక వైఫల్య విశ్లేషణ కమిటీని ఏర్పాటు చేసింది. పీఎస్ఎల్వీ శ్రేణిలో ఇస్రో ఇప్పటివరకూ 63 ప్రయోగాలు చేపట్టగా.. ఇది మూడో వైఫల్యమేనని, 2017 తర్వాత పీఎస్ఎల్వీ రాకెట్ విఫలమవడం ఇదే తొలిసారని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు.

60 విజయాలు.. 3 వైఫల్యాలు

1969 ఆగస్టు 15న ప్రారంభమైన ఇస్రో.. 1993లో పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాలకు ఇస్రో శ్రీకారం చుట్టింది. పీఎస్ఎల్వీ-డీ1 పేరిట 1993 సెప్టెంబరు 20న తొలి ప్రయోగం చేపట్టగా.. నాలుగో దశలో ద్రవ ఇంధనంలో సాంకేతిక లోపం తలెత్తి అది విఫలమైంది. అనంతరం 1994 అక్టోబరు 15న పీఎస్ఎల్వీ-డీ2 ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టారు. అక్కడి నుంచి ఇస్రో వరుసగా 39 విజయాలు సాధించింది. 2017 ఆగస్టు 31న పీఎస్ఎల్వీ-సీ39 రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఈ వైఫల్యం తర్వాత 8 ఏళ్లలో పీఎస్ఎల్వీ ద్వారా చేపట్టిన 21 రాకెట్ ప్రయోగాలు వరుసగా విజయం సాధించాయి. తాజాగా పీఎస్ఎల్వీ-సీ61 మూడో దశలో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రయోగం విఫలమైంది.

ఇస్రో జైత్రయాత్రకు బ్రేక్

ఎనిమిదేళ్లుగా 58 విజయాలతో ఇస్రో విజయ పరంపర కొనసాగిస్తోంది. 2017 నుంచి ఈ ఏడాది జనవరి 29 వరకు... పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, ఎస్ఎస్ఎల్వీ, గగన్‌యాన్-డీ1, ఆర్ఎల్‌వీ-టీడీ ఇలా వరుసగా 58 ప్రయోగాల్లో విజయం సాధించింది. ఈ సక్సెస్‌తో భారత్ అంతరిక్ష పరిశోధనల్లో అగ్రరాజ్యాల సరసన నిలిచింది. ఇందులో చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1, గగన్‌యాన్-డీ1 వంటి ప్రయోగాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు దేశ రక్షణ, సైనిక అవసరాలు, సరిహద్దుల్లో నిఘా వ్యవస్థలను బలోపేతం చేయడం కోసం ఈవోఎస్-09ను పంపేందుకు ఆదివారం ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ విఫలమవడంతో వరస విజయాలకు బ్రేక్ పడింది.

ఆకాశ్ పనితీరు చూసేందుకు..
కలాం ఉంటే బాగుండేది!



'ఆంధ్రజ్యోతి'తో డీఆర్‌డీవో మాజీ శాస్త్రవేత్త, ఆకాశ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రహ్లాదరామారావు

అల్వాల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారంగా పాక్ మనదేశంపైకి ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను తుత్తునియలు చేసిన ఆకాశ్ క్షిపణుల తయారీ అబ్దుల్ కలాం కలల ప్రాజెక్టు అని.. దానికి ఆయన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని డీఆర్‌డీవో రిటైర్డ్ శాస్త్రవేత్త, కర్ణాటకకు చెందిన డాక్టర్ ప్రహ్లాదరామారావు పేర్కొన్నారు. ఆకాశ్ పనితీరు చూడటానికి ఆయన ఇక్కడ ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. రక్షణ రంగంలో కీలకమైన ప్రాజెక్టులన్నింటికీ కేంద్రస్థానంగా మారిన హైదరాబాద్ డీఆర్‌డీవోలో అభివృద్ధి చేసిన అనేక రక్షణ ఉత్పత్తులు యుద్ధరంగంలో కీలకపాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం.. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు నాయకత్వం వహిస్తున్నప్పుడు ప్రహ్లాదరామారావుకు ఆకాశ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇక్కడ అత్యంత కీలకమైన బాధ్యతను అప్పగించారు. అలా తాము అభివృద్ధి చేసిన ఆకాశ్ క్షిపణులు దాయాది దేశ విమానాలను, క్షిపణులను విజయవంతంగా తిప్పికొట్టడం ఆనందం కలిగించిందని.. అది తన జీవితంలోనే అత్యంత సంతృప్తికరమైన రోజు అని ప్రహ్లాదరామారావు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. ఆకాశ్ క్షిపణిని అభివృద్ధి చేసే క్రమంలో ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ.. కలాం మద్దతుతో ప్రాజెక్టును కొనసాగించామని తెలిపారు.

ఉక్రెయిన్‌పై 273 డ్రోన్లతో దాడి

కీవ్, మే 18: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి భారీ స్థాయిలో 273 డ్రోన్లతో దాడులకు తెగబడింది. డ్రోన్లతో ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై దాడులు చేసింది. ఈ దాడుల వల్ల ఒక మహిళ మృతి చెందగా.. మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. 2022లో పూర్తి స్థాయి యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఈ స్థాయిలో భారీ డ్రోన్ దాడి జరగలేదని తెలుస్తోంది. కాల్పుల విరమణ దిశగా మాస్కో, కీవ్ మధ్య మొదటిసారి ఇస్తాంబుల్ వేదికగా జరిగిన ముఖాముఖి చర్చలు విఫలమైన నేపథ్యంలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి. మరోవైపు ఉక్రెయిన్ కూడా రష్యాలపై డ్రోన్లను ప్రయోగించింది. ఇదిలా ఉండగా.. యుద్ధానికి ముగింపు పలకడానికి గాను సోమవారం రష్యా అధ్యక్షుడు పుతిన్, తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో
103 మంది మృతి

గాజా, మే 18: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేసింది. గాజా స్ట్రిప్ వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జరిపిన వైమానిక దాడుల్లో 103 మంది మరణించారు. ఉత్తర గాజాలోని ప్రధాన ఆస్పత్రిని సైతం మూసివేశారు. ఇజ్రాయెల్ సూచించిన షరతుల మేరకు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ ఒప్పుకొనేలా ఒత్తిడి పెంచే ప్రణాళికలో భాగమే తాజా భీకర దాడులు. ఖాన్‌యూనిస్ నగరంలోనూ, దాని చుట్టుపక్కల జరిపిన దాడుల్లో ఇళ్లు, పునరావాస టెంట్‌లు ధ్వంసమవడంతో 48 మందికిపైగా మరణించారు. మృతుల్లో 18 మంది చిన్నారులు, 13 మంది మహిళలు ఉన్నారని నస్సెర్ ఆస్పత్రి అధికార ప్రతినిధి వీం ఫేర్స్ చెప్పారు. ఉత్తర గాజాలోని ఇండోనేసియన్ ఆస్పత్రి చుట్టూ దాడులు జరగడంతో ఆస్పత్రిని మూసివేసినట్టు వైద్యాధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉత్తర గాజాలో క్షతగాత్రులకు వైద్యసేవలు అందిస్తున్న ప్రధాన ఆస్పత్రి ఇదే. తాజాగా హౌతీ రెబెల్స్ ఇజ్రాయెల్‌పై దాడులు ప్రారంభించారు. దీంతో ఆదివారం ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాల్లో సైరన్‌ల మోత మోగింది.

సిగరెట్ తీసుకురాలేదని
కారుతో ఢీకొట్టి చంపేశాడు!

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): సిగరెట్ తీసుకురానందుకు ఓ వ్యక్తి ఏకంగా కారుతో ఢీకొట్టి ఒకరి మృతికి కారణమయ్యాడు. మరొకరు ఆస్పత్రి పాలయ్యేలా చేశాడు. నిందితుడిని బెంగళూరు పోలీసులు అరెస్టు చేశారు. హాసన్‌కు చెందిన సంజయ్(29), హుబ్బళ్లి వాసి చేతన్(30) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. వర్క్ ఫ్రం హోం ఉండడంతో ఈ నెల 9న రాత్రి గాణిగరపాళ్యలోని సంజయ్ ఇంట్లో కలిసి పని చేశారు. 10న తెల్లవారుజామున 4 గంటలకు బెంగళూరు పరిధి కోణనకుంటె క్రాస్ వద్దకు టీ తాగేందుకు బైక్‌పై వెళ్లారు. మెయిన్‌రోడ్డులో ఓ కొట్టువద్ద టీ తాగుతుండగా.. ప్రతీక్ (32) అనే వ్యక్తి భార్యతోపాటు కారులో అక్కడికొచ్చాడు. కారు దిగకుండానే సంజయ్‌ను సిగరెట్ తీసుకురావాలంటూ ఆదేశించాడు. దీంతో సంజయ్ 'మీరే తెచ్చుకోండి' అనడంతో ప్రతీక్ దాడికి యత్నించాడు. వేగంగా వెళ్లి బైక్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ సంజయ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు.

చిత్రజ్యోతి
SINCE 1965

గ్యాంగ్‌స్టర్ పాత్రలో కమల్

కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'థగ్ లైఫ్'. శ్రీయ కథానాయికగా, శింబు కీలక పాత్రలో నటించారు. రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తు



న్నాయి. జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. కమల్ హాసన్ పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో అదరగొట్టారు. ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందించారు. తెలుగులో ఈ సినిమాను ఎన్.సుధాకర్ రెడ్డి విడుదల చేస్తున్నారు.



ఆలయ రక్షణ కోసం..

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'భైరవం'. డా.జయంతి లాల్ గడా సమర్పణలో కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈనెల 30న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని లాంచ్ చేశారు. గ్రామంలోని వారాహి ఆలయం చుట్టూ కథ తిరుగుతుంది. రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి ఆలయం భూములపై కన్నేస్తాడు. దాంతో గ్రామంలో శాంతికి భంగం కలుగుతుంది. ఈ క్రమంలో ముగ్గురు స్నేహితులు కలసి ఆలయాన్ని, దాని వారసత్వాన్ని రక్షించేందుకు బలంగా నిలబడతారు. వారి మధ్య ఉన్న బంధం, ధైర్యం గ్రామ ప్రజల్లో ఆశలు చిగురింపజేస్తాయి. ట్రైలర్‌ని బట్టి చూస్తే కమర్షియల్ వాల్యూస్‌తో ఉన్న కథను దర్శకుడు చాలా ప్రభావశీలంగా తెరపై ఆవిష్కరించారనిపిస్తోంది.

కొత్తదనంతో నిండిన చిత్రం



నవీన్ చంద్ర హీరోగా రాకేశ్ పొట్టా తెరకెక్కిస్తున్న చిత్రం 'కరాలి'. మందలపు శివకృష్ణ నిర్మిస్తున్నారు. రాశీ సింగ్, కాజల్ చౌదరి హీరోయిన్లు. ఆదివారం ఈ సినిమాను ప్రారంభించారు. నిర్మాత సాహు గారపాటి క్లాప్ కొట్టి స్క్రిప్టును అందజేశారు. ఈ సందర్భంగా హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ "నేనింతవరకూ ఇటువంటి యాక్షన్ డ్రామా చేయలేదు. కొత్తదనంతో నిండిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటుడు రాజారవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

హారర్ థ్రిల్లర్ అమరావతికి ఆహ్వానం



శివ కంఠంనేని, ఎస్తర్, ధన్య బాలకృష్ణ, సుప్రీత, హరీశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న హారర్, థ్రిల్లర్ 'అమరావతికి ఆహ్వానం' షూటింగ్ పూర్తయింది. ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం కోసం ఇటీవల 20 రోజుల పాటు మధ్యప్రదేశ్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. జీవీకె దర్శకత్వంలో కె.ఎస్.శంకరరావు, ఆర్.వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు శివ కంఠంనేని మాట్లాడుతూ 'ప్రజెంట్ ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని దర్శకుడు జీవీకే ఓ మంచి హారర్, థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. టెక్నికల్‌గా కూడా చిత్రం బాగుంటుంది' అని తెలిపారు. సరికొత్త కథాంశంతో వస్తున్న సినిమా ఇదనీ, ప్రేక్షకుల్ని తప్పకుండా అలరిస్తుందనీ దర్శకుడు చెప్పారు.

నా కెరీర్‌లోనే ప్రత్యేకం

- సుమయ రెడ్డి



'డియర్ ఉమ' సినిమాతో తెరంగేట్రం చేశారు తెలుగమ్మాయి సుమయ రెడ్డి. ఈ సినిమాకు ఆమె నిర్మాతగానూ వ్యవహరించడం విశేషం. ఇందులో ఆమె పోషించిన డాక్టర్ పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'నా కెరీర్‌లో 'డియర్ ఉమ' ఎంతో ప్రత్యేకమైంది. నటిగా నాకు మంచి బ్రేక్‌తో పాటు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ప్రేక్షకులు అందించిన ఆదరాభిమానాలు మరువలేనివి. ఈ ప్రోత్సాహంతో మరింత ముందుకు సాగుతాను' అని చెప్పారు. త్వరలోనే ఆమె నటిస్తున్న కొత్త ప్రాజెక్ట్ ప్రకటించనున్నారు.

జూన్ నుంచి థియేటర్లు బంద్



తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్ కానున్నాయి. అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించలేమని, థియేటర్లు మూసివేయాలని సినీ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. పర్సంటేజ్ రూపంలో చెల్లిస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని తేల్చి చెప్పారు. ఆదివారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో తెలంగాణ, ఆంధ్రా సినీ ఎగ్జిబిటర్ల సమావేశం నిర్వహించారు. నిర్మాతలు దిల్‌రాజు, సురేశ్‌బాబు సహా 60 మంది ఎగ్జిబిటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య చాలా కాలంగా పర్సంటేజీలపై చర్చ సాగుతోంది. రెంటల్ విధానంలో సినిమాలు ప్రదర్శించడం సాధ్యం కాదని ఎగ్జిబిటర్లు వాదిస్తుంటే, పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారు. ఈ వ్యవహారం నిర్మాతలకు సైతం ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిటర్ల సమావేశంలో పర్సంటేజీలు, ప్రభుత్వ విధానాలపై చర్చించారు. పర్సంటేజీల రూపంలో చెల్లిస్తేనే సినిమాలను ప్రదర్శిస్తామని నిర్మాతలకు లేఖ రాయాలని తీర్మానించారు.

ఈ సినిమాలపై ప్రభావం

జూన్ 1 నుంచి థియేటర్లు మూసివేయాలనే ఎగ్జిబిటర్ల నిర్ణయంతో పలు సినిమాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. ఈ నెలాఖరు నుంచి వరుసగా పెద్ద సినిమాలు రిలీజ్ కానున్నాయి. మే 30న భైరవం, జూన్ 5న థగ్ లైఫ్, జూన్ 12 హరిహర వీరమల్లు, జూన్ 27న కన్నప్ప, జూన్ 20న కుబేర, జూలైలో కింగ్‌డమ్ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి.


మంటల ఉధృతితో భవనంపై వరకూ వ్యాపించిన పొగ


అగ్నిప్రమాదం తర్వాత భవనం లోపలి దృశ్యం

మృత్యు జ్వాల

మృతులు: ప్రహ్లాద్ రాయ్ మోదీ (73), మున్నీబాయ్ మోదీ (73), రాజేందర్ గుప్తా (67), సుమిత్ర (65), రజనీ అగర్వాల్ (47), శీతల్ జైన్ (35), ఆరుషి జైన్, రిషాప్ జైన్, పంకజ్ మోదీ (35), వర్ష (35), అనన్య(11), ఇదిక (8), ఇరాజ్ (2), ప్రాన్షి (6), ప్రథమ్ (14), అభిషేక్ (31), అర్షలి (7).

చార్మినార్ సమీపంలోని గుల్జార్‌హౌజ్ వద్ద ఘోర అగ్నిప్రమాదం.. 17 మంది మృతి

హైదరాబాద్ సిటీ, మంగళ్‌హాట్, అఫ్జల్‌గంజ్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం ఉదయాన్నే ఘోర విషాదం చోటుచేసుకుంది. చార్మినార్ సమీపంలోని గుల్జార్‌హౌజ్ వద్ద ఓ భవనం మొదటి అంతస్తులో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 17 మంది దుర్మరణం చెందారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులు, ఐదుగురు మహిళలు ఉన్నారు. 60 ఏళ్లు దాటిన వారు నలుగురు ఉన్నారు. పిల్లలను, వయోధికులను వదిలి వెళ్లలేక.. వారిని కాపాడే ప్రయత్నంలో మిగతా ఐదుగురూ చనిపోయారు. గుల్జార్‌హౌజ్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రహ్లాద్‌రాయ్ మోదీ (73) కొంతకాలంగా అక్కడ నగల దుకాణాన్ని నడుపుతున్నారు. ఆయన భార్య మున్నీ (73). వారికి నలుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రహ్లాద్‌రాయ్ తమ్ముడు రాజేందర్ (67), ఆయన భార్య సుమిత్ర మోదీ (65). వారంతా ఒకే భవనంలో (జీ+2) నివాసం ఉంటున్నారు. వేసవి సెలవుల సందర్భంగా.. ప్రహ్లాద్‌రాయ్ కుమారుడైన పంకజ్ (36), అతడి భార్య వర్ష (32), వారి ముగ్గురు పిల్లలు అనన్య (11), ఇదిక (8), ఇరాజ్ (2)తో ఆ ఇంటికి వచ్చారు. అలాగే, ప్రహ్లాద్ కుమార్తె శీతల్ (35) తన ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో, ప్రహ్లాద్ మరో కుమార్తె రజని తన కుమారుడితో, ఇంకో కుమార్తె సంతోషి.. పుట్టింటికి వచ్చారు. రాజేందర్ మోదీ పిల్లల్లో కూడా కొందరు ఆ ఇంటికి వచ్చారు. అంతా కలిసి రెండ్రోజులు సరదాగా గడిపారు. ఆదివారం ఉదయం 6.16 గంటల సమయంలో ఆ ఇంటి గ్రౌండ్‌ఫ్లోర్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు చుట్టుముట్టి, పొగ కమ్ముకోవడంతో.. లోపలున్నవారంతా తమను కాపాడాలంటూ హాహాకారాలు చేశారు. ఆ కుటుంబానికి చెందిన ఒక మహిళ.. బయటకు వచ్చి తమవారిని కాపాడాలంటూ కేకలు వేయడం గమనించిన స్థానిక యువకులు.. లోపలున్న వారిని బయటకు తేవడానికి ప్రయత్నించారు. కానీ.. పొగ ఎక్కువగా ఉండడంతో వారికి శ్వాస తీసుకోవడమే కష్టమైంది. దీంతో పక్క భవనానికి ఉన్న షట్టర్ పగలగొట్టి లోపలికి వెళ్లి సహాయకచర్యల్లో పాల్గొన్నారు. తాము లోపలికి వెళ్లేసరికే అక్కడ ఏడుగురు మృతిచెందారని జహేద్, అజ్మత్ అనే ఇద్దరు యువకులు తెలిపారు. మరోవైపు.. సమాచారం తెల్సుకున్న అగ్నిమాపక అధికారులు ఫైరింజన్లతో అక్కడికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఒకటే మార్గం..

భవనంలోకి వెళ్లేందుకు ఒకటే మెట్ల మార్గం ఉండడం.. అక్కడే అగ్ని ప్రమాదం జరిగి మంటలు, పొగ వ్యాపించడంతో సహాయక చర్యలు ముందుకు సాగలేదు. పై అంతస్తుకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో.. అగ్నిమాపకశాఖ అధికారులు పక్క భవనం గోడలకు రంధ్రాలు చేసి ఆ భవనంలోకి వెళ్లారు. మంటలు, పొగలో చిక్కుకున్న వారిని కిందకు తీసుకువచ్చారు. ఒక గదిలో ఒక మహిళ.. ఐదుగురు చిన్నారులను పట్టుకుని ఉందని, కానీ వారంతా అప్పటికే స్పృహతప్పి ఉన్నారని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. బయటకు తీసుకొచ్చాక వారందరిని సమీప ఆస్పత్రులకు తరలించారు. కానీ.. వారిలో చాలామంది ఆస్పత్రులకు తరలించే లోపే తుది శ్వాస విడిచారు. కొందరు ఆస్పత్రికి వెళ్లాక చనిపోయారు. కాగా.. మంటలు ఆర్పడానికి 11 అగ్నిమాపక శకటాలను వినియోగించారు. మొత్తం 87 మంది అధికారులు, సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. గదిలోకి వెళ్లి తలుపులు మూసేసుకుంటే ప్రాణాలు కాపాడుకోవచ్చని భావించడం వల్ల పొగ కమ్మేసి పదిమంది చనిపోయారని.. వారంతా ఇంట్లోంచి భవనం పైభాగానికి వెళ్లి ఉంటే బతికేవారని కావని రెస్క్యూ అధికారులు ఆవేదన వెలిబుచ్చారు. ఇక.. ఉస్మానియాలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం.. అంత్యక్రియల ఏర్పాట్లను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యవేక్షించారు. మృతుల కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు.

ఘటనాస్థలికి మంత్రి పొన్నం..

ప్రమాదం గురించి తెలియగానే.. సీఎం రేవంత్ ఆదేశాల మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితులను ఆస్పత్రులకు తరలించారు. కాగా.. ఉస్మానియా ఆస్పత్రి వద్దకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తదితరులపై మృతుల బంధువులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక శకటాలు, అంబులెన్సులు రాలేదని.. వచ్చిన ఫైరింజన్‌లో సరిపడా నీళ్లు లేకపోవడంతో వెనక్కి వెళ్లిపోయిందని.. అంబులెన్సులో ఆక్సిజన్ లేదని, అందుకే ఇంతమంది చిన్నారుల ప్రాణాలు కోల్పోయారంటూ వారిని చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ మార్చురీ వద్దకు చేరుకుని వారిని ఓదార్చడంతో పాటు అధికారులతో మాట్లాడారు. ఇక.. ఘటనాస్థలిని పరిశీలించిన ఫైర్ సేఫ్టీ డీజీ నాగిరెడ్డి ఈ ప్రమాదానికి కారణం షార్ట్ సర్క్యూటేనని ప్రాథమికంగా నిర్ధారించారు. కాగా.. హైదరాబాద్‌లో ఒక అగ్ని ప్రమాదంలో ఇంతమంది దుర్మరణంపాలవడం ఇదే ప్రథమమని అధికారులు చెబుతున్నారు.

పొద్దున్నే వస్తానని చెప్పి..



వేసవి సెలవులు కావడంతో భర్త, చిన్న కుమారుడితో కలిసి పుట్టింటికి వెళ్లారామె. రెండు రోజులు సరదాగా గడిపారు. ఇక ఇంటికి తిరిగి వెళ్దామని భర్త అనగా.. "ఈ ఒక్క రాత్రి ఉండి ఆదివారం పొద్దున్నే ఉదయం వస్తా" అన్నారు. దీంతో వారిద్దరూ శనివారం రాత్రే వెళ్లిపోయారు. ఆమె మాత్రం ఇచ్చినమాట నిలబెట్టుకోలేదు. ఈ అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన రజనీ విషాద గాథ ఇది. "పొద్దున్నే అమ్మ ఇంటికి వస్తుందని ఎదురు చూశాం. కానీ.. చనిపోయింది" అంటూ ఆమె పెద్ద కుమారుడు కుషాల్ కన్నీటి పర్యంతమయ్యాడు. ఆమె రాత్రి తమతో వచ్చి ఉంటే ప్రాణాలతో ఉండేదని రజనీ భర్త రోదించారు. ఇక.. ఈ ప్రమాదంలో.. తమ ఇద్దరు పిల్లలు ప్రాన్షి, ప్రథమ్ అగర్వాల్‌ను కోల్పోయిన రోహిత్ అగర్వాల్ దంపతులు కంటికీ మంటికీ ఏకధారగా విలపిస్తున్నారు.

పిల్లల కోసం లోపలికెళ్లి..

ఈ ప్రమాదంలో మృతి చెందిన పంకజ్ నిజానికి మంటలు చెలరేగగానే బయటకు వచ్చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. అయితే.. రెండేళ్లు, ఐదేళ్ల వయసున్న తన పిల్లలు లోపల ఉండిపోవడంతో వారిని కాపాడుకునేందుకు మళ్లీ లోపలికి వెళ్లి ప్రాణాలు కోల్పోయాడని వెల్లడించారు.

ఆ నలుగురూ క్షేమంగా..

అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో.. ప్రహ్లాద్‌రాయ్ మోదీ కుటుంబసభ్యుల్లో నలుగురు రెండో అంతస్తులో ఉన్నారు. మంటలు చెలరేగగానే వారు భవనం పై భాగానికి వెళ్లి పక్కనున్న భవనంలోకి దూకేశారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది వారిని కాపాడారు. మొదటి అంతస్తులో ఉన్న వారు కూడా ఇలాగే భవనం పైకి వెళ్లి ఉంటే ప్రాణాలతో బయటపడేవారని ఒక అధికారి అభిప్రాయపడ్డారు.


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

గంటన్నర తర్వాతే ఫైరింజన్లు: ప్రహ్లాదరాయ్ కుటుంబసభ్యులు

అధికారుల అలసత్వమే ఈ ప్రమాదంలో ప్రాణనష్టం పెరగడానికి కారణమైందని ప్రహ్లాద్‌రాయ్ కుటుంబ సభ్యుడొకరు (పేరు చెప్పడానికి ఇష్టపడలేదు) ఉస్మానియా మార్చురీ వద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదం జరిగిందంటూ సమాచారం ఇచ్చిన గంటన్నర తర్వాత ఫైరింజన్ వచ్చిందని, కానీ అందులో నీళ్లు లేకపోవడంతో వెళ్లిపోయిందని ఆయన మండిపడ్డారు. అలాగే.. కొంత మంది యువకులు చిన్నారులను కాపాడి కిందకు తీసుకొచ్చి, అంబులెన్సుల్లో ఎక్కించగా.. లోపల ఆక్సిజన్ లేదని చెప్పారని తెలిపారు. ఆక్సిజన్ ఉండుంటే చిన్నారులు బతికేవారని.. కన్నీరు పెట్టుకున్నారు.

షార్ట్ సర్క్యూట్ ఆనవాళ్లే లేవు

మెట్రో జోన్ సీఈ చక్రపాణి వెల్లడి

హైదరాబాద్ సిటీ/ చార్మినార్, మే 18 (ఆంధ్రజ్యోతి): గుల్జార్ హౌజ్‌లో జరిగిన అగ్నిప్రమాదానికి ప్రాథమికంగా షార్ట్ సర్క్యూట్ కారణమని అగ్నిమాపక శాఖ అధికారులు, ప్రభుత్వ పెద్దలు తేల్చిచెప్పగా.. షార్ట్‌సర్క్యూట్ జరగలేదని, ఫీడర్ ట్రిప్ కాలేదని, పోలీసులు ఫోన్ చేసిన తర్వాత విద్యుత్ సరఫరా నిలిపివేశామని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. గుల్జార్ హౌస్‌లో ప్రమాదం జరిగిన కమర్షియల్ భవనాన్ని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ మెట్రో జోన్ సీఈ చక్రపాణి, హైదరాబాద్ సౌత్ సర్కిల్ ఎస్ఈ సోమిరెడ్డి పరిశీలించారు. ఆ ఇంటిలో షార్ట్‌సర్క్యూట్ జరిగిన ఆనవాళ్లు లేవని.. విద్యుత్ మీటర్ దగ్గర ఫ్యూజ్ పోవడం, ఫీడర్ ట్రిప్పు కావడం వంటి సమస్యలు తలెత్తలేదని వారు స్పష్టం చేశారు. "విద్యుత్ మీటర్ బాగానే ఉంది.. ఆదివారం ఉదయం 7.28 గంటల సమయంలో పోలీసులు అగ్నిప్రమాదం జరిగిందని చెప్పగానే ఆ ప్రాంతంలో విద్యుత్‌సరఫరా నిలిపివేసినట్లు స్థానిక ఏడీఈ మాకు తెలిపారు. షార్ట్‌సర్క్యూట్ జరిగితే మీటర్లు కాలిపోయే, ఫీడర్ ట్రిప్పయ్యే అవకాశాలుంటాయి.. బయట అలాంటి పరిస్థితులు కన్పించలేదు" అని చక్రపాణి తెలిపారు.

మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల సాయం

- క్షతగాత్రులకు రూ.50 వేల పరిహారం: మోదీ
- ప్రమాదంపై ప్రధాని, రాష్ట్రపతి, గవర్నర్ దిగ్ర్భాంతి
- ఘటన అత్యంత బాధాకరం: రాహుల్, ఖర్గే

న్యూఢిల్లీ, మే 18 (ఆంధ్రజ్యోతి): గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఘటనలో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున సాయం అందిస్తామని తెలిపారు. ప్రమాదంలో ఎక్కువ మంది మృతి చెందడం తనను ఎంతో కలచివేసిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని మోదీ ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మహిళలు, పిల్లలు సహా అనేక మంది మరణించడం బాధాకరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆత్మీయులను కోల్పోయిన వారి బాధ వర్ణనాతీతమని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అగ్ని ప్రమాదంలో 17 మంది మరణించడం తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గుల్జార్‌హౌజ్ ప్రమాదంలో పలువురు మృతి చెందడం, అనేక మంది గాయపడటం అత్యంత బాధాకరమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదం గురించి తెలియగానే సీఎం రేవంత్ రెడ్డికి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఫోన్ చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు సహాయ చర్యల్లో పాల్గొనాలని ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు. ఎంపీ ప్రియాంక గాంధీ సైతం మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

సహాయ చర్యల్లో ఆలస్యం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): గుల్జార్‌హౌజ్ ప్రమాద స్థలాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. సహాయ చర్యల్లో అగ్నిమాపక సిబ్బంది ఆలస్యం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. చిన్న ప్రమాదమే అయినా, ప్రాణనష్టం ఎక్కువగా ఉందన్నారు. అగ్నిమాపక సిబ్బందికి ప్రభుత్వం సరైన పరికరాలు, శిక్షణ అందించాల్సి ఉందని చెప్పారు. అగ్నిమాపక శాఖ సాంకేతికతను మెరుగుపరుచుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదంలో 17 మంది మరణించడం బాధాకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. బాధితులకు కేంద్రం పరిహారం ప్రకటిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం సంతాపంతోనే సరిపెట్టుకుందని విమర్శించారు. గుల్జార్ హౌజ్ ప్రమాదం తీవ్రంగా కలచివేసిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది వేగంగా స్పందించి ఉంటే ఇంత దారుణం జరిగేది కాదని అభిప్రాయపడ్డారు. అగ్ని ప్రమాదం పట్ల మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు.

కేసీఆర్, కేటీఆర్, హరీశ్, అసద్ విచారం

గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందడం పట్ల మాజీ సీఎం కేసీఆర్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అగ్ని ప్రమాదం చాలా బాధాకరమని, బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. వేసవిలో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు వ్యూహం అనుసరించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందడం దిగ్ర్భాంతి కలిగించిందని మజ్లిస్ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఘటనా స్థలాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఉస్మానియా ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘటన హృదయ విదారకం: మంత్రి జూపల్లి

గుల్జార్ హౌజ్ ప్రమాదంపై మంత్రి జూపల్లి కృష్ణారావు దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గుల్జార్ హౌజ్ ప్రమాదం పట్ల టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అగ్ని ప్రమాదంలో 17 మంది చనిపోవడం దురదృష్టకరమని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. విషయం తెలిసిన వెంటనే ఆయన ఘటనా స్థలాన్ని సందర్శించారు.

ఇంటి నిర్మాణ శైలి..మరణ శాసనమైందా?

హైదరాబాద్ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): గుల్జార్‌హౌజ్ అగ్నిప్రమాదం కేసులో ఇంటి నిర్మాణ శైలి 17 మంది పాలిట మరణశాసనమైందని పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు. 175 గజాల విస్తీర్ణంలో బయటకు జీ+1గా భవన నిర్మాణం కనిపిస్తున్నా.. లోపలి నుంచి మాత్రం జీ+2గా ఉంది. మంటలు ఆర్పేందుకు వెళ్లిన అగ్నిమాపక సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించారు. ఈ భవనంలో ప్రధాన రహదారి వైపు మూడు షెట్టర్లను నిర్మించారు. వాటిల్లో కృష్ణ పెరల్స్, మోదీ పెరల్స్ దుకాణాలను ఇంటి యజమాని నిర్వహిస్తుండగా.. ఇక్రం జ్యువెల్లర్స్ ఉన్న మడిగెను అద్దెకు ఇచ్చారు. ఇంటి యజమాని కుటుంబం పై అంతస్తుల్లో నివసిస్తుండగా.. మెట్లకు మార్గం కృష్ణ పెరల్స్ లోపలి నుంచే ఉంది. అది తప్ప.. పైన ఉండేవారు బయటకు వచ్చేందుకు మరో దారి లేదు. ఈ కారణంగా.. మొదటి అంతస్తులో అగ్నిప్రమాదం జరగ్గానే.. లోపలివైపు మొత్తం పొగలు వ్యాపించాయి. బటయకు వచ్చే మార్గం లేక.. లోపలే చిక్కుకుపోయిన 17 మంది మృత్యువాత పడ్డారు. వీరిలో ఎక్కువ మంది దట్టమైన పొగను పీల్చడం వల్లే చనిపోయారని పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు చెబుతున్నారు.

ప్రమాదంపై కేసు నమోదు

హైదరాబాద్ సిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాద ఘటనపై మృతుల బంధువు ఉత్కుష్ మోడీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చార్మినార్ పోలీసులు తెలిపారు. ప్రమాదం జరగకముందు అక్కడి పరిస్థితులు, ఘటన జరగడానికి గల కారణాలు, ప్రమాద తీవ్రతకు దారి తీసిన అంశాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫైర్, విద్యుత్తు, పోలీస్ విభాగాల అధికారులతో విచారణ జరిపి, ఆధారాలను సేకరించి, నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రాథమికంగా సేకరించిన వివరాల ప్రకారం.. బయటకు వెళ్లే దారిలేకపోవడం, దట్టమైన పొగ పీల్చడం వల్లనే మృతుల సంఖ్య పెరిగినట్లు తేలిందన్నారు. ఘటనా స్థలంలో ముగ్గురు చనిపోగా.. మిగిలిన 14 మంది ఆస్పత్రులకు తరలించే క్రమంలో మృతి చెందినట్లు గుర్తించామని పోలీసులు వివరించారు.

టెర్రస్‌కు తాళం.. ప్రాణాలు ఆగం..?

గుల్జార్ హౌజ్‌లోని మొదటి, రెండో అంతస్తుల్లో మంటలు, దట్టమైన పొగలు వ్యాపించిన క్రమంలో బాధితులు భవనం పైకి వెళ్లడానికి ప్రయత్నించినట్లు తెలిసిందని అగ్నిమాపక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే టెర్రస్ పైన ఉన్న కార్మికులు మెట్ల ద్వారానికి తాళం వేయడంతో పైకి వెళ్లే మార్గం లేక, తప్పించుకునే అవకాశం లేక బాధితులు మృత్యువాత పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొంది. అయితే.. "టెర్రస్ పైన నిజంగానే కార్మికులు ఉన్నారా..? ఇంత పెద్ద అగ్ని ప్రమాదం జరిగితే పైన ఉన్న కార్మికులు ఏమయ్యారు..? ఎందుకు బాధితులను కాపాడే ప్రయత్నం చేయలేదు..? అగ్ని ప్రమాదంలో ఏదైనా కుట్ర ఉందా..?" అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని అగ్నిమాపక శాఖ వెల్లడించింది.

సీఎం రేవంత్‌రెడ్డి దిగ్ర్భాంతి

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి దారితీసిన అసలైన కారణాలను లోతుగా దర్యాప్తు చేయాలంటూ సమగ్ర విచారణకు ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని, ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే.. మంటల్లో చిక్కుకున్న కుటుంబాలను ఆదుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. పోలీసులు, ఫైర్ విభాగం చేపడుతున్న చర్యలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సౌకర్యం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. సంఘటన స్థలానికి వెళ్లి సహాయక చర్యలను స్వయంగా సమీక్షించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదేశించారు. ప్రమాదంలో 17 మంది మృతి చెందడం బాధాకరమని సీఎం అన్నారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. బాధిత కుటుంబాలకు చెందిన వారితో ఫోన్‌లో మాట్లాడి ఓదార్చారు. కాగా, అగ్నిప్రమాదం జరిగిన ఘటనా స్థలానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. ఆదివారం మధ్యాహ్నం మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహతో కలిసి వెళ్లారు. సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు.


ప్రమాదం జరిగిన భవనాన్ని పరిశీలిస్తున్న భట్టి, పొన్నం, షబ్బీర్‌అలీ

కిషన్‌రెడ్డి వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా

- అగ్నిమాపక శాఖ సిబ్బంది ఆలస్యంగా వెళ్లారనడం సరికాదు
- షార్ట్‌సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగింది: అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి

హైదరాబాద్ సిటీ/చార్మినార్, మే 18 (ఆంధ్రజ్యోతి): "గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా. అగ్నిమాపక శాఖ వద్ద అత్యాధునిక పరికరాలు లేవని వ్యాఖ్యానించడం బాధాకరం. సరైన సమయంలో అగ్నిమాపక సిబ్బంది రాలేదనడం అవాస్తవం. అగ్ని ప్రమాదం జరిగినట్లు ఉదయం 6.16 గంటలకు సమాచారం అందగా.. వెంటనే మొఘల్‌పురా అగ్నిమాపక సిబ్బందిని అప్రమత్తం చేసి ఘటనా స్థలానికి పంపించాం. తర్వాత 11 ఫైరింజన్లు సహా మొత్తం 87 మంది ఫైర్ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. నేనే స్వయంగా వచ్చి ఘటనను పరిశీలించా" అని అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి తెలిపారు. భవనం మొదటి అంతస్తుకు వెళ్లే దారిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగడమే ప్రమాదానికి కారణమని తెలిపారు. మొదటి అంతస్తులో తీవ్రంగా గాయపడి, స్పృహ కోల్పోయిన 17 మందిలో అందరూ చనిపోవడం బాధాకరమన్నారు. రెండో అంతస్తు నుంచి నలుగురిని రక్షించగలిగామని తెలిపారు. ప్రమాదం జరిగిన భవనం చాలా పాతదని, ఫైర్ సేఫ్టీ నిబంధనలేవీ పాటించకపోవడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని ఆయన వివరించారు.

చర్లపల్లిలో అగ్ని ప్రమాదం.. తప్పిన ముప్పు

బ్యాటరీ పేలుడుతో దగ్ధమైన ఖాళీ ట్యాంకర్



కుషాయిగూడ, మే 18 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి పారిశ్రామిక వాడలో చర్లపల్లి రైల్వే టర్మినల్‌కు వెళ్లే దారిలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. పెను ముప్పు తప్పింది. ప్రత్యక్ష సాక్షులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి వాసి కడియాల భవానీ(50).. భవానీ ట్రాన్స్‌పోర్టు పేరిట గ్యాస్, ఆయిల్ ట్యాంకర్లు నడుపుతున్నారు. తాను నడిపే ట్యాంకర్లలో ఒక ట్యాంకర్ (ఏపీ29 డబ్ల్యూ 0279)ను అమ్మకానికి పెట్టారు. దాని కొనడానికి వచ్చిన హైదరాబాద్ నగర వాసి పి.రవి.. ఆదివారం మధ్యాహ్నం 1.20గంటలకు టెస్ట్ డ్రైవింగ్‌కు వెళ్లాడు. ఐఓసీ పెట్రోల్ బంక్ వద్ద ట్యాంకర్‌ను స్టార్ట్ చేసి.. బీపీసీఎల్ గ్యాస్ కంపెనీ ఎదురుగా యూ-టర్న్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. ఆయిల్ ట్యాంకర్‌లోని బ్యాటరీ పేలడంతో ఫ్యూయల్ ట్యాంకులో 120 లీటర్ల డీజిల్ ఉండటంతో ఎగసి పడ్డ మంటలు.. పక్కనే ఉన్న రెండు ఖాళీ సిలిండర్ల వాహనాలకు అంటుకున్నాయి. అగ్ని మాపక దళ సిబ్బంది 4 ఫైరింజన్లలో వచ్చి మంటలు ఆర్పేశారు. ఈ ఘటనలో భవానీ ట్రాన్స్‌పోర్టు ట్యాంకర్‌తోపాటు అక్కడ ఖాళీ సిలిండర్లతో నిలిపి ఉన్న 2 వాహనాల టైర్లు దగ్ధమయ్యాయి.

మూడంతస్తులకు మంటలు.. పొగ

షార్ట్‌సర్క్యూట్‌తో ఘటన.. 50 మందిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

రాజేంద్రనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా మైలార్ దేవపల్లి మొగల్స్ కాలనీ ప్రాంతంలోని మూడంతస్తుల ఇంట్లో మంటలు, పొగలు చెలరేగాయి. మొగల్స్ కాలనీకి చెందిన షేక్ మాజిద్(45) మూడంతస్తుల భవనాన్ని నిర్మించాడు. మాజిద్‌తో పాటు మరో ఏడు కుటుంబాలు ఈ ఇంట్లో అద్దెకు ఉంటున్నాయి. ఆదివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో గ్రౌండ్ ఫ్లోర్‌లోని విద్యుత్తు మీటర్ల వద్ద షాట్ సర్క్యూట్ అయింది. దీంతో మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఇంటి యజమానికి చెందిన పాత ఫర్నిచర్‌తో పాటు ఇతర వ్యర్థాలకు మంటలు వ్యాపించాయి. మంటలు ఎగసిపడుతుండడంతో పాటు పొగ కమ్ముకోవడంతో మూడు అంతస్తుల్లోని దాదాపు 50 మంది చిన్న, పెద్దలు బయటికి వచ్చేందుకు మార్గం లేకుండా పోయింది. దీంతో వారంతా టెర్రస్ పైకి వెళ్లారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అప్పటికే పాతబస్తీలో అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లడంతో విషయాన్ని చాంద్రాయణగుట్ట అగ్నిమాపక కేంద్రానికి తెలిపారు. వెంటనే స్పందించిన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి, టెర్రస్‌పైన ఉన్న 50 మందిని సురక్షితంగా కిందకు తీసుకొచ్చారు. ఈ ఘటనపై మైలార్ దేవపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర

- ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు
- నిందితులకు ఐఎస్‌తో సంబంధాలు

హైదరాబాద్/విజయనగరం, మే 18 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇస్లామిక్ స్టేట్(ఐఎస్), ఇతర ఉగ్రవాద సంస్థల నిద్రాణ దళాల(స్లీపర్‌సెల్స్)పై దృష్టి సారించిన పోలీసులు.. హైదరాబాద్‌లో పేలుళ్ల కుట్రను భగ్నం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో.. హైదరాబాద్, విజయనగరం నుంచి ఇద్దరిని అరెస్టు చేశారు. వీరిలో హైదరాబాద్ వారాసిగూడకు చెందిన సయ్యద్ సమీర్, విజయనగరానికి చెందిన సిరాజ్-ఉర్-రెహ్మాన్ ఉన్నారు. సౌదీ అరేబియాలోని ఐఎస్ ఉగ్రవాదుల(హ్యాండర్లు) నుంచి వీరికి ఆదేశాలు వచ్చినట్లు ఇరురాష్ట్రాల నిఘా వర్గాలు గుర్తించాయి. హైదరాబాద్‌లో పేలుళ్ల కోసం వీరు విజయనగరంలో అమ్మోనియం సల్ఫేట్, అల్యూమినియం పౌడర్‌ను కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో బాంబులను తయారు చేశారని నిర్ధారించాయి. ఇలా తయారు చేసిన బాంబులను పరీక్షించేందుకు కొన్ని ప్రదేశాలను వీరు ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. హైదరాబాద్‌లో వీరి టార్గెట్ ఏమిటి? ఎక్కడ పేలుళ్లకు కుట్రలు పన్నారు? ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఎవరెవరు సహకరిస్తున్నారు? అనే కోణాల్లో వీరిని విచారించనున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

పోలీసు శాఖలో కుటుంబం

సిరాజ్-ఉర్-రెహ్మాన్ తండ్రి, సోదరుడు పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తున్నట్లు విజయనగరం పోలీసులు చెప్పారు. శనివారం తెల్లవారుజామున జిల్లా కేంద్రంలోని అంబటి సత్రం వద్ద వీరి ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. సిరాజ్ బీటెక్ పూర్తి చేసి, హైదరాబాద్‌లోని పలుచోట్ల ఉద్యోగాలు చేశాడు. ఆ సమయంలోనే ఇతనికి ఉగ్రవాద మాడ్యూల్స్‌తో పరిచయం ఏర్పడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఐఎస్ సూచనలతో పేలుళ్లతో విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నాడని అనుమానిస్తున్నారు. ఇతను ఆన్‌లైన్‌లో అమ్మోనియా, సల్ఫర్, అల్యూమినియం పౌడర్‌ను కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఆ తర్వాతే నిఘా విభాగాలు ఇతని కార్యకలాపాలపై ఆర్నెల్లుగా కన్నేసి ఉంచినట్లు తెలుస్తోంది. కొంత కాలంగా ఇతను సోషల్ మీడియాలో పాకిస్థాన్‌కు అనుకూల పోస్టులు పెడుతున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఇతణ్ని విచారించాకే.. హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్ పాత్ర వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఆ వెంటనే హైదరాబాద్ పోలీసులు సమీర్‌ను అరెస్టు చేశారు. వీరిద్దరినీ జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ ఉదంతంతో విజయనగరం జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక ప్రదేశాలను వీరు టార్గెట్‌గా చేసుకున్నారా? అనే చర్చ జరుగుతోంది.

మున్నేరు-పాలేరు లింక్ కెనాల్‌కు రూ.162.54 కోట్లు విడుదల



- సముద్రంలోకి పోయే నీరు గ్రావిటీ కెనాల్ ద్వారా మళ్లింపు
- సీఎం, సాగునీటి మంత్రికి కృతజ్ఞతలు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.162.54 కోట్లు విడుదల చేసింది. వృథాగా సముద్రంలోకి వెళ్తున్న మున్నేరు వాగు వరద నీటిని గ్రావిటీ కెనాల్ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించడానికి.. మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్టును చేపట్టారు. దీనికి నిధులు విడుదల చేస్తూ జీవో నెంబర్ 98ని విడుదల చేశామని ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సముద్రంలోకి పోయే వరద నీటిని రూపాయి ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా మళ్లించాలన్న ఆలోచన ఈ రాష్ట్రాన్ని పదేళ్ల ఏలిన ప్రభుత్వానికి రాలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల వృథాగా పోతున్న వరద నీటిలో 10 టీఎంసీల వరద నీటిని పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించవచ్చని తెలిపారు. దీనివల్ల ఈ రిజర్వాయర్ పరిధిలో 2.54 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని, ఇందులో ఒక్క పాలేరు నియోజకవర్గంలోనే 1.30 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అవుతుందన్నారు. పాలేరు లింక్ కెనాల్‌కు నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు తాగునీరు, డోర్నకల్ నియోజకవర్గం పరిధిలో పది చెరువులకు సాగునీటి కోసం ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. నిర్దేశించిన గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు.



వాహనంలో అరటిగెలల మాటున కనిపిస్తున్న గోవులు

అరటి గెలల కింద గోవుల అక్రమ రవాణా

- భువనగిరి జిల్లా పంతంగి వద్ద పట్టివేత
- పోలీసుల అదుపులో నిందితులు

చౌటుప్పల్ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): వాహనంలో పైన అరటి గెలలు.. కింద గోవులను ఉంచి అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పిఠాపురం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా 28 గోవులను తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నారు. నిందితులు రంగారెడ్డి జిల్లా మంతాల మండలం చెన్నారెడ్డి గూడేనికి చెందిన డీసీఎం డ్రైవర్ రమావత్ షరత్ కుమార్, క్లీనర్ దాసరి భగవాన్‌ను అరెస్టు చేసినట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు. పట్టుకున్న ఆవులను హైదరాబాద్ గోశాలకు తరలించామని పేర్కొన్నారు.

ఆట వస్తువు పిన్ను గొంతులో ఇరుక్కుని చిన్నారి మృతి

- వర్గల్ మండలం నాచారంలో ఘటన



అనబియా

వర్గల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఆట వస్తువును మింగడంతో ఊపిరాడక 14 నెలల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో ఆదివారం జరిగింది. నాచారం గ్రామానికి చెందిన నర్సింహులు వద్ద హరియాణాకు చెందిన షోయబ్‌ఖాన్ జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య నదియా, కూతురు అనబియా, కుమారుడు ఉన్నారు. అనబియా శనివారం ఇంటివద్ద బొమ్మలతో ఆడుకుంటూ బొమ్మకు ఉన్న ఓ పిన్నును మింగింది. దాంతో ఊపిరాడక ఇబ్బంది పడుతున్న చిన్నారిని గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది.

నేడు 'సౌర గిరి జలవికాసం' ప్రారంభం

నల్లమలలోని మాచారంలో లబ్ధిదారులకు సోలార్ పంపుసెట్లు పంపిణీ చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి

- బహిరంగ సభ అనంతరం స్వగ్రామానికి సీఎం

హైదరాబాద్/నాగర్‌కర్నూల్, మే 18 (ఆంధ్రజ్యోతి): రికార్డ్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్ (ఆర్‌వోఎఫ్‌ఆర్) పట్టా భూముల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఇందిర సౌర గిరి జలవికాసం పథకం సోమవారం ప్రారంభం కానుంది. నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించి.. లబ్ధిదారులకు సోలార్ పంపుసెట్లను పంపిణీ చేయనున్నారు. అనంతరం అక్కడి సీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకుని, అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పలువురు మంత్రులు కూడా పాల్గొననున్నారు. అటవీ భూముల్లో పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనుల భూముల్లో బోర్లు వేసి, పండ్ల తోటలను పెంచి, అందులో అంతర పంటలను సాగు చేసి స్థానికులకు శాశ్వత ప్రాతిపదికన ఉపాధి కల్పించేందుకు ఈ పథకాన్ని రూపొందించారు. అటవీ భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు వాటిపై యాజమాన్య హక్కులను కల్పించేందుకు ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టాన్ని యూపీఏ ప్రభుత్వం 2006లో తీసుకువచ్చింది. ఈ చట్టం కింద తెలంగాణలో 2.30 లక్షల మంది గిరిజన రైతులకు 6.69 లక్షల ఎకరాల అటవీ సాగుభూమిపై అప్పటి ప్రభుత్వం యాజమాన్య హక్కులను కల్పిస్తూ పట్టాలు ఇచ్చింది. అయితే ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టంలోని మార్గదర్శకాలను అనుసరించి ఆ భూముల అభివృద్ధికి మాత్రం చర్యలు తీసుకోలేదు. ఆ తర్వాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వమూ ఆ భూముల అభివృద్ధిపై దృష్టి సారించలేదు.

ఆర్‌వోఎఫ్‌ఆర్ భూముల అభివృద్ధి కోసం..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా భూముల సమగ్ర అభివృద్ధి కోసం ఇందిరా సౌర గిరి జలవికాసం పేరుతో పథకాన్ని రూపొందించింది. తద్వారా ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలున్న 2.10లక్షల మంది గిరిజన రైతుల భూములతోపాటు ఈ చట్టంతో సంబంధం లేకుండా అటవీప్రాంతాల్లో భూమి ఉన్న ఇతర గిరిజన రైతుల భూములనూ ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. 2025-26 నుంచి 2029-30 వరకు ఐదేళ్ల కాలవ్యవధిలో రూ.12,600 కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని అమలు చేయనుంది. యూనిట్ ధర రూ.6 లక్షలు కాగా, వంద శాతం సబ్సిడీతో పథకం మంజూరు కానుంది. ఈ రూ.6 లక్షలతో భూమి అభివృద్ధి, ఆఫ్ గ్రిడ్ సోలార్ పంప్ నీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు, డ్రిప్ ఇరిగేషన్‌తో ఉద్యాన తోటల పెంపకం చేపట్టనున్నారు. ఈ ఏడాది రూ.600 కోట్లతో 10 వేల మంది గిరిజన రైతులకు చెందిన 27,184 ఎకరాల భూములను అభివృద్ధి చేయనున్నారు. ఈ పథకంతో మాచారంలో 49 ఎకరాల ఆర్‌వోఎఫ్‌ఆర్ భూములు అభివృద్ధి చెందనున్నాయి.

కొండారెడ్డిపల్లికి సీఎం రేవంత్

మాచారంలో కార్యక్రమాలు పూర్తయిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లాలోనే ఉన్న తన స్వగ్రామం కొండారెడ్డిపల్లికి చేరుకుంటారు. ఆ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.



నా ఆత్మకథ పుస్తక ఆవిష్కరణకు రండి

చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలకు దత్తన్న ఆహ్వానం

హైదరాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): జూన్ మొదటి వారంలో హైదరాబాద్‌లో జరిగే తన ఆత్మకథ తెలుగు పుస్తక ఆవిష్కరణకు రావాలంటూ తెలంగాణ, ఏపీ సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబులను హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆహ్వానించారు. ఆదివారం హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో కలిసిన దత్తాత్రేయ.. ఈమేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు. దత్తాత్రేయ ఆత్మకథ హిందీ వెర్షన్ "జనతాకీ కహానీ.. మేరీ ఆత్మకథ" పేరుతో ఇటీవల ఢిల్లీలో విడుదలైన సంగతి తెలిసిందే. దాన్ని "ప్రజల కథే.. నా ఆత్మకథ" పేరుతో తెలుగులో విడుదల చేస్తున్నట్లు ఏపీ, తెలంగాణ సీఎంలకు దత్తాత్రేయ తెలిపారు. ఆయనతో పాటు అలయ్‌బలయ్ ఫౌండేషన్ ఛైర్మన్ బండారు విజయలక్ష్మి, జిగ్నేష్‌రెడ్డి ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఇసుక లారీ

ఇద్దరి మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం

- 25 మందికి గాయాలు.. తాడ్వాయిలో ప్రమాదం

తాడ్వాయి, మే 18 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారమ్మ దర్శనానికి వచ్చి వెళుతున్న వారిపైకి ఇసుక లారీ మృత్యుశకటంలా దూసుకెళ్లింది. వారు ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన 35మంది ట్రాక్టర్‌లో మేడారం వనదేవతల దర్శనానికి ఆదివారం ఉదయం వచ్చారు. మొక్కుల అనంతరం తిరుగు ప్రయాణంలో తాడ్వాయి వద్ద 163 జాతీయ రహదారిపై కూల్‌డ్రింక్స్ తాగడానికి ఓ దుకాణం వద్ద ఆగారు. ఏటూరునాగారం వైపు నుంచి వస్తున్న ఇసుక లారీ ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టింది. ట్రాక్టర్ ట్రాలీ ఎగిరిపడటంతో ఉప్పు దుర్గ (38), చేతుపల్లి సీత(40) చనిపోయారు. చేతుపల్లి సిద్దు(20), చేతుపల్లి ముత్తమ్మ (45) పరిస్థితి విషమంగా ఉంది. 25 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు ఆస్పత్రులకు తరలించారు.

కారు డోర్లు లాకై.. చిన్నారుల మృతి

కారులో ఆడుకునేందుకు వెళ్లిన పిల్లలు.. డోర్లు లాకై ఊపిరాడక నలుగురి కన్నుమూత

- విజయనగరం జిల్లా ద్వారపూడిలో విషాదం



అక్కాచెల్లెళ్లు జస్విత, చారుమతి, ఉదయ్, మనస్వి

విజయనగరం/విజయనగరం క్రైం, మే 18(ఆంధ్రజ్యోతి): వారంతా ఏమీ ఎరుగని చిన్నారులు. ఓ శుభకార్యంలో కలుసుకున్నారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ సరదా సమయంలో సమీపంలోని ఓ కారెక్కారు. అందులోనే ఆడుకునేందుకు ప్రయత్నించారు. కానీ.. అదే వారికి 'చివరి ఆట' అవుతుందని ఊహించలేకపోయారు. కారు డోర్లు లాక్ కావడంతో ఊపిరాడక ఆ చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. విజయనగరం సమీపంలోని ద్వారపూడి గ్రామంలో ఆదివారం జరిగిన ఈ విషాద ఘటనలో నలుగురు చిన్నారులు తుదిశ్వాస విడిచారు. ద్వారపూడి గ్రామానికి చెందిన జోగ పరమేశ్ తన కారును రోడ్డుపై పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లాడు. అక్కడికి సమీపంలోని ఇంట్లో శుభకార్యం జరుగుతోంది. దీనికి వచ్చిన నలుగురు చిన్నారులు కంది మనస్వి(7) మంగి ఉదయ్(8), బూర్లి జస్విత(7), బూర్లి చారుమతి(5) ఆడుకునేందుకు కారులోకి వెళ్లారు. కొద్దిసేపటికి ఆటోమేటిక్‌గా డోర్లు లాక్ అయ్యాయి. ఆటలో మునిగిపోయిన చిన్నారులు ఈ విషయాన్ని గుర్తించలేకపోయారు. అయితే.. డోర్లు లాక్ కావడంతో వారికి ఊపిరి ఆడడం కష్టమైంది. తర్వాత కొద్దిసేపటికే నలుగురూ కారులోనే మృతి చెందారు. చాలా సేపటి తర్వాత.. తమ చిన్నారులు కనిపించకపోవడంతో వారి కుటుంబసభ్యులు ఆందోళనతో పక్కనే ఉన్న నుయ్యి, రైలు ట్రాక్, సమీపంలోని పొలాలు, తోటల్లో వెతికారు. వెతుకుతూ కారు వైపుగా వచ్చారు. వర్షం నీటికి కారు అద్దాలు శుభ్రమై లోపలున్న చిన్నారులు అచేతన స్థితిలో కంట పడ్డారు. వెంటనే అద్దాలు పగులగొట్టి వారిని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతి చెందిన చిన్నారుల్లో బూర్లి జస్విత(7) బూర్లి చారుమతి(5) అక్కాచెల్లెళ్లు. మరో బాలిక కంది మనస్వి(7) సురేశ్, అరుణ దంపతులకు ఏకైక కుమార్తె. దీంతో ఆ కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి.

డీడీ కట్టినా.. శ్రీవారి సేవకు నో!

- వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించిన దంపతులు
- కమిషన్ తీర్పుతో దిగొచ్చిన టీటీడీ అధికారులు
- దంపతులకు తిరుప్పావడ సేవా టికెట్‌ల అందజేత



శెట్టి చంద్రశేఖర్ దంపతులు

మహబూబ్‌నగర్ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి సేవ కోసం కోర్టు మెట్లు ఎక్కిన దంపతులు చివరకు విజయం సాధించారు. దాదాపు 17 ఏళ్ల పాటు కోర్టులో పోరాడి సేవా టికెట్‌లను పొందారు. మహబూబ్‌నగర్‌కు చెందిన వ్యాపారవేత్త శెట్టి చంద్రశేఖర్ దంపతులు, కుటుంబ సభ్యులు తిరుమల వేంకటేశ్వర స్వామికి తిరుప్పావడ, మేల్ చాట్ వస్త్ర సేవలో పాల్గొనేందు కు 2008 నవంబరు 26న డీడీ రూపంలో రూ. 21,250 చెల్లించారు. కానీ ఏళ్ల గడిచినా వారికి అవకాశం దక్కలేదు. దీంతో వారు టీటీడీకి అనేక లేఖలు రాయగా, 2021, సెప్టెంబరు 10న సేవల్లో పాల్గొనేందుకు స్లాట్ బుక్ అయింది. కానీ, కరోనా కారణంగా ఆ సేవలు రద్దు చేశామని, వాటి స్థానంలో బ్రేక్ దర్శనం కల్పిస్తామని టీటీడీ సమాచారం అందించింది. దీంతో వారు న్యాయం కోసం మహబూబ్‌నగర్ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించారు. 4 రోజుల్లోగా తిరుప్పావడ, మేల్ చాట్ వస్త్ర సేవలో పాల్గొనే అవకాశం కల్పించాలని, లేకుంటే రూ.20 లక్షలు జరిమానా చెల్లించాలని కమిషన్ న్యాయాధికారి ఎం. అనురాధ గతేడాది మే 8న తీర్పు నిచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ టీటీడీ.. రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించింది. వివాదాన్ని అక్కడే పరిష్కరించుకోవాలని వారు జిల్లా కోర్టుకు తిప్పి పంపించారు. ఈనెల 15న కమిషన్ విచారించి.. తాము ఇచ్చిన తీర్పుకు కట్టుబడి భక్తులకు తిరుప్పావడ, మేల్‌చాట్ వస్త్ర సేవల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారా? లేక జరిమానా చెల్లిస్తారా? లేదా జైలుకు వెళ్తారా? అని కమిషన్ న్యాయాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో దిగొచ్చిన టీటీడీ అధికారులు.. చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు వచ్చే ఆగస్టు 14, 15 తేదీల్లో శ్రీవారి సేవలో పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తూ, సేవా టికెట్‌లను కోర్టు ద్వారా వారికి అందజేశారు.

నిజాం కాలం నుంచి రికార్డులు లేని 413 గ్రామాల్లో రీ సర్వే

- పైలట్‌గా 5 గ్రామాలు ఎంపిక
- వచ్చే వారం నుంచి ప్రయోగాత్మకంగా ప్రారంభం

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో నిజాం కాలం నుంచి ఉన్న నక్షాలకు మోక్షం కల్పించబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో నిజాం కాలం నుంచి సర్వే చేయని, లేదా సర్వే రికార్డులు లేని 413 గ్రామాలు ఉన్నాయని పేర్కొన్నారు. గత పదేళ్లలో ఈ సమస్యకు ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కారం చూపలేదని విమర్శించారు. ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలని నిర్ణయించిందని తెలిపారు. వచ్చే వారం నుంచి ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపడతామని, 413 గ్రామాల్లోని ఐదు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు నిర్వహించి దానిలో వచ్చే ఫలితాన్ని బట్టి మిగిలిన గ్రామాల్లోనూ రీ సర్వే చేపడతామన్నారు. ఆయా గ్రామాలలో ఆధునిక సాంకేతికను వినియోగిస్తూ రెండు పద్ధతులలో విస్తృత సర్వే జరుగుతుందన్నారు. ఏరియల్/డ్రోన్ సర్వే పద్ధతి ఒకటి కాగా, ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ పద్ధతి రెండోదని పేర్కొన్నారు. రెండు పద్ధతుల్లోనూ సర్వే చేసి జియో రిఫరెన్స్, క్యాడస్ట్రల్ మ్యాపులు, హక్కుల నమోదు పత్రాలను తయారు చేస్తారని తెలిపారు. ఈ నూతన విధానాల వలన భూమి సమాచారం, పారదర్శకత, వివాద పరిష్కారం, భూ యాజమాన్యంలో స్పష్టత వస్తుందని, రైతులు, గ్రామీణ భూయజమానులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాలలో రీ సర్వేలో అనుభవం కలిగిన ఆర్వీ అసోసియేట్స్, మార్వెల్ జియో స్పేషియల్, ఐబీసీ టెక్నాలజీస్, నియో జియో, డ్రోగో డ్రోన్ సంస్థలను ఎంపిక చేశామని మంత్రి తెలిపారు. కాగా, మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్, జగిత్యాల జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి(కొత్తది), ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాలను పైలట్ సర్వే కోసం ఎంపిక చేశారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **N. Rahul Kumar**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*